
TIGHT BINDING BOOK

UNIVERSAL LIBRARY
OU_204471
UNIVERSAL LIBRARY




COPY RIGHT

మహాకవి

కాళ్లకూరి నారాయణరావు

కాకినాడ.

# సుప్రసిద్ధ నాటకరాజములు

| | |
|---|---|
| సావిత్రినాటకము (శ్రీరాముల సచ్చిదానందశాస్త్రిగారు) | రు 1-0-0 |
| కనకతార (చందాల కేశవదాసుగారు) (మైలవరంకంపెనీది) | 1-4-0 |
| కంఠాభరణం (పానుగంటి లక్ష్మీనరసింహారావుగారు) | 1-0-0 |
| సంపూర్ణరామాయణము (గూడూరు కోటేశ్వరరావుగారు) | 1-4-0 |
| మహాభారత నాటకము (సంపత్న్ముడుంబ సింగరాచార్యులుగారు) | 1-4-0 |
| చిత్రనళీయము (నాటకసరస్వతి) | 1-4-0 |
| సంపూర్ణాంజనేయము (కొడాలి సత్యనారాయణగారు) | 1-0-0 |
| రాధాకృష్ణ (నాటకసరస్వతి) | 1-0-0 |
| సంగీత శ్రీకృష్ణలీలలు (సంపన్ముడుంబ సింగరాచార్యులుగారు) | 1-0-0 |
| హనుమద్రామ సంగ్రామము (బద్దిరెడ్డి కోటేశ్వరరావు) | 0-12-0 |
| శ్రీకృష్ణతులాభారము (చిదంబర ప్రణీతం) | 0-12-0 |
| వరవిక్రయము (యె. నారాయణరావు) | 1-0-0 |
| మహానంద (బద్దిరెడ్డి కోటేశ్వరరావు) | 1-0-0 |
| కాంతామతి (గూడూరు కోటేశ్వరరావు) | 0-12-0 |
| సంగీత విష్ణులీలలు (చక్రావధానుల మాణిక్యశర్మ) | 1-0-0 |
| శ్రీకృష్ణ రాయబారం (సోమరాజు రామానుజరావు) | 0-12-0 |

వలయువారు :

జనరల్ బుక్ డిపో,

బెజవాడ (కృష్ణాజిల్లా)

# మధుసేవ

సాంఘిక నాటకము.

చింతామణీ చిత్రాభ్యుదయాది గ్రంథకర్త
మహాకవి

## కాళ్లకూరి నారాయణరాయ

ప్రణీతము.

రెండవకూర్పు: 1000 ప్రతులు.

ప్రకటనకర్త:
కాళ్లకూరి సదాశివరావు.

బెజవాడ
వాణీముద్రాక్షరశాలయందు
ముద్రితము.

1929

వెల 1 రు.

All Rights) (Reserved.

# అవతారిక.

మన దేశమున కిప్పుడు మద్యపానము మహాశత్రువై యున్నది! ఈ దుర్వ్యసనమునకు లోనైనవారీ దేశమున నిప్పుడు రెండు కోట్లయిన నుండక పోరు! బ్రాంది విస్కీలవారి యెక్కుడువ్యయమును, కల్లుసారాలవారి తక్కువవ్యయమును గలిపి, తలకు దినమున కెనిమిది యణాలవంతునఁ జూచినను- రెండుకోట్లమీఁదను దినమునకుఁ గోటిరూప్యములు దగ్ధమగుచున్నట్లు తేలుచున్నది. అనఁగా: సంవత్సరమునకు మూడువందల యఱువది యైదుకోట్లన్నమాట! అనఁగా: మన దేశముపై దొరతనమువారికి వచ్చు నాదాయముకంటె రెండురెట్లధిక మన్నమాట! ఈ దుర్వ్యసనము హరించి, యీ సొమ్ము మిగిలినచో- మన దేశము మహదైశ్వర్యముతోఁ దులఁదూఁగదా! ఇప్పటి నేరములు- ఇప్పటిహత్యలు- ఇప్పటి కోర్టులు- ఇట్టె రూపుమాయవా! ఇంతకన్న స్వరాజ్య మింక నేమున్నది! కాఁబట్టి, యీ ప్రబలశత్రువును భస్మీకరించుటకై ప్రయత్నింపవలసిన బాధ్యత ప్రతి భారతీయునియందును గలదు. ఈ రూపముగా నాబాధ్యతను నిర్వర్తించుకొను తలంపుతో నే నీ రూపకమును వ్రాసినాఁడను. ఫలితము భగవదాధీనము!

పాత్రౌచిత్యము కొఱకును, పామరజన సుబోధముకొఱకును గావించిన భాషాసాంకర్యములనేమి- ప్రమాదములనేమి- పండితులు మన్నింపఁ గలరని భావించుచున్నాఁడను. గ్రంధమును గడతేఱఁ జూడకయె, గ్రంథకర్త యుద్దేశమును గూర్చి కాసింతయేని యోజింపకయె, సవరణముల నుపపాదించు సాహసికులను- కలములను కాగితములను బాడుసేయవల దని కడుంగడుఁ బ్రార్థించుచున్నాఁడను.

కాకినాడ,
1-5-26.

మహాకవి
కాళ్లకూరి నారాయణరావు.

A perfect judge will read each work of wit
With the same spirit that its author writ.

# ఇందలి పాత్రములు

1 రఘు- రఘునాధరావుగారు—కథానాయకుఁడు.

2 విశ్వా- విశ్వాసరావు—రఘునాధరావుగారి మేనేజరు.

3 శర్మ- రఘునాధరావుగారి దుష్టస్నేహితుడు.

4 నిర్మ- నిర్మల—రఘునాధరావుగారి భార్య.

5 కస్తూ- కస్తూరి—వేశ్య.

6 చిన్న- సిపాయి చిన్నయ్య—రఘునాధరావుగారి నవుకరు.

7 రంగ- రంగడు—ఒక త్రాగుబోతు.

8 వెంక- వెంకటేశము—కస్తూరి తమ్ముఁడు.

9 కాసిం- కాసింసాహేబు—కస్తూరి రహస్య విటుడు.

10 ఇన—ఇనస్పెక్టరు.

11 మేజి—మేజిస్ట్రేటు.

12 ప్రాసి—ప్రాసిక్యూటరు.

13 పంతు- పంతులు—రఘునాధరావుగారి వకీలు.

14 నాయు- నాయుడు—కస్తూరీ శర్మల బారిష్టరు.

## ప్రకటన

లిఖితరూపకమగు నాయనుమతిని పొందనివారు

ఈ నాటకమును ప్రదర్శింపఁగూడదు.

గ్రంథకర్త.

శ్రీ

మేధా దక్షిణామూర్తి పరబ్రహ్మణేనమః.



# మధుసేవ.

## నాంది

గౌరవ మాయువుఁ సిరి సు • ఖంబును దెల్వియు రూపడంచి, పై
వారికి హేయబుద్ధి, తమ • వారికి వ్యాకులతన్ ఘటించి, ని
స్సారులఁ జేయు దుర్వ్యసన • సంతతి పాల్పడకుండ మా సభా
స్తారులు నీశ్వరుండు సత • తంబును సత్కృపఁ గాచుఁ గావుతన్.

## ప్రస్తావన

సూత్ర—(ప్రవేశించి) ఓహో! నేటిసభ నేత్రపర్వముగా నున్న దే!

సీ. తక్కువతరగతి • టిక్కెట్లు కొని, మీఁది
చోటుల కేగి కూ • ర్చుండువారు
క్షణము జాగైనచోఁ • జప్పట్లు చఱచుచుఁ
గెవ్వున నూలలు • రువ్వువారు
ఇంచుకంత ప్రమాద • మెందేని వాటిల్ల
గొబ్బున లేవిడీల్ • గొట్టువారు
సమయాసమయముల • సంగతి లేకుండ
వన్సుమోరని బిట్టు • పఱచువారుఁ

గాక-కోవిదులును, గుణ • గ్రహణపరు, లు
దారమానసులును, సావ • ధానమతులు
నైన ప్రముఖులె విచ్చేయు • నట్టి భాగ్య
మబ్బినది నేఁడి దేమి పు • ణ్యంబొ కాని॥

(పరిక్రమించి, చేతులు మోడ్చి) ఓ సభాస్తారులారా!

సీ. పసితనమందె పా • వన వర్తనమునందు
బాగుగ నలవాటు • పడినవాఁడు

అప్రయత్నంబుగ • నఖిలవిద్యలతోడఁ
గరమును బరిచితిఁ • గన్నవాఁడు
బహుకృతి స్వీకార • భాగ్యంబునందు స
మానులు తన కెందు • లేనివాఁడు
ఎద్ది వచ్చిన మంచి • కే యను తత్త్వ మ
త్యంతంబు దృఢపడి • నట్టివాఁడు
ప్రాలుమాలిక యనియెడు • పదము తనదు
కోశమునను లేదనిపించు • కొన్న వాఁడు
బుద్ధిరాజాన్వవాయాబ్ధి • పూర్ణ చంద్రుఁ
డనుపమానుండు వీరభ • ద్రాహ్వయుండు.

అమ్మహానీయున కంకితముగా మహాకవి కాళ్ళకూరి నారాయణ రాయనిచే రచియింపఁబడిన మధుసేవ యను మహాప్రకరణ మిప్పుడు మీ సన్నిధిని బ్రయోగించు భాగ్య మబ్బినందులకుఁ బరమానందము నొందుచుఁ, బ్రమాదములను మన్నింపఁ బ్రార్థించు చున్నాఁడను. (తెరవంకఁ జూచి) ప్రియురాలా! ఏమి—తడవు ? ఏమంటివి ? —"మీ యనుజ్ఞయె తడ"వనియా ?—అట్లయిన, సభామంటపమునకు సమ్మో హన మంత్రముగా ముందు నీవు కొంచెము పాడుము.
తెరలో—

చ. వనజభవాండమెల్ల గెలు • వం బయనం బగు పుష్పసాయకుం
డనుప వసంతుఁ డాసవయు • తంబుగ నిల్పిన పానపాత్రలో
యన-నలవిచ్చినట్టి కుసు • మావళు లాసవపూరితంబు లై
కనులకు విందొనర్చు నధి • కంబున నిమ్మధువాసరంబునన్.

సూత్ర—సెబాసు ! చక్కఁగాఁ బాడితివి ! ఇదిగో నేను వచ్చి, సభ్యులకు నీ సంగీతామృత మైకము తగ్గక మున్నె రఘునాథరాయ పాత్రమును బ్రవేశపెట్టెద. (నిష్క్రమించును.)

ఇది ప్రస్తావన.

# మధుసేవ

## ప్రథమాంకము

ప్రదేశము: రఘునాథరావుగారి మేడమీఁది కచేరిచావడి.

ప్రవేశము: రఘునాథరావుగారు పడకకుర్చీలోఁ గూర్చుండి పత్రిక చదువుకొనుచు

రఘు— (చదువు నిలిపి, యొక్క నిట్టూర్పు పుచ్చి) మొత్తముమీఁదఁ బరిస్థితు లన్నియు బహు భయంకరములుగా నున్నవి!

చ. కలహ మొకవంక! జాతి మత • కక్షలొకానొకవంక! హత్యలున్
మరణము లొక్కవంక! దయ • మాలిన ధర్మవిరుద్ధ చర్యలున్
జెలఁగొకవంక! నోటికిని • జేతికిఁ గట్టడు లొక్కవంక! ఇ
త్తెలుఁగున దేశమెల్ల నతి • దీనదశావశ మయ్యె నే మనన్!

చ. తలఁకని స్వేచ్ఛతోఁ, బటువు • తప్పియెఱుంగని పౌరుషంబుతో,
నెలకొను శాంతితో, దిశలు • నిండిన కీరితితో, సమృష్టితోఁ
దొలఁగని భోగ భాగ్యముల • తోఁ, దులఁదూగిన దేశ మిప్పుడి
ట్టులు తలక్రిందులై, కుడిచె • దుస్స్మృతిలేని విపత్పరంపరల్!

(క్షణ మూరకుండి) మన దేశమున కెన్నఁడైన మరల మంచి యోగము పట్టునా!—ఎక్కడి యోగము—ఎక్కడి లోకము!

సీ. కొంపలు తెగనమ్మి • కోర్టుల, రైళ్ళఁ, గా
పీ హోటేళ్ళ, వకీళ్ళఁ • బెంచువారు
పండిన సరకెల్లఁ • బరదేశముల కంపి
కఱవున కిర వేఱు • పఱుచువారు
మూడుప్రొద్దుల ముష్టి • మూన్సిపల్ మెంబరు
పదవిలోఁ గనులు క • న్పడనివారు
ఆస్తి భార్యలపేర • అప్పులు తమపేరఁ
బెంచి, యై. పీ. లను • బెట్టువారు

బట్టకొఱకుఁ, జుట్టకొరకు • బ్రాందికొఱకు
సిరులు పరదేశములపాలు • సేయువారుఁ
బూర్తిగా నెల్లెడల వట్టి • పోవుదనుక
దేశమునకీ యరిష్టము • తీఱఁబోదు.

(ఉలికిపడి) ఏమిచెప్పుదురా యీ గోల ! (అని లేచి గవాక్షము గుండ వీథినంకఁ జూచి) ఎవనినో తప్పఁద్రాగిన దౌర్భాగ్యుని దండభటులు- చచ్చిన గేదెదూడనువలెఁ జరచర నీడ్చుకొని పోవుచుండ- సోమరులు కొందఱు చోద్యముగ్రిందఁ జూచుచు వానిని వెంబడించినారు ! సిగమునకీ పీడ, సింగారించిన ఘట్ట మీాద- ఒడ్డునఁ బడ్డ చేఁపవలె, ఓడ దిగిన నావికునివలె- తేపతేపకుఁ దెయితక్కలాడుచు- అనువు తప్పిన యవయవములతో, అలుకు పాఁతలైన యుడుపులతో; పెంట లూడ్చిన తలతో, పెచ్చు లూడిన యొడలితో- మద్యపానమువల్ల నీమందభాగ్యుఁ డేమి యానంద మనుభవించుచున్నాఁడో !

చ. జలములు గ్రోలి కుంజరము • సత్త్వసమృద్ధి మెలంగ నేర్చు, నా
జలములె త్రావి సింహము మతి • శౌర్య బల ప్రతిభాస్థితి న్మదా
వళ ఘన కుంభయుగ్మమును • వ్రద్దలు సేయును; వీని నాత్మలోఁ
దలఁపక, పానవృందము నరుఁ • డ్రావఁగఁగోరు ని దేమి వెఱ్ఱియో!

చిన్నయ్య—(ప్రవేశించి) బాబూ ! రంగ డీపూట కొంచెం రమ్ముసీళ్ళు బద్దకించి, పెళ్ళాన్ని కొట్టబోతే- ఆ దెబ్బ, అడ్డఁవెళ్ళిన అత్తగారికి తగిలిందంటండి- అందుకోసం పోలీసువా రాయెదవను టేశను కీడ్చుకుపోతున్నా రంటండి- యేల్నివారితో యీసంగతి చెప్పమని ఆడిపెళ్ళాఁ వొచ్చి అగోరిస్తోందండి.

రఘు— ఏమీా, యిప్పుడు పోలీసువారిచే నీడ్చుకొని పోఁబడుచున్న వాఁడు రంగఁడా ! ఇటువంటి విషయములలో మా నవుకర్లకు మేము సాయపడువారము కామని చెప్పుము !

చిన్న— చిత్తం బాబూ ! చిత్తం. ఇదే మా పల్లాలలో అయితే

యీపాటికి చీకటికొట్లో యేళా రన్నమాట. తెల్లోడు తాను తాఁగడఁవే కాని యెదటివాడు తాఁగడాని కెన్నడూ వొప్పుకోడు.

రఘు—సరే-నీసోదె చాలుఁగాని - వీలుగా నున్నయెడల నొకసారి పయికి రమ్మన్నానని విశ్వాసరావుగారితోఁ జెప్పిఁ - క్రొత్తగుఱ్ఱమునకు జీనుకట్టి కొనితెమ్మని గుఱ్ఱపువానికి వర్తమాన మంపుము.

చిన్న—చిత్తం బాబూ ! చిత్తం (అని నిష్క్రమించును.)

విశ్వా—(ప్రవేశించును)

రఘు—మామగారూ ! రంగనిసంగతివిన్నారా ?

విశ్వా—విన్నానుబాబు!-విన్నాను.

రఘు—తోడనే వీనిని కొలువునుండి తొలఁగించుట మంచిదికాదా?

విశ్వా—మంచిదేకాని - యొకసారి మందలించి చూతము.

రఘు—ఏమి వెఱ్ఱి ! గుగ్గిళ్ళు పెట్టిన గూనివంపు తీఱునా ?

ఆ. దూరదిబుంగ నరుఁడు, • దుర్వ్యసనంబులు
నివురు లేని చింత • నిప్పు రవలు;
స్పర్శమునకు దారి • సంఘటిల్లిన నంతు
చూడకుఁడ వీడ • నాకు లేడ !

అపయిని—

గీ. అంటురోగంబులకును, దు • ర్వ్యసనములకు
లేదు పరికింప భేదము • లేశమైని ;
దరికి రానిత్తు మేని-త • థ్యముగ ప్లేగు
పోలిక, క్షణంబులోఁ జుట్టు • ముట్టి తీఱు !

విశ్వా—నిజమే నిజమే. కావుననే, దుర్వ్యసనములకును మనకును దూరమెంతయున్న నంతమంచి దని పెద్దలు చెప్పుదురు. తమ సెలవు ప్రకారం మీరంగని తత్క్షణమే తొలఁగించెదను.

రఘు—(నవ్వుచు) సరి కాని, మామగారు! సాహసించి యడుగుచున్నాను- మీ కేమియు దుర్వ్యసనములు లేవు కద ?

విశ్వా—ఈశ్వరానుగ్రహమువల్ల నింతవఱకు లేవు !

రఘు—ఆఁ ! మామగా రిప్పుడు నాచేతిలో- మత్స్యము గాలమునఁ జిక్కినట్లు చిక్కినారు ! మీకు నస్యవ్యసనము లేదా ?

సీ. నస్యంబు దృష్టిని • నాశంబుగావించు
పొగచుట్ట పెదవుల • పొలుపుఁజెఱచు
బీడీలు జిహ్వాక • ప్రియమాచరించును
సిగరెట్టు గుండెను • సిధిలపఱుచు
మద్దతు బుద్ధికి • మాంద్యంబు కలిగించు
గంజాయి పిచ్చిని • గలుగఁ జేయు
కాపీ నరంబుల • కాపత్తుఁ గలిగించు
టీ పైత్యవృద్ధి ఘ • టిల్లఁ జేయు
మాదుము వివేక మెల్లను • మంటఁ గలుపు
భంగు జ్ఞాపకశక్తిని • భంగపఱుచు
అభిని రక్త మాంసంబుల • నార్చివేయుఁ
గాంచ, దుర్వ్యసనంబులు • కావె యివ్వి ?

విశ్వా—నస్య మంతకూడని దని నాకెన్నఁడుఁ దోచలేదు.

రఘు—అలాగుననా ! అట్లయిన నాలకింపుఁడు—

సీ. ఎంతటివానిచే • నేనియు బిడియంబు
వెడలించి, చేయి చా • పించితీఱు !

విశ్వా—ఆమాట నిజమే. వెంకమదొరగారుకూడ పొడుము ముష్టికి వెను కతీయరు !

రఘు—తఱచుగా నేడనో • దాఁకొని, వెత్తి యె
త్తించి, త్రైతక్కలా • డించితీఱు !

విశ్వా—ఏడనో కాదు. ఎదుట నుంచియే కంటి కగపడదు !

రఘు—ముందుగాఁ దన్నెత్తి • మూరొక్కనకున్నఁ, జే
యఁగఁ బూను పని కడ్డు • తగిలితీఱు !

విశ్వా—సందియు మేమి- భోజనసమయమునఁ గూడ పొడుము పీల్చినఁ గాని కథ నడువనివారు కావలసినంతమంది !

రఘు—ముక్కను ములుగుతూ • ముగఁజేసి, దేవుని
తిన్నపై నైన చీ • దించితీఱు!

విశ్వా—దేవుని తిన్నమీఁదనే కాదు-దేవుని తలపైఁగూడ నాయాటలో నప్పుడప్పు డభిషేకము జరుగుచునే యుండును!

రఘు—ఊటమరకలతో మేని • యుడుపులెల్ల
నించి, చాకలిచేత ది • ట్టించితీఱు!

విశ్వా—చాకలిచేతనే గాదు-వాకిలియూడ్చు దాసీదానిచేఁ గూడ చావుతిట్లు తినవలసిన దే!

రఘు—పలుపలుకు లేల-వెలయాలు • పగిది-నెత్తి
నెక్కి, కట్టు కుండలు చేతి • కిచ్చితీఱు!

విశ్వా—నిజమే బాబూ!- నిజమే! ఇదిగో- నా పొడుముబుఱ్ఱ నిప్పుడే పప్పుక్రింద బ్రద్దలుకొట్టెద! (అని యట్లు చేయును.)

రఘు—సెబాసు! నాజన్మ మిపుడు చరితార్థ మైనది! ఏమా?

గీ. ఏటవాలుగఁ బాఱెడి • యేటి నుండి;
వ్రణముపలె సల్పు తలమించు • ఋణమునుండి;
నాటుకొనినట్టి దుర్వ్యస • నములనుండి;
యొకనిఁ గాపాడినను జన్మ • మొప్పు నంద్రు.

పన్న—(ప్రవేశించి) బాబూ! గుఱ్ఱఁ వొచ్చిం దండి.

రఘు—మామగారు! నేనొకసారి మనతోటవఱకుఁ బోయి వచ్చెద. ఈపూఁట వచ్చిన యుత్తరము లివిగో యిచ్చట నున్నవి. (అని బల్లమీఁద యుత్తరములు చూపి, బట్టలు వేసికొని, చిన్నయ్యతో నిష్క్రమించును.)

విశ్వా—(ఉత్తరములం దీసికొనుచు) అవురా- అబ్బాయిగారి యోగ్యత! ప్రభువు లందఱు నిట్టివా రైనచోఁ బ్రజలభాగ్య మెట్లుండెడిదో గదా!

సీ. కోళ్ళతో, గొఱ్ఱెపొ • ట్టేళ్ళతో, సీమ కుం
దేళ్ళతోఁ గొలువులు • దీఱువారు!

వేలును లక్షలు • వెచ్చించి, కుక్కలఁ
గొని మూతి నాకించు • కొనెడివారు!
ఇంటిదాసీలకు • బంటులై, భార్యల
మోము లన్న మొగాలు • మండచువార!
పాడువేసాలకై, • బ్రాంది సీసాలకై
యెస్టేట్లనే విక్ర • యించువారు!
నై, జమీందారు లెందఱో • నైజకీర్తి
గంగలోఁ గల్పుచున్న యి • క్కాలమందు-
భాగ్యవశమునఁ గాక, యి • వ్వగిది పరమ
పావనుండైన ప్రభువు సం • ప్రాప్తమగునె!

చిన్న—(వడిగాఁ బ్రవేశించి) అయ్యో! అయ్యో!- రండి!- రండి!- పాడు గుఱ్ఱం బెదిరి బాబుగార్ని పడదోసిం దంట!

విశ్వా—(ఉలికిపడి) అరేరే! యెంతపని జరిగినది! అబ్బాయిగారి కేమియు దెబ్బ తగులలేదు గద?

చిన్న— అమ్మయ్యో! అంతగుఱ్ఱంమీాదనుంచి పడితే దెబ్బే తగల్దా! తల పగిలిం దంట- తరువేసి ఆసుపత్రికి తీసుకుపోతున్నా రంట! పోలీసువారు జామీాను తీసుకు పొమ్మంటే- ఆసఁవయానికి రంగ డెల్లాగో ఆదా ర్జొన్నిస్తున్నా డంట- పాపం, బాబుగార్ని వాడే పట్టి లేవనెత్తా డంట!

విశ్వా—(ఆందోళనముతో) అన్నన్నా! యెంతప్రమాద మెంతప్రమాదము! దైవమా! నీవింత దారుణమున కొడిగట్టితి వేమి?

ఆ. సకల సుగుణ రాశి • శాంత పయోరాశి
వినయ భరితుఁ, డతి వి • వేక కలితుఁ;
డట్టివాని కిట్టి • యాపద కలిగింప
బుద్ధి యెట్లు నీకుఁ • బుట్టె నయ్యొ!

(అనుచు సత్వరముగా నిష్క్రమించును.)

ఇది ప్రథమాంకము.

# మధుసేవ

## ద్వితీయాంకము

### మొదటిరంగము

ప్రదేశము : రాజవీధి.

రంగఁడు—(గొడుగు చేతఁ బట్టుకొని ప్రవేశించి)

పాట

(1) సారా కల్లూ సల్లగ వుంటే - రొక్కండబ్బులు రొంఁటిని వుంటే
లోకుల్లోనా కేఁవి పని! - యీలోకంతో నా కేఁవి పని !
(2) కాలవ లన్నీ కల్లే అయితే - సఁవుద్రఁ వంతా సాగా అయితే
కఁబు వస్తే నా కేఁవి బయం ! - కాటకఁ వొస్తే యేఁవి బయం
(3) సారా సీసా సంక నుండగా - సేతను గుప్పెడు సీకు లుండగా
హాయిగ పేణం పోవాలి - అప్పుడు స్వర్గం రావాలి !

సందేయఁ వేఁవీ ?- సారా తాగినోడే సరసుడు ; కల్లు తాగినోడే ఘనుడు. కాదన్నవాడు నా కాలి గోరుమీదనుంచి బలాదూరు ! అయితే, వోటిమాత్రరం నిజం : తాగే వాళ్ళ అదురుష్టఁ వంతా తాటిసారాతోటే పోయింది. అందులోనూ సిగురుసారా పోవడం - సిరి పోవడఁవే ! ఆ మాఁవిడిసిగురు రంగూ - ఆ సకల సంపెంగ వాసనా ? ఆ అగ్గినిప్పు నిషా - వో ! వో! గ్యాపకఁ వొస్తే వొళ్ళు గరిపొడుస్తుంది ! పాడురమ్ము - ఈ రమ్మొచ్చి - రొమ్ములు తినేస్తోంది ! అయిదుబుడ్లు తాగినా, అగ్గిపుల్లమంటలాగ - అంతలో సెల్లు ! సాల్టోళ్ళు తాళ్లకు నెంబ ర్లెయ్యడఁ వొచ్చాక- కల్లుకూడా కంగాళీ అయిపోయింది ! కల్లు తాగితే మునుపు - కవిలాసంలో

వున్నట్టుండేది ! ఇప్పుడు కల్లు తాగితే - కళ్లు తిరగడం, వొళ్లు పెరగడం, పళ్ళు విరగడంతప్ప, పైనేమీ లేదు !' కల్లు సంవుద్రం యెక్కడుందో కనవచ్చిందాకా, చేపనోళ్లను పట్టుకుని, చేపుల్నా కేలాగు తన్తే చేసుగ్గా వుండేది ! (పరిక్రమించి) నేను రంగం వెళ్ళి - ముడుపులమ్మ తీర్తానికి మూడేళ్ళు. ఈ మూడేళ్లల్లోనూ వూరంతా ముక్కలూ సెక్కలూ అయింది ! బ్రాందిసాపులు పలచబడ్డాయి - సారాకొట్లు సగం వైనాయి - కల్లుదుకాణాలు కనపడకుండానే పోయాయి ! కాపీహోటేళ్ళు వూత్తరం కావోసినన్ని లేచాయి! కానికల్లు కావలిస్తే - కాసీ యెల్లిన టిల్లాలి ! ఈ దుకాణాలు దూరంగా తరిం వేసినోణ్ణి - పడదీసి తన్నినా పాపం లేదు ! వోయి రంగ ! వోయి రంగా !- నా సేతినిండా డబ్బేవుంటే - కాసీ రాంవేశ్వరాల్దాకా కల్లు సరివేందర్లు పెట్టించక పోయ్యేనా ! డబ్బున్నా వోళ్ళు కొక్కుళ్ళకే తల్లో వూకన్నమాట లేదు ! (ముందునకుం జూచి) అడుగో సిపాయి సిన్నయ్యతాత! (పరిక్రమించి) ఏంసిన్నయ్యతాతా! యెల్లా వున్నావు ?

చిన్న—(ప్రవేశించి) ఇదిగో - రంగ డెప్పుడో రంగాన్నుంచి దిగాడే ?

రంగ—మొన్నటి వోడలో వొచ్చాను తాతా!

చిన్న—ఎన్నాళ్ళ కొచ్చావు ! ఏవిటి రంగం విసేసాలు ?

రంగ—అబ్బో ! రంగం సంగితి సెప్పడానికి నాతరంవా - నాయబ్బ తరంవా ! ఎవణ్ణి సూసినా - సేతినిండా డబ్బు - కడుపునిండా సారా ! పెతింపాదినీ బ్రాందిషాపు - సందుసందుకూ సారాకొట్లు ! బ్రాంది సారాలు తాగితే బర్మావోడే తాగాలి ; అయితే, రమ్ము సారా వొచ్చాక, రంగాన్ని కూడా షోకు తగ్గిందంట.

చిన్న—మేం వెళ్ళిన్నాటికి రమ్మింకా రాలేదు.

రంగ—ఏంవిటీ!- అయితే నువ్వు రంగం సూశా వన్నమాటే !

చిన్న—వొక్క రంగంవేనా !- రంగం, మోరీసు, టోకీ, సింగపూరు, మాండలే-వొకటేంవిటి- ఆ టాపంతా సుట్టబెట్టాం. అసలు ఆవా

రాజును పట్టుకున్న దేవరు- మేఁవు కాదూ? అప్పుడేగా ఆకా కాన్నుంచి సుక్కలు రాలాయి! మాపటాఁ వెళ్ళకపోతే మాండ లీకోట దొరికేదా! ఆరాజు సింవాసనాన్ని ఆరువందల వజ్జిరా లున్నాయి! కోటలో యెటుతిరిగినా-కోడిగుడ్డంతేసి రత్నాలు కాళ్ళకు తగిలేవి!

రంగ—రత్నాలేనా-రమ్ముసారా యేఁవైనా వుండేదా?

చిన్న—రమ్మింకా రాలేదన్నాగా?- ఇష్టఁవొచ్చినంత యిప్పసారా పట్టసారా దొరికాయి.

రంగ—అయితే నువ్వూ సీనాసారాలు సూకావన్నమాట!

చిన్న—సూకాను గానీ- పాఁవుమంతరం నేర్చుకున్నాక, పత్తిరిసేవ మొదలెట్టి- కల్లు సారాలు కంట సూట్టం మానేశాను.

రంగ—సరేగానీ- బాబుగా రెల్లా వున్నారు?

చిన్న—బాబుగారు బంగారంలా గున్నారు. అన్నట్టు సెప్పలేదు- బాబుగారు పడ్డప్పుడు నువ్వు సేసిన సేవకు బవుమతీ యివ్వడానికి పిలమంటే- నువ్వు రంగఁ వెళ్లినట్టు నేనే సెప్పాను. అప్పట్లో నువ్వుంటే అడిగిన యీనాఁ విచ్చేవారు. నిజంగా బాబుగా రప్పుడు నీమూలాన్ని బతికారు!

రంగ—తప్పు తప్పు! నామూలాన్ని కాదు-సఁవయానికి నా సేతులో వున్న సారాసుక్క- మూలాన్ని బతికారు! ఆ పడ్డపాటుకు ఆ సుక్క పడకపోతే- ఆపాట్న గుటుక్కు మనవలసిందే!

చిన్న—అయితే బాబూ!- అయ్యగా ర్నికాడికి తెచ్చింఛి నీసేతి బోణీయేనా!

రంగ—అదేం టదేంటి?- ఏకాడికి తెచ్చిం దేంటి?

చిన్న—ఏకాడికా- (మెల్లఁగా) తాగినో డంటె తరిఁవేశేకాణ్ణుంచి- తాగుమోతుల్ని సూట్టూ కూకుండబెట్టుకుని, తప్పతాగేకాడికి! కావోసినంత సొమ్ముతో కలకల్లాడేకాణ్ణుంచి- అరవ ద్యోల్దాకా అప్పుసేసే కాడికి! ఈపాలి తెలిసిందా?

రంగ—(ఆశ్చర్యముతో) నిజంగానే?

చిన్న—అమ్మతోడు!-ఆమారాజుమీద నేనబద్ధం ఆడతానా!

రంగ—అవు నవును!- అందు కాశ్చర్యం వేఁవుంది! నామట్టుకు నా కెల్లాంతగులుకుందో తెల్సునా?- మాబాబు దినానికి, మాసాతాని జియ్యన్న సచ్చినోడు- కాని కాని పుచ్చుకుని, కాస్త కాస్త సేతుల్లో పోశాడు! ఆకానిడబ్బు నీళ్ళతోనూ, కావాఁరపు జీడిలాగు పట్టుకుంది! అయితే, బాబుగారికి కార్జం వయిందా?

చిన్న—కాఁవోసినంత బలవంతంమీద సిరుదు కార్జంమాత్రం జరిగింది. ఆయెనక, అమ్మగార్నారు పంపాలేదు- యీరు తీసుకునీ రాలేదు. అయితే రంగాన్నుంచి అప్పుడే వొచ్చాశా వేం?

రంగ—అబ్బో ఆగొడవ సేనావుంది. వో బర్మావోడికీ నాకూ, సారా కొట్టులో జగడం పెరిగి- కాకుతో పొడిశాను. అందుచేత పోలీసోళ్ళ కందకుండా- అమాంతంగా సక్కారావల కొచ్చింది.

చిన్న—అల్లాగయితే- నీ సేతితోంద రింకా అణగలేదన్నమాట! ఏం తెచ్చావు రంగాన్నుంచి?

రంగ—రంగాన్ని గడించిం దంతా రమ్ముసీళ్ళకే పోయింది. వో పెట్టి, వో పట్టురుఁవాలూ, యీ గొడుగూ, పదిరూపాయలు రొక్కం మాత్రం తెచ్చాను. పదిరూపాయలూ వచ్చిన్నాడే వయిస లయ్యాయి. మొన్న పెట్టమ్మాను, నిన్న రుఁవా లమ్మాను, యీ పూట యీగొడుగట్టుకు బయదెల్లాను.

చిన్న—సరే, సరే, అడుగో సెర్మగా డొస్తున్నాఁడు! ఆడికంటపడితే యేదో పని సెప్పక మానడు. ఆన కింటికొస్తాను పద.

రంగ—సెరమగా డెవడు?

చిన్న—బాబుగారికి దాపరించిన బాటిల్ మేష్టర్లలో వొకడు! తక్కిన మాటలు తరువాత సెబుతాలే!

(ఇద్దఱు నిష్క్రమింతురు.)

# రెండవరంగము

ప్రదేశము:- రఘునాథరావుగారి మేడమీఁది గది.

ప్రవేశము:—బ్రాందిసీసాలును, గ్లాసులును గల బల్లకుఁ జెరియొకవైపునఁ గూర్చుండి—రఘునాథరావుగారు, శర్మ.

రఘు—సరి కాని- యొకసందేహము—

చ. మనసు తటాలున న్మెఱపు • మాదిరి దీప్తి వహించు; బుద్ధి యు
య్యనకిరణంబులం గమల • మట్టులొ యట్లె వికాస మొందుఁ; జ
య్యన నిఖిలాంగకంబులును • యంత్రికమునం ఘటియించినట్లు ప్రా
లును- మధుసేవ యేటికిల • లోన నిషేధ మొనర్చిరో బుధుల్ !

శర్మ—ఈ డౌటు (Doubt) నే నిట్టె క్లియరాఫ్ (Clear off) చేసెదను గాని- ఇంకొకగ్లాసు కానిండు.

రఘు—(నవ్వి) దానిడౌటు దానిచేతనే కాని తీఱదు కాఁబోలును !

ఇద్దఱు—(బ్రాందితో గ్లాసులు నింపి, పానము చేయుదురు.)

రఘు—దీనితో నీ వెన్నిగ్లాసులు ?

శర్మ—ఎన్నియో యెక్కడ!- అన్నియుఁ గలిసి యైదేగా ! మీరో ?

రఘు—నేను మూఁడే కాని- నా కప్పుడే ముచ్చెమటలు పట్టుచున్నవి ! ఏమి చిత్రమో కాని- యెన్నిగ్లాసులు పడినను నీ వేమియుఁ జలింపనే చలింపవోయి !

శర్మ—అదిగో అదియే మనయొద్ద నున్న యతిశయము.

ఉ. త్రాగుట గొప్ప కాదు, పది • ద్రాములు త్రాగిన మూలమూలలన్
దాఁగక, డీలు వోక, పస • త్రాగిన పిట్టవిధాన వెఱ్ఱిగా
వాఁగక, యొద్దకుం జనిన • వాసన గొట్టఁగ నీక, వీధులన్
దోఁగక; పెంటకుప్పలను • దొరక- యొప్పుటె గొప్పనాదగున్.

రఘు—సరే కాని- నాసందేహము తీర్చినావు కావు.

శర్మ—బాబూ ! మన పెద్దల తెలివితేటలు మనకుఁ బూర్తిగాఁ దెలిసిన తరువాతఁ గూడ మన కీ సందేహ మెందులకు ?

చ. దినకరుఁ డంబరస్థలిని • దేరిపయింజను నన్నవారు; అ
వ్వనరుహబాంధవారుల న • వారిగ సర్పము మ్రింగు నన్నవా
రనువుగ సప్తవార్ధులకు • హద్దులు చెప్పినవారు- మద్య మం
టిన దురితం బటంచుఁ బ్రక•టించుటలో విపరీత మున్న దే !

రఘు—నాన్సెన్సు (Nonsense) నా కామాట నచ్చలేదు.

ఉ. మానసమునందు, శాస్త్రపరి • మాణమునందు, వివేకమందు, వి
జ్ఞానమునందు, నాగరక • సంపదయందుఁ; గళారహస్య సం
ధానమునం దశేష వసు • ధాస్థలికి న్మనదేశమే గురు
స్థాన మటంచుఁ దేలె ! సుర • సంగతియే మనవా రెఱుంగరే ?

శర్మ—అట్లయిన నొకటి కావలెను. అట్టిభయమే పెట్టకపోయినచో, నందఱు నదే మరగి, మనవంటివారి కందకుండఁ జేయుదు రని యట్లు నిషేధించి యుందురు. అయినను, మనవా రేమన్న నేమి- అనుభవజ్ఞులైన యింగిలీషువా రన్నమాట యిది:

* హీ మస్టు డ్రింకు విస్కీ- ఆఫ్ దీ స్ట్రాంగెస్టు కైండు,
టూ స్టెడీ హిజ్ నర్వ్ అండ్ స్ట్రెంగ్తెన్ హిజ్ మైండు.

రఘు—సరేకాని ఆదిలో నీ కీ యంటురోగ మెట్లు సంప్రాప్తమైనది?

శర్మ—అబ్బా !- ఆగ్రంథము-అరేబియన్ నైట్సంత యున్నది ! మరియొకగ్లాసు వేసికొని మనవిచేసెదను. (అని యట్లు చేసి) నేను స్కూలులోఁ జదువుకొనుచుండఁగా- మా టీచరుగా రొకసారి మాచేత నొక నాటక మాడించినారు. అంతట, నాదృష్టిచదువుమీఁదినుండి, సరాసరి నాటకములమీఁదికి నడిచినది. ఆపాటున, మా యూరునందలి- ఆంధ్ర యువజన సంతోష సంగీత సరస్వతీ హిందూ నాటక సమాజ సంఘ సభలోఁ జేరినాను. నాటకసంఘము యొక్క నామము నకుఁ గాఁబోలు నవ్వుచున్నారు ! ఇప్పటి పేరు లింకను గమ డగొయ్య, గత్తర బిత్తర, కోకి బికి కొల్లేటి చేంద్రాడులుగా !

* He must drink Whisky of the strongest kind,
To steady his nerve and strengthen his mind.

రఘు—కాదన్న వా రెవరు ? నీకథ కానిమ్ము. అందుఁ జేరినావు.

శర్మ— చేరఁగానే, సంఘమువారు నా సరదా చూచి, నూనూగు మీసము నున్నఁగా గొరిగించి, చిన్న చిన్న స్త్రీవేషములు వేయించుటకు మొదలు పెట్టినారు. కాని, యేమి లాభము ? గంపెడు సిగ్గు ! పెండ్లికూఁతురువలె రంగస్థలమున కరిగి, పేడకుప్పవలెఁ జతికిలఁబడెడి వాఁడను. సభ్యులవంకఁ గన్నెత్తి చూచితినా ! చలి జ్వరము వచ్చినంత వడఁకు ! మా మేనేజరు మంచి బాటిల్ మ్యాష్టరు ! ఆదినములలో నే నాయన దినచర్యను గూర్చి యల్లిన పద్యము చదువనా?

సీ. మార్నింగు (Morning) కాఁగానె • మంచము లీవింగు (Leaving)
మొగము వాషింగు (Washing)చ • కుర్చిఁగ సిటింగు (Sitting)
కార్కు (Cork) రిమూవింగ్(Removing) • గ్లాసులుఫిల్లింగ్(Filling)
గడగడ డ్రింకింగు (Drinking) • గ్రంబులింగు (Grumbling)
భార్యతో ఫైటింగు (Fighting) • బయటికి మార్చింగు(Marching)
క్లబ్బును రీచింగు (Reaching) • గాంబులింగు (Gambling)
విత్తము లూసింగ్ (Losing) • చిత్తము రేవింగు (Raving)
వెంటనే డ్రింకింగు (Drinking) • వేవరింగు (Wavering)
మగల మరల రిపీటింగు (Repeating) • మట్టరింగ్ (Muttering)
బసకు స్టార్టింగు (Starting) జేబులు • ప్లండరింగు (Plundering)
దారిపొడుగున డాన్సింగు (Dancing) • థండరింగు (Thundering)
సారెసారెకు రోలింగు (Rolling) • స్లంబరింగు ! (Slumbering)

రఘు — (పకపక నవ్వి) ఓరి నీ పద్యముకాల ! ప్రాణములు తీసినావు!

శర్మ—ప్రతిరోగమునకు బ్రాందిచుక్క పరమౌషధి మని యాయన సిద్ధాంతము. ఆసిద్ధాంతము ననుసరించి యొకనాఁ డాయన నా రోగమున కొకయవున్సు బ్రాంది త్రాగించెను. ఆపూఁట నా యాట నిప్పు ద్రొక్కిన కోఁతిని నీవా నేనా యనునట్లు నడచినది! అందువల్ల, నాఁడు మొదలు నా కది మందైనది. ఆయన చుక్క

హెచ్చిన కొలఁది నాచుఱుకు తనము హెచ్చినది. నాచుఱుకు తనము హెచ్చిన కొలఁది యాయన చుఱ్ఱయు హెచ్చినది. ఆ నాఁడావిధముగా నాయన పెట్టిన బిచ్చ మవిచ్ఛిన్నముగా నేఁటికిని సాగుచున్నది. నా కథ యిది. దయచేసి, మీ కథ కూడఁ జెప్పి తిరా విని యానందించెదను. మీ రుపక్రమించులోపల నొకసారి మరల నోరు తడుపుకొనెద. (అని మరల నొకగ్లాసు త్రాగును.)

రఘు—నాకథ నాకె వింతగాఁ దోఁచునంత విచిత్రమైనది. మున్ను మున్నటివఱకును, మద్యపానమును నాకంటె నిరసించువారు' మన యిండియాలో లేరు. అట్టి స్థితిలో, నొకనాఁడు నేనొక క్రొత్త గుఱ్ఱము నెక్కి షికారు పోవుటయు నొకచోట నది బెదరి బెగ్గోలు పఱుటయు నేను దత్తరిల్లి తలక్రిందగుటయు, తల పగులుటయుఁ, దటస్థించినది. ఆపూఁట నే, త్రాగినందులకై నాచేఁ గొలువునుండి తొలఁగింపఁబడి, దైవయోగమున, నాసమయమున కాచేరువకు వచ్చియున్న నా పరిచారకుఁ డొకఁడు నా పాటు చూచి, చప్పునఁ దనకడనున్న సారాయి యింత నోటఁ బోసెను. ఆ మ్మగతలోఁగి మ్మనకుండ నా చుక్కలు మ్రింగితిని. అప్పు డెత్తఁగిన దంతవఱకే. మఱునాఁటి మధ్యాహ్నమునకు మరలఁ దెలివి వచ్చినది. కాని తాళవశము కాని తలపోటు! డాక్టరు నా బాధ జూచి, గ్లాసుతో నింత యరఖు తెచ్చి పోసెను. దానిచే మరల మైమఱచి నిద్రించితిని. కాని, మెలకువ రాఁగానే తలపోటు మరల దాపుర మైనది. మరల డాక్టరు మందు తెచ్చి పోసెను. ఈ విధముగాఁ దెలివి వెంబడిని తలపోటు, తలపోటు వెంబడిని డాక్టరుగారి పరమౌషధము.

శర్మ—సరే, సంగతి బోధపడినది. ఆ పరమౌషధము బ్రాంది.

రఘు—యూ ఆర్ రైట్! (You are right) కాని, యాసంగతి నాకప్పటికిఁ దెలియదు. గాయము మానిన పిమ్మటఁగూడ గ్రహచారవుఁ దలపోటు మానకపోఁగా డాక్టరు తానిచ్చుచు వచ్చిన యర

ఇది యని తెలిపి- బాధానివృత్తియగువరకును బ్రాందిసేవ తప్పదని చెప్పెను ! ఇఁకఁ జేయవలసిన దేమున్నది ?-

చ. పదిలముగా గవాటమును • వైచి, యొకండనె కూరుచుండి యీ
గది నొక కొన్నినాళ్లు- నిటఁ • గా దని మా వనవాటి కేఁగి పూ
పొదలను కొన్నినాళ్ళు-నిరు • పూఁటల మందుగఁ గ్రోలి గ్రోలి, హా!
తుదకిటు రేవు మాపులును • దుప్పిగఁ ద్రాగెడుదాఁక వచ్చితిన్ !

శర్మ—ఇఁకఁ జెప్పనక్కఱ లేదు. ప్రపంచమునందలి పై తరగతి త్రాగుబోతులలో-వందకుఁ దొంబదిమంది వైద్యులవల్ల వక్రించినవారే !

గీ. తథ్యము వచింతు- మద్యమం • దరికిఁ గన్న
తండ్రి వైద్యుఁడు; వెలయాలు • తల్లి; వైష్ణ
వుండు చెలికాఁడు; తద్వార్త • కుండు దూత;
జారులుం, జోరులు, నిశా • చరులు, మంత్ర
వాదులుం, జూదరులు, నటుల్ • వలపు మగలు !

రఘు—అయినను, నే నాయన చెప్పఁగానే మెత్తఁబడ లేదు. అనేక సాధనములు చేసి చూచినాను. కాని, దానితోఁ గాని తల పోటు తగ్గినదే కాదు! ఈవర కొకసంవత్సరమున కా శిరోవేదన పోయినది. అయిన నేమి- అప్పటికి యది వెన్నెముకవరకును వేరుతన్నినది !

శర్మ—(తనలో) కనుక నే, మావంటివాండ్ర కింత గ్రాసము దొరకుచున్నది ! (పయికి) అయిన, నందులకు మీ రన్యథా భావింప నవసరము లేదు.

* ఏ లిటిల్ విస్కీ, నౌ అండు దెన్,
యీజ్ రెలిష్డు బై దీ బెస్టు ఆఫ్ మెన్.

అని కారికలే యున్నవి. అది కాక- మీరు గుఱ్ఱముమీఁదినుండి పడినప్పుడు మీ సేవకుఁడు పోసిన చుక్కలే మీ ప్రాణములను నిలిపినవి. కాకున్నఁ దోడనే కాళ్ళుఁ జేతులుఁ జల్లఁబడెడివి. మద్యముయొక్క మహిమకు మేరయున్నదా !

* A little whisky, now and then, is relished by the best of men.

5. కనుగందువాఁ డొక • గ్లాసు వేసినతోనె
హనుమంతునకు గంతు • లాట నేర్పు
మూఁగవాఁ డొక్క డ్రా • ముం గొన్న మాత్రాన
వేనోళ్ళ శేషుని • వెక్కిరించు
పిఱికివాఁ డొక యౌన్సు • పీల్చిన యంతనె
యుత్తరు చెంపపై • నూఁచి కొట్టు
పుంస్త్వహీనుం డొక • పుడిసెడు గొనఁగానె
సింహబలుం బట్టి • చిత్తుచేయు
పరమలోభి యొక్క • పాత్రెఁడు సేవింప
దానకర్ణుఁ దరిమి • తరిమి కొట్టు
శోకభరితుఁ డొక్క • సోలెఁడు గ్రోలిన
నొడలు మఱచి హర్ష • జలధి మునుఁగు !

రఘు—(నవ్వి) ఇదిగో- యీ నీ ధోరణియే యిందుఁకు నిదర్శనము !

శర్మ—నామాటలు మీ రట్లు నవ్వులఁ బుచ్చఁదగినవి కావు. జగత్ప్రఖ్యాతి వడసిన- షేక్స్పియర్ త్రాగుబోతు; షెరిడన్ త్రాగుబోతు; విల్సన్ త్రాగుబోతు, నెల్సన్ త్రాగుబోతు; మనలో- వ్యాసుఁడు త్రాగుబోతు; వాల్మీకి త్రాగుబోతు; కాళిదాసు త్రాగుబోతు; కబీరుదాసు త్రాగుబోతు; ముప్పదిమూఁడుకోట్ల దేవతలు త్రాగుబోతులు, మును లందరు త్రాగుబోతులు. ఇప్పటి నాగరక ప్రపంచములో త్రాగనివానికి తావే లేదు ! త్రాగినవాఁడే యూరికి తలమానికము- త్రాగినవాఁడే నలుగురిలో తగవరి ! త్రాగినవానికే యూరిలో దాక్షిణ్యము- త్రాగినవానికే యింటిలో ధర్మపిండము ! త్రాగినవానికే సభలో తాంబూలము- త్రాగినవానికే మేజువాణీలో దండము! ప్రభువు త్రాగక పాలింప లేఁడు- సేవకుఁడు త్రాగక సేవింపలేఁడు - వకీలు త్రాగక వాక్కు మెదపలేఁడు- వైద్యుఁడు త్రాగక వ్యాధిని గనిపెట్టలేఁడు ! కవి త్రాగక కలము పట్టలేఁడు- గాయకుఁడు త్రాగక కంఠ మెత్త

లేదు. పూజారి త్రాగక పులికాపు పెట్టలేడు. అర్చకుఁడు త్రాగక హారతి పట్టలేఁడు. వంటవాఁడు త్రాగక వండలేఁడు. వడ్డనవాఁడు త్రాగక వడ్డింప లేడు. పెండ్లిలో త్రాగుడు; పేరంటములో త్రాగుడు; విందులో త్రాగుడు, పేకుకోలుపులో త్రాగుడు, క్లబ్బులో త్రాగుడు, గ్రంథకుటిలో త్రాగుడు, రచ్చలో త్రాగుడు, రైలులో త్రాగుడు, భోగములో త్రాగుడు, రోగములో త్రాగుడు, చావులో త్రాగుడు, శ్రాద్ధములో త్రాగుడు. ఈ విధముగా త్రాగుడు: ఇష్టదైవమువలె నిహ పర సాధనమై పడుగు పేకలవలె ప్రపంచమంతయు నిండి గాలి వెలుఁగులవలె గౌరవాదరములను బడసి నది. పడయుచున్నది. పడయుచున్నది.

రఘు—(పకపక నవ్వి) ఓరి నీ లెక్చరు కాల! టెంపరెన్సు సొసైటీ వారి (Temperence Society) దుంప తెంపెదు నట్లున్నావే! సరి కాని, యీదుర్వ్యసనమున కిందఱు లోనగుటకుఁ గారణమేమి?

శర్మ— దాని మహిమయే దానికిఁ గారణము. అనుహిము కం తున్నదా!

సీ. బ్రాందిసీసా కంటఁ • బడఁగానె వరహాల
పాతు కాన్పించిన • వగిదిఁ దోచు!
తప్పు మంచును గార్కు • చప్పు డైనంతనె
జయభేరి విన్నంత • సంబ్ర మొదవు!
దోడదోడ గ్లాసులోఁ • దొలికించు సమయాన
నమృతంబు పడుచున్న • యట్టులుండు!
చుఱచుఱ గొంతులోఁ • జొచ్చెడు తఱి, పోయి
నట్టిప్రాణము వచ్చి • నట్టులొప్పు!
అవల, నానందవార్ధి నో • లాడు నట్లు
స్వర్గభూమి విహారము • సలుపు నట్లు
రంభ యొడిలోన నిద్దుర • గ్రమ్మినట్లు
తన్మయావస్థలోనఁ జి • త్తము సుఖించు!

రఘు—అసహాయవాదులు దాని నంత మొందింపఁ జూచుచున్నారే.

శర్మ—అసహాయవాదులు కారుగదా ! హరిహరాదులు కూడ దానినంత మొందింప లేరు. ఏ మందురా? వారి నడ్డుకొనఁగల మహానుభావులు వైస్రాయి సభలోఁగూడఁ గలరు ! ఆ పైని ఎలెక్షనులలో దాని కిప్పు డెక్కడ లేని ప్రాముఖ్యతయుఁ గలిగినది. విన్నారో లేదో మొన్నటి మ్యూనిసిపల్ యెలక్షను సందర్భమున సారాకొట్లు మ్యూనిసిపల్ కచేరీల మధ్య, వోటర్లు, తిరుపతి మొక్కుల బిచ్చగాండ్రవలె తీట తీఱ దొరలినారఁట ! దీని కేమి గాని క్లబ్బులో గానసభ యట వెళ్లుదమా?

రఘు—చీట్లాట గుంపులతో మనక్లబ్బు - శివగంగ తిరునాళ్ళను మించియుండునుగదా ? ఆగందరగోళములో గానసభ కూడనా !

శర్మ—అసలు మీకు సంగీతమునందుఁ జవి కలదా ?

రఘు—సంగీతమునందుఁ జవి లేక పోలేదు గాని,

చ. బిరడలు త్రిప్పి, తంత్రులను • బెళ్లున త్రెంచి, ముడు ల్ఘటించి, తంబుర శ్రుతి చేసి, గొంతుకప • ముల్ సకిలింపుల నెట్టి, గూబపై
కరము గదించి, వాతహారి • క్రమ్మిన చందమున న్వికార వై
ఖరి సభలోన గింజుకొను • గాయకుఁ డన్న నసహ్యమే జుమా !

శర్మ—అట్లయిన, మీ కాఁడు పాటపై నాదరము హెచ్చున్న మాట !

రఘు—ఆఁడుపాట యన్న జ్ఞప్తికి వచ్చినది. మొన్న రాత్రి యీ వీధి నొక పెండ్లి యూరేగింపు వెళ్ళినది. ఆ యూరేగింపు మేజువాణిలో నొకతె పాడినది గదా ఆ స్వర మాధుర్య మేమని చెప్పుదును!

శర్మ—స్వరమాధుర్య మేనా - దాని సౌందర్యమాధుర్యము కూడఁ జిత్తగించినారా?

రఘు—అంతవరకు జరుగుట కవకాశము లేక పోయినది.

శర్మ— (తనలో) సెబాసు ! అవలైన ఆపర్ట్యూనిటీ (Opportunity) దొరకినది. ఈ సందర్భములో నీతనికి మమత కలిగించి, దాని యింటికిఁ దార్పఁగలిగితినా- నాయదృష్టము నాలుగు కాళ్ళమీఁద

నడచిన దన్నమాటే! బహుకాలమునుండి దానిపై నాకుఁగల భ్రమయుఁ దీఱును- ఈయొకచేత నీతఁడు నాచేతి కీలుబొమ్మయు నగును! ఏమి ఛాన్సు! (Chance) టూ బర్డ్సు విత్ వన్ స్టోన్! (Two birds with one stone)

రఘు—ఏమిటి యాలోచించుచున్నావు?

శర్మ—ఏమని చెప్పుదును! దానియందము చూడలేదసఁగానే నా డెందము క్రుంగిపోయినది.

రఘు—అదేమి?

శర్మ—అదే మేమిటి?—. ఆ సౌందర్యరాశిని చూడనివి చూపులా!

రఘు—ఎవతె యా యువతి?

శర్మ—దానితల్లి దానికి పెట్టినపేరు: కస్తూరి—దాని సౌందర్యమును బట్టి లోకులు పెట్టినపేరు సెర్చిలైట్! (Search light)

రఘు—ఆ కంఠస్వర మా కస్తూరిదే యని నీవెట్లు చెప్పఁగలవు?

శర్మ—ఆ సమయమున నేనుగూడ నా మేజువాణీలోనే యున్నాను. ఉండకపోయినను జెప్పఁగలను. అట్టి కంఠస్వరము కల దీయూరిలో నదితప్ప యింకొకతె లేనే లేదు.

రఘు—(నవ్వుచు) అట్లయిన, నీ వీ యూరిలోని ఆటకత్తెల నందఱ నెఱుఁగుదు వన్నమాటయే!

శర్మ—ఎంతమాట! అంతో యింతో చేయునది వైద్యముకదా?

రఘు—అట్లయిన, నీసారి యా సెర్చిలైటువీధిని వచ్చినప్పుడు- ఎన్ని కాండిల్సు పవరు (Candles power) కలదో చూచెద లెమ్ము.

శర్మ—అట్లయిన మీ కా పవరు రేపే చూపఁ గలను!

రఘు—అదెట్లు?

శర్మ—ఎట్లా?—మరల నొకసారి రవంత మధుసేవ చేసి మనవి చేసెదను. కాసింత మీరుకూడ కానిండు.

ఇద్దఱు—(గ్లాసులు నింపి నోటఁ బోసికొనుచుండఁగా- తెర పడును.)

ఇది ద్వితీయాంకము.

# మ ధు సే వ

## తృతీయాంకము.

ప్రవేశము:—కస్తూరియిల్లు.

ప్రవేశము:—సర్చీపైఁ గూర్చుండి శర్మ, యెదుట నిలుచుండి కస్తూరి.

కస్తూ— పంతులుగారికి నామీఁద నేఁడు పరిపూర్ణకటాక్షము వచ్చినది!

శర్మ—ఇదిగో!- మొదలే నేను పుట్టుకు మొగమోటమితో వచ్చినాను! అట్టి పెద్దమాటలు విసిరి నన్నడలఁగొట్టకు!

కస్తూ—ఎంతమాట! తాయారుమీఁద మీకు తగనియిష్ట మని వాడుక. అందుచేత నట్లన్నాను.

శర్మ—నిజమే కాని- నీచపుముండ నిలుపుకొనలేక పోయినది! కులమువానిని మరగి కూటిలో మన్ను వేసికొన్నది.

కస్తూ—అట్లయిన, దానియింటికి మీరు దయచేయుటలే దన్నమాట?

శర్మ—నీతోడు! నీతో నే నబద్ధ మాడుదునా? కులమువాఁడు పొరలి వెళ్ళిన ప్రక్కమీఁద- కుక్కినపేనువలెఁ గూడఁబడవలసి వచ్చినప్పు డా గుమ్మము త్రొక్కుటకంటెఁ గూడనిపని యున్నదా? ఒక్క తాయారే కాదు- ఇవు డెక్కడఁ జూచిన నిదే కర్మము! కులమువాఁడు ముందు- కిలమువాఁడు వెనుక!

సీ. సోమయాజులుగారి • శోభనాంగికి, దాని
మద్దిలకాఁడెకా • మాఱు మగఁడు!
ఆచారిగారి సిం • హాచలంబునకు గ
జ్జెల మోఁతగాఁడెకా • వలపు మగఁడు!
పంతులుగారు చే • పట్టిన యిందిరా
స్యకు పిడేల్‌కాఁడెకా • చాటు మగఁడు!

నాయఁడుగారు (పా • ణముపెట్టునట్టి ర
తికి తి త్తికాఁడ కా • తేర మగఁడు !
పెద్దగోమటి సామ్ముకో • బెరిగినట్టి
మురహారికి తాళిగాఁడె కా • ముద్దు మగఁడు !
ఇది యది యనంగ నేల యే • యింటఁ గనిన
కులమువారలె విటులు సా • నులకు నేఁడు !

కస్తూ— ఆదోష మెవ్వారిదని మీ యభిప్రాయము ?-

సీ. సుబ్బిసెట్టి తెనాలి • సుందరి యింటను
పక్కలు వైచి, దీ • పములు పెట్టు
పొట్టిపంతులు, విరి • బోణి మేళములకు
వెడలిన యూరెల్ల • వెంబడించు !
కామశాస్త్రిలు పూల • కనికి కూఁతుండ్రకు
మగలఁ దెచ్చుటకు రే • పగలుఁ దిరుగు !
స్వామినాయుఁడు తన • సాని నన్యుల కప్ప
గించి, తా వీధివా • కిటఁ బరుండు ?
కొండమీఁద నున్న • కోఁతి కావలె నన్నఁ
జచ్చి యైనఁ దెచ్చి • యిచ్చువారె
పాడుపనుల కిట్లు • పాల్పడుచుండఁగ
సానిముండ లేమి • సలుపకుండ్రు ?

శర్మ—ఎట్లయిన నేమి- ఎక్కడనో నీవంటిది తప్ప - యేయింటఁ జూచినను, కులమువాని కుక్క కానిది లేదు !

కస్తూ—సరి సరి నామాట కేమిలెండు, నామీఁది దయచేత నన్నిట్లు పొడిగించుచున్నారు !

శర్మ—నీతోడు ! నీసంగతి నీయెదుఁట జెప్పవలసినది కాదు. నిశ్చయముగా నీవంటివాండ్రు కోటికి నూటికిఁ గొందఱైన నుండుట చేతనే ప్రపంచము నిలిచినది ! అందుచేతనే, నిన్నాశ్రయించి

కెత్తవలె ననుతలంపుతో, మంచి స్కీ మొకటి మనసులో స్థిర పఱచుకొని వచ్చినాను. నీతోడు నీ యంగీకారమే తరువాయి.

కస్తూ—ఏదో విశేషము లేకున్న మీ రేతెంచువారు కారని నేను మొదటనే యనుకొన్నాను. ఏమిటి యాస్కీము ? (Scheme)

శర్మ—జమీందారు రఘునాథరావుగారికిని నాకును, జచ్చినం జావు బ్రతికిన బ్రతుకు అనునంత ఫ్రెండ్‌షిప్పు. (Friendship)

గీ. కుడుచునప్పుడు నేనును • గుడువవలయు
ముడుచునప్పుడు నేనును • ముడువవలయు;
కాయములు మావి రెండుగాఁ • గానఁబడిన
మానసం బొక్కటియె కాని • మాఱు లేదు.

కస్తూ—అంతవఱకు నేనాలకించినదే.

శర్మ—అట్లయిన నిఁక నంతగాఁ జెప్పవలసిన పని లేదు. ఆ(Influence) యిన్‌ఫ్లూయెన్సంతయు నీ నిమిత్తము వినియోగించి- నిన్ను బంగారు పిచ్చుకను జేయుటకు నిశ్చయించుకొన్నాను.

కస్తూ—ఏ విధముగా ?

శర్మ—ఏ విధముగా నేమిటి?- ఆయనకును నీకును అతుకుపెట్టి.

కస్తూ—(తనలో) ఇతనిరాక నా కిప్పు డర్థమైనది. కనుక, నేనిప్పుడు కాసింత గడుసుతనముగా వెళ్ళవలెను.

శర్మ—ఏమిటి యాలోచించుచున్నావు ?

కస్తూ—అనుకొన్న దొకటియు, ఆలకించిన దింకొకటియు నైన దని.

శర్మ—నీ వే మనుకొన్నావు ?

కస్తూ—(మొగము చిట్లించి) సరే, నే నే మనుకొన్న నేమి ! అందని మ్రాని పండున కఱ్ఱులు చాచుట యవివేకము కదా !

శర్మ—అనఁగా ?

కస్తూ—అనఁగాను లేదు, వినఁగాను లేదు కాని - ఆరాత్రి మీ రా యూరేగింపులోని కెందులకు వచ్చినారు ?

శర్మ—అంధఱు నెందులకు వచ్చినారో - నేను నందులకే.

కస్తూ—ఆలాగునా ! ఆమాట తెలిసినచో -అందఱను జూచిన కన్ను లనే మిమ్ములను జూచియుండెడిదానను! (అని చరాలున మరలును)

శర్మ—వెళ్ళకు వెళ్ళకు- వెళ్ళిన నొట్టు ! (అని చటాలున లేచి, చేయి పట్టుకొని) ఇప్పు డన్నమాట యేమిటి?- అందఱను జూచినకన్ను లనే నన్నును జూచియుందువా ? అట్లయిన, స్పెషల్ (Special) కంటితోఁ జూచినా వన్నమాటయే ! నిజముగా నామీఁద నీకట్టి యభిమానమే యున్నచో- నీపాదములపైఁ బ్రాణములువిడువనా !

కస్తూ—అమ్మయ్యో!- ఆపనిమాత్రము వలదు ! బ్రతికియున్నచోఁ బై మాపులతో నైన భ్రమ తీర్చుకొనెదను.

శర్మ—(సంతోషముతో) వహ్వా! వహ్వా! వన్సుమోర్! వన్సుమోర్! ఏమి టేమిటి ? భ్రమా ?- ఎవరిమీఁద ? నా మీఁదనే ! ఆబం గారునోట- ఆముద్దులమాట మఱియొకసారి యను !

కస్తూ—పిల్లికిఁ జెలగాటము, ఎలుకకు ప్రాణపోకడ యనునట్లు- నా మాట మీకంత నవ్వులాటగా నున్నది ! అదిగో - మరల నవ్వు చున్నారు ! పోనిండు నే నీకఁ జెప్పనే చెప్పను ! [అని మరలును]

శర్మ—(మరల పట్టుకొని) నాతోడు ! నన్ను చంపుకొని తిన్నట్టే ! ఏ దేదీ !- ఆరాత్రి నన్నుఁ జూచినదిమొదలు ?- చెప్పు మఱి !-

కస్తూ— చెప్పుట కేమున్న దేమిటి ? -

ఉ. అన్నము తిన్న నొట్టు ! నిదు • రన్నది పోయిన నంతకన్న నొ
ట్టెన్నఁడు నిట్టివింత విని • యేని యెఱుంగను! సిగ్గు! సిగ్గు! నా
కన్ను లివెంత దుండగపుఁ • గన్నులొ- మీ వదనారవిందముం
గన్న క్షణంబునుండి మిముఁ • గాంచుటకే పలవించు నిచ్చలున్ !

శర్మ—హాయి హాయి! హాయి హాయి ! అదృష్ట మనఁగా నాది ! ఏదీ- ఆపాటున నొక్కముద్దు పెట్టు ! (అని కౌగలించుకొని ముద్దాడి) ఇదిగో- యిప్పుడు నాసంగతి చెప్పెద విను. నీకు నామీఁద నిన్న నో మొన్ననో కలిగినది కాని- నీమీఁద నాకు నిరుటినుండి పుట్టి నది ! అయిన నాస్థితిలో నీయింటఁ గాలు పెట్టుట కిష్టము లేక-

మ. కనులార న్నినుఁగాంచిర్యైనఁ దనియం • గా పచ్చ్యసం చెద్దిరో
పని యున్నట్టులె, వెట్టికుక్క వరుసం • బల్మాఱు మీయింటి వం
కను దారాడుచు- నీవు మేళముల కే • గ న్వెంట నేతెంచుచుం
దినము ల్పుచ్చితి- నామొర ల్వినియె నా • తీ! దైవ మీనాఁటికిఁ

కస్తూ—అఁడుదానికిని మగవారికిని గల యంతర మెంతయో చూ
తిరా! నిరుటినుండి మీరు నివురుగప్పిన నిప్పువలె నుండ- నిన్న
గాక మొన్నఁ బుట్టిన నావలపు నే నిట్టె బయటఁ బెట్టుకొన్నాను!

శర్మ—ఇదిగో- నవ్వకుండ, నా మొగము వంకఁ దిన్నఁగఁ జూ
చెప్పు- నీవు నిజముగా నన్ను వలచితివా?

కస్తూ—(చిరాకుతో) ఇదిగో యిదే పురుషుల యొద్ద నున్న ఫుండు!

శర్మ— నీతోడు నీతోడు !- ఆమాట మఱియొకసారి విని యానం
పవలె నని కాని- నిజముగా నీయందు నమ్మకము లేక కాదు
నీమాట నమ్మనివాఁడు నీయింటఁ గుక్కయై పుట్టు ననుక
నచ్చినదా? నచ్చినచో, నావంక నొకసారి చూచి పకుకన నవ
ఆఁ! చాలును! ఇక్కడి కొకరిమన సొకరికిఁ దెలిసినది కను
నిఁక ముందుసంగతిని గూర్చి యోచ్చుటెంతము. నీకడ నిఁక దా
రిక మేల- నా మెడికల్ ప్రాక్టీసువల్ల నాకు వచ్చునది నాసిగరె
కుఁ జాలదు. అట్లు గాక, నిన్ను నేనే భరింపఁ గలిగిన యెడ
చక్రవర్తికైన నీసాన్నిధ్యము దొరకనిచ్చువాడనుగాను. అందు
రఘునాధరావుగారిని నీ కతుకు పెట్టి, ఆయనద్వారా ని న్నా
మున కెత్తుటకును- ఆయనచాటున నీతో నానందించుటకును ని
యించు కొన్నాను. నీవుఁగూడ దీనికి "ఎస్" (yes) అంటి
నీకు నా మీఁద నిజముగాఁ బ్రేమ యున్నట్లే లెక్క.

కస్తూ—ఎస్సోగిస్సో నా కేమియుఁ దెలియదు. మగవారి యా
చన మగవారికే గాని- అభము శుభము నెఱుఁగని యాఁడు
కేమి తెలియును? అందును నేను వట్టి యమాయకురాలను.
కంటికి నల్లని వన్నియు నీళ్ళు, తెల్లని వన్నియుఁ బాలు.

ఉంచినను బాల ముంచినను మీఁదే భారము. ఆవగింజంతకూడ మీ మాట కెన్నఁడు నడ్డు చెప్పుదానను మాత్రము కాను.

కృ—అదిగో- అదీ మాట! ఆమాటమీఁద నీవు నిలువఁబడితివా- యెల్లుండికి నీయొంటిని ఏడువారముల నగలు తగిలించి, ఆవలెల్లుండికి అయి దంతస్తుల మేడమీఁదఁ గూర్చుండఁబెట్టు భారము నాది. ఈ రాత్రి రఘునాథరావుగారి నిచటి కీడ్చుకొనివచ్చెద. ఒక రహస్యము- ఆయనకుఁ గొంచెము చుక్క యలవాటున్నది; సరే నాసంగతి నీవు వినియే యుందువు. అన్నట్టు, నీ కేమయిన రవంత యలవా టున్నదా?

హా—(తనలో) రవంతకర్మ మేమి- పూఁటకు బుడ్డి చాలదు! (పయికి) నా కంతగ నలవాటు లేదు కాని- మీవంటివారు తటస్థమగునప్పుడు మితము గాఁ బుచ్చుకొను వాడుక కలదు.

కృ—సరి యిఁక నేమి- చాలును. ఇం కొకటి- ఇంతవఱ కాయన బ్రాంది విస్కీలే కాని- పయిరుచు లెఱుఁగఁడు. పడఁదీసి నీవిప్పుడు పయిగ్రంథము లోనికి దింపవలెను. అప్పుడు కాని మన కాయన యంకెకు రాఁడు. తెలిసినదా?- సోడా విస్కీలు నేను బంపెదను. తక్కిన పదార్థములు నీవు తయారుచేసి సిద్ధముగా నుండుము. నేను పోయిరానా?

హా—అమ్మయ్యో! అప్పుడే వెళ్ళెదరా! శీఘ్రముగా వచ్చెద నని నా చేతిలోఁ జేయి వేసినఁ గాని- నేను వెళ్ళనీయను!

కృ—ఓసి వెఱ్ఱిముండా! నిన్ను విడిచి నేనుమాత్రము నిమిషముండఁ గలనా! అమ్మతోడు- తొమ్మిది కొట్టుసరికే ఆయనయు నేను నిక్కడ నుందుము. ఒక్కటే మాట- ఆయాస మాయనది- అనుభవము మనది. ఈమాటమనసులో నిడికొని, యెట్లు మసలవలెనో యట్లు మసలుము. ఒక్కముద్దిది- (అని ముద్దుపెట్టుకొని, నిష్క్రమించును.)

హా—(కుర్చీపై గూర్చుండి) మొత్తముమీఁద నీతనికి నాపై

మోజుగానే యున్నది. రఘునాథరావుగా రీతనిచేతి రాట్నపుఁ దిరుగుడుగానున్న ట్లిదివఱకు వినియె యున్నాను. ఏమో కస్తూరిరేఖ బయటఁబడు కాలము వచ్చిన దేమో! ఎందులకుం గొఱగాని ముండలకుఁగూడ నెంతలేసి భాగ్యములు పట్టలేదు!

సీ. కూటికిం గుడ్డకుఁ • గూడఁ దిప్పలు వడ్డ
మీనాక్షి యద్దాల • మేడ కట్టె
విటులకోసము వీధి • వీధియుఁ దిరిగిన
మాణి దివాణంపు • రాణి యయ్యె!
కడకు బేడకుఁ గూడఁ • గక్కుర్తి పడినట్టి
కనికికి మోటారు • కారు లేదవె!
పగలు గన్గొనఁ ద • ప్పక రాత్రి కల నగ
పసుపు రంగి జడ్జికి • ప్రాణమయ్యె!
వర్తకుఁడు, వైద్యుఁడువకీలు • వారకాంత-
యనెడు నీ వకార చతుష్ట • యమునఁదె లక్ష్మి,
ఆదినో, మధ్యనో, లేక • యంతముననో
వెలిగి తీఱుదు రెల నొక • వెలుగు వీరు!

మఱియొక విశేషము:-

గీ. వర్తకున కూర మేడయు • వైద్యున కొక
పతకమును; న్యాయవాదికి • బండి; వేశ్య
కున్నత ప్రాపకం బివి • యొదవెనేని
పరపతియు, గౌరవము, వచ్చు • బడియు హెచ్చు.

కాని, నేను నూవుగింజ వ్యవసాయములోఁ బడి కర్తవ్యము మఱచినాను! సోడా విస్కీ లతఁడు పంపును- పట్టెడు కోడిపిల్లలతో పయినంజులును సిద్ధము కాఁగలవు. నా ముస్తాబున కేమిటి దారి? అందును, దొంగకుఁ జీఁకటివలె- వేశ్యకు వేషమే యంగరక్షకము. నా తల్లిముండ నగలె కాక- సన్న చీరలుగూడ సారాయి కొట్లకు సమర్పించుటకుఁ బచ్చినదే కాదు. నా తల్లిని, నన్నును

గూడ మించినవాఁడు నా తమ్ముఁడు! అయినను, వారి ననవలసిన పని లేదు-

చ. తెలుపఁగ వారకాంతలకు • త్రాగుడు; పాములకున్ సుషుప్తి; లో
భులకమిత వ్యయేచ్ఛ గల • పుత్త్రులు; చోరులకుం బణంబు; కా
పురు కెడ లేని కోర్టుతగ • వుల్; పనివాండ్రకు బద్ధకంబు; బా
పలకసమష్టి దోషమును • బ్రాప్తిలకుండినఁ బట్ట శక్యమే!

వెంకటేశము:—(సత్వరముగాఁ బ్రవేశించి) అక్కయ్యా! అక్కయ్యా! అగ్గిపోరులాంటి బేరం తగిలింది! అదేవిటల్లా వున్నావు?

కస్తూ—నా యుండుట కేమి కాని- ఏమిటా బేరము?

వెంక—కాసింసాహేబు నీమీద కన్నేశాఁడు.

కస్తూ—ఏ కాసింసాహేబు? సిరంవారి మేడలోని సిల్కుబట్టల వర్తకుఁడా?

వెంక—అతఁడే అతఁడే! నిన్న గుమ్మంలో నుంచుండగా నిన్ను చూచాట్ట- అప్పట్నుంచీ, అట్టుసికిన ట్టుడికిపోతున్నాఁడు. వట్టి వాజమ్మఁడా కొడుకు! నేల చూపి నెత్తి గొట్టొచ్చును. ఇదుగో- యీ చొక్కా అత డిచ్చిందే. చెపితే నమ్మవు- చేతి కెముక లేదు! రవంత నువ్వు రంగు చేశావంటే- రమ్ము పీల్చినట్టు పీల్చెయ్యొచ్చును. వీధిలో నుంచోబెట్టి వచ్చాను- ఏఁ వంటావు?

కస్తూ—అట్లయిన, నొక సంగతి చెప్పెద నాలకింపుము: ఈ రాత్రి జమీందారు రఘునాథరావుగారు మనయింటికి రాఁగలరు-

వెంక—(ఆత్రము తో) ఏఁవిటీ!- జమీందారుగారే! అబ్బా! అబ్బా! అయితే యింకేఁవీ!- అదురుష్టదేవత మా అక్కయ్య చుట్టకు అగ్గిని వ్పందించిందన్నమాటే! కల్లుకొట్లకు నేను కారుమీద వెళ్ళా నన్నమాటే! వో! వో! వొళ్లు గరిపోడుస్తోంది! అయితే, అక్కయ్యా! యీ కబురెల్లా వొచ్చింది?

కస్తూ—ఆసంగతి యూవల చెప్పెదను. ముం దీసంగతి విను: పనివచ్చు సరి కింట నొక పట్టు చీరయైన లేకపోయినది. సాహేబుకడ నొక సిల్కుచీర సంగ్రహింపఁ గలమా?

వెంక—అబ్బె, అదెంతపని! కాస్త నువ్వు కొంగు తాకించావంటే కావల్సినన్ని చీర్లు. ఇదుగో - యీ దుబ్బెకొస్తానుండు. (అని వెళ్లును.)

కస్తూ—తురకసరసమునకు రవంత చుఱుకుదన మవసరము - చుఱుకుదనమునకు రవంత చుక్క యవసరము. (అని యలమారులోని బ్రాందిసీసా తీసి కొంచెము త్రాగును.)

వెంక—(కాసింసాహెబుతో ప్రవేశించును.)

కస్తూ—(మందహాసముతో) సలామండి- సాహెబుగారు ! సలాం !

కాసిం—(కంగారుతో) సానివారూ మాకీ సలాం సెప్తే- సానివార్కి మేం- సలాం మీదా సలాము సెప్తాం ! (అని సలాం చేయును.)

వెంక—అక్కయ్య ! సాహెబు బావయ్యగారికి నీమీద చాలా సరదా పుట్టింది. నిన్నట్నుంచి నీకోసం- నివ్వుతొక్కిన కోతిలా గున్నారు, వొళ్లు ముద్దెడితివా- వొందరూపాయ లిస్తారు. ఏం బావయ్యగారూ ?

కాసిం—ఠీక్ ఠీక్ ! మనషులోదీ మాటా- బయిటికీ- బరాబర్ తీసి- యీ ముంగలా యేశాడ్. ఘుస్మ్రంలో మిమ్మల్నీ సూశాం- ఘుప్పు నా మొహాన్ని ఖన్నా యేశాం- ఘుండెల్లో- ఘుబుల్ ఘుబుల్ బయిదెల్లింది ! సాపుకీ యెల్లాం- సందుగా కాడా కూకున్నాం - ఘుండెల్లో, ఘుబుల్ ! ఘుబుల్ ! ఘుబుల్ ! నమాజ్ సేస్కున్నాం- నాస్తా కాడా కూకున్నాం- ఘుండెల్లో, ఘుబుల్ ! ఘుబుల్ ! ఘుబుల్ ! బీడీ గీడీ కాల్సుకున్నాం- బిశానామీదా తొంగున్నాం- ఘుండెల్లో, ఘుబుల్ ! ఘుబుల్ ! ఘుబుల్ ! కంటికీ రెప్పా తగిల్తే- గాడ్దీ మాదీ వొకటి !

కస్తూ—మీ గుబులు నేను తీర్చెదఁ గాని- యిటువచ్చి యీకుర్చీపైఁ గూర్చుండుఁడు.

కాసిం—మాకీ కూకో మంటే కూకుంటాం- మల్లీ-గులామల్లీ కమ్మంటే గులామల్లీ అవుతాం.

వెంక—బలే ! బలే ! మా బావయ్యగారిమాటే పద్యాశింది !

కాసిం—(సంతోషముతో) అరే! అరే! మాదీ మాటా - మీాదా ఆడింది వోయ్! మంచీమాటా సెప్పిం దానికి - మల్లీ - యీానాం విస్తా పుచ్కో! (అని జేబులోని రూపాయలు తీసి) ఏక్, దో, తీన్, చార్, పాంచ్! (అని చేతిలో వేయును).

వెంక—(తనలో నాది నాకు ముట్టింది! ఇప్పుడు నాప నేవి లేదు. ఇంతలో వోసారి కొట్టుకాడికి పోయి చక్కావస్తాను. (నిష్క్రమిం)

కస్తూ—ఇటువచ్చి కూర్చుండ రేమి? (అని చేయిపట్టిలాగును.)

కాసిం—(పారవశ్యముతో)హవ్వా! హవ్వా! క్యామజా రే బావా! క్యామజా

కస్తూ—అయ్యో దేవుడా! అదేమట్లు కన్నులు తేలవేయుచున్నాడు కొంపతీసి గోవిందా కొట్టడు గదా! (చేయివిడుచును)

కాసిం—అరే! అరే! సచ్చిపోయాం! సచ్చిపోయాం! సానీవారూ! మీాకీ సలాం సేస్తాం- సెయ్యికి సెయ్యా తగిలిపిచ్చి- సెనం వూరు కొండి! మీాదీ శై తగిలేతల్కీ - మాదీ పానం - మక్కాయెల్లింది!

కస్తూ— అలాగుననా! అట్లయిన, నీసారి రెండుచేతులు తగిలించెద లెండు! (అని రెండు బుజములమీాదను రెండు చేతులు వేయును.)

కాసిం—(పారవశ్యముతో) అచ్ఛా! అచ్ఛా! అల్లా మీా సేతుల్లో అవల్ ఖుషీ - బలే షౌఖం పెట్టాడండీ! అందుకూశాతే - బలే బలే వో శంతా - మీా పాదాల్మీాదా పానం యేస్తార్!

కస్తూ—నా చేతులకు మీా అల్లా మఱియొక గుణము కూడ పెట్టినాడు. మీా జేబులలోం బ్రవేశించువఱకును మిల మిల లాడక మానవు (అని జేబులు తడవి, యందలి నోట్లు తీసి) అఁ ఆఁ! నోట్లు నా కొఱకే తెచ్చియుంటారు. నబాబు దర్జా యనఁగా - ఇది.

కాసిం—అదీ మాట! అఫ్కా దయా మాకీ షల్లంగా వుంటే - కుక్కలీ సేతా నోట్లూ - కుప్పల్ కుప్పల్ కక్కిస్తాం.

కస్తూ—అంతవారే మీారు. అన్నట్లు - కూర్చుండ రేమి?(అనిలాగును.

కాసిం—వోస్తాం, వోస్తాం, జరా నిలండీ. (అని కాళ్ల చెడావుల తీసి చేతఁబట్టుకొని) బస్ - చలో

కస్తూ—(నవ్వు బిగఁబట్టుకొని) చేతిలో చెడావు లెందులకు?

కాసిం—క్యా - చెడావ్ చోడ్డేనా ? అచ్ఛా (జోడు క్రింద వైచి, కూర్చుండి) మల్లీ - మీా రూఁకోండీ - మూపానం వోరుస్తాదండీ.

కస్తూ—అట్లయిన నిదిగోఁ గూర్చుండెద. (అసిరొయొసిలోఁ గూర్చుండును.)

కాసిం—(పారవశ్యముతో) అచ్ఛా! బాహా తచ్ఛా! అవల్ ఖుషీ యిప్డు అందుకుఁడీ - అమరా మన్షూ - పలావ్ డేక్కాలో పక్కా యేసీ - మామిడిపండ్లో మకాం సేసీ - హల్వా మేసీ - హంజూరా కొర్కి - జీడీ కాల్సీ - గుడాక్ పీల్సీ - ఘుమ్మాయిాయ్యా పొయ్యింది.

కస్తూ—సరి కాని, సాహేబుగారు మీాకీ గడ్డ మెందులకు?

కాసిం—బోల్నా ? కాపోడ్కీ కాడీ - కమ్మోడ్కీ పాడీ, గుమ్మాన్కీ సీడీ - ఖులాసాకీ బీడీ, పడుసోళ్ళకీ జోడీ - పలావుకీ కోడీ, రవుత్కీ ఘోడీ - రండేకీ కొడీ, ముల్లుకీ జీడీ - ముసల్మాన్కీ దాడీ - ముఖ్ఖెం, ముఖ్ఖెం! మీా అందాన్కీ తోడూ - మీా మూత్కీ దాడీ వుంటే - సబ్జఫరీ మీా పాదాలాకాడా సచ్చింది మాట.

కస్తూ—అయితే, హిందువులకు మీారన్నిట వ్యతిరేక మఁట కా?

కాసిం— అదీ మాటా ! హిందూవాడూ మీాదా పెంచీ, కిందా గొర్గితే - మాదీ కిందా పెంచీ, మీాదా గొర్గుతాయ్. హిందూవాడూ హేడంనుంచీ ఖుడ్కీ రాస్తే - మాదీ ఖుణ్ణుంచి హేడాన్కీ రాస్తాయ్. హిందూవాడూ హేడం నమ్మితే - మాదీ ఖురాన్నమ్ము తాయ్. హిందూవాడూ శివం సేస్తే - మాదీ నమాజ్ సేస్తాయి. హిందూవాడూ కాసీ యెత్తే - మాదీ మక్కాయెల్తాయ్.

కస్తూ—హిందువులు కాళ్ళతో నడువ - మీారు తలతో నడువరేమి?

కాసిం—మాకీ తలా నేలకీ తగిలిప్తే - మాసీ పోదండీ ?

కస్తూ—మాసిపోయినచో, మడేలువానిచే నుతికించుకొనవచ్చునుగా?

కాసిం—వుత్కితే దాడీ వూడీ పోదండీ?

కస్తూ—(పకపక నవ్వి) అదా వచ్చిన చిక్కు ! (తనలో) అప్పురా! అమాయి కత్వము. కనుకనే, యంత సామ్రాజ్యమును గంగలోఁ

గలిపి- కుట్టుపనికిని, గుమ్మము కావలికిని సిద్ధమయినారు! (పయికి) సాహేబుగారు! మీ పూర్వు లెంతటివారో యెఱుఁగుదురా?

కాసిం—జరా సెప్పండీ యింటాం!

కస్తూ—చెప్పు మనెదరా ? (అని లేచి)

సీ. భరతఖండం బెల్ల • పాలించి సిరులతోఁ
దూఁగినవారు మీ • తురకవారు

కాసిం—అదీ మాటా! యిందండీ యీనాం! (అని యుంగర మిచ్చును)

కస్తూ—వీరులై పోరుల • వీరాధి వీరులఁ
ద్రుంచినవారు మీ • తురకవారు

కాసిం—అచ్ఛా! అచ్ఛా! మా సేత్కీ కత్తి యిస్తే- మజా సూస్తాం!

కస్తూ—నవరత్న సింహాస • నంబులఁ గూర్చుండి
తోడరినవారు మీ • తురకవారు

కాసిం—(దిగ్గున లేచి) ఛూ! కుర్చీమీదా కూకుండి- కుకా- అయ్యాం!

కస్తూ—భోగంబునందును • త్యాగంబునందును
తులలేనివారు మీ • తురకవారు

కాసిం—బరాబర్! పండగా దిగ్తే- పలావ్ మీదా పడి సచ్చిపోతాం!

కస్తూ—శూరవరులకు జాగీరు • లూరి కొలువు
కాండ్రకెల్ల మిరాసీలు • కవుల కగ్ర
హారములు, పండితులకు మా • న్యంబు లొసఁగి
తుఱఁగలించినవారు మీ • తురకవారు!

కాసిం—అదీ మాటా! అంతా సెప్పిందాన్కీ- సానీ వార్కీ- మేం సంతోసం సేస్తాం- కోరండీ- ఆప్కా- ఖుషీ- కోరండి!

కస్తూ—మాట తప్పరుగద?

కాసిం—మాటా తప్తే- తురకా బిడ్డా మానీ- దూదేక్ బిడ్డాహోతో!

కస్తూ—అయితే, యీ రాత్రి సిల్కు చీర కట్టుకొని హాయిగా మీతో నుండవలె నని యున్నది- పంపెదరా ?

కాసిం—యిస్కా మాకీ తుఖ్మ్-యిదా సెప్పిందీ- కాకీమీదా యేసి,

కట్టా సీరల్ పంప్తాం- తమర్కి వచ్చీఅయిందీ తారీఫ్ సేస్కోండీ.

కస్తూ—కాకిమీఁదను వలదు- గాడిదమీఁదనువలఁదు. అదుగో మా తమ్ముఁడు వచ్చుచున్నాఁడు- అతనిచేతఁ బంపుఁడు.

కాసిం—అదీ మాటా! హాఁబాగంటా, హావ్వే తల్కి, హాకా సీరల్ హీంకా హుఁడ క్పోతే- మాదీ బాత్- మంజూర్ సెప్పకండీ!

వెంక—ఏఁవి టక్కయ్యా! యేఁవిటి?

కస్తూ—మీతురకబావగారు సిలుకుచీర లిచ్చెదరఁట- వెంట వెళ్లుము.

వెంక—వో! రండి బావయ్యగారూ- రండి! (అని పట్టి లాఁగును.)

కాసిం—అరే! హుండూ వోయ్ హుండూ! హుకుం తీస్కోనీ! సలామండీ సానివారూ- సలాం! మన్గా మీకీ తగిల్పిచ్చీ- మీదీ పెరీళం సాపుకీ యెల్తాయ్. సీరా కట్టీ మీర్ సిద్ధంగా హుంటే- మళ్లీ వొచ్చీ మేం మజాఖా సూస్తాం! చలో- సాలా!- చలో! (అని వెంకటేశముతో నిష్క్రమించును.)

కస్తూ—ఇక్కసికి, చీరబెంగ తీఱినది!

సీ. ఆఱిపోయిన చుట్ట • కగ్గి చేకుఱినట్లు
ఆఁకటితఱి నన్న • మమరినట్లు
లేవడిలో లాట • రీ వచ్చిపడినట్లు
షౌరుగూరిలో నప్పు • పుట్టినట్లు
నట్టేటఁ జేతికి • నావ చిక్కినయట్లు
కఱవులో వర్షము • కురిసినట్లు
బగ్గువేసఁగి నింట • బఱ్ఱె యీనినయట్లు
ప్లై బేస్తులో నాట • పడినయట్లు
సమయమున కేగుదెంచి యీ • సాహెబయ్య
పయికమా యిచ్చె, చీరలుం • బంపుచుండె;
మంచిదినములు కడుసమీ • పించె ననుట
కింతకన్న నిదర్శన • మేమి వలయు! (తెర పడును.)

ఇది తృతీయాంకము.

# మధుసేవ

## చతుర్థాంకము

### మొదటి రంగము.

ప్రవేశము:—రఘునాథరావుగారి మేడవీధి.

విశ్వా—(కాగితములు చేతఁ బట్టుకొని ప్రవేశించి) సందియ మేమి!-

గీ. మూర్ఖ భూపతి సేవయు • మూర్ఖ రోగి
వైద్యమును; మూర్ఖ భృత్యుని • పాలనంబు;
మూర్ఖ శిష్యుని చదివింపు • మూర్ఖ భార్య
పొత్తు- పగవారి కేనియుఁ • బొసఁగ రాదు!

మా ప్రభువు మూర్ఖప్రభువు కాకపోయినను, మధుసేవా పిశాచ మావహించినది మొదలు- ఊసరవిల్లి వలె- ఉదయ మొకరంగు, సాయంకాల మొకరంగు లోనికి దిగినాఁడు! ఆ పయిని, శనిగ్రహము వలె నీ శర్మయొకఁడు దాపురమై- మఱింత మావివేయుచున్నాఁడు!

చ. పడుచుతనంబు, స్వేచ్ఛయును • భాగ్యము, త్రాగుడు, దుష్టమైత్రి యే
ర్పడ నివి యొక్క- టొక్కటియె • బ్రహ్మను సైతముఁ బ్రక్క-దారికి
న్నడిపి, వివేకముం గెడపి, • నాశ మొనర్పఁగఁ జాలి యుండ- ని
య్యెడ నవి యన్నియుం గలిసె • నెంతకు నేనియుఁ దేక మానునే!

(పరిక్రమించి) దివాణపు వ్యవహారములను దిలకించుట లేదు- జాగు సేయందగిన కాగితములపైఁ గూడ సంతకములు చేయుట లేదు- ఋణము మాటాడుటకు సమయ మిచ్చుట లేదు! ఆపైని, పయికమునకు హద్దులేని చీట్లు- అడిగిన వడ్డీల కూరిలో నప్పులు- ఇంతకు వచ్చినతరువాత నిఁకఁ దరువాయి యేమిటి!

సీ. సమధికం బైన పు • చ్ఛా యగ్రహార మీ
మార్గంబున నేకదా • మాసిపోయె!
ఘనతరం బగు నిను • గంటి సంస్థాన మీ
తీరున నేగదా • తిరుగఁ బడియె!
కోమ టైన కోచ్చెర్ల • కోట ప్రభుత్వ మీ
విధమున నే.గదా • శిథిల మయ్యె!
రెప రెపలాడు మా • రెళ్ళ దివాణ మీ
చందంబున నేగదా • సన్నగిల్లె!
ప్రభువు దుర్వ్యసనంబుల • పాలఁ బడిన,
వర్తకుండు కాఫీహోటల్ • వంకఁ జనిన,
తరుణవిద్యార్థి నాటక • స్థలిని బడినఁ
జల్లచల్లగఁ ముప్పు వా • టిల్లి తీఱు!

అందును, బ్రాహ్మణ సంస్థానముల కస్తమయ కాలమె వచ్చినది!

మ. వ్యభిచారంబు, దురోదరంబును, సురా • పానంబు సారించి, జా
త్యభిమానంబు త్యజించి, యన్యమత వే • షాచారము ల్బూని, పా
పభయ మ్మూడ, సిరుల్ద్రోలంగ, ఋణముల్ • పైయాడఁగా, బ్రాహ్మణ
ప్రభువుల్ పుచ్చిన చెట్టులంబలె నశిం • పంజొచ్చి రత్యంతమున్!

బ్రాహ్మణ సంస్థానములకే కాదు- బ్రాహ్మణ జాతికే శనిగాఁడు పంద్రెండింటఁ బ్రవేశించినాఁడు!

సీ. చెప్పినట్టులు నడ • చిన కాలమున కర్త
వారి కుండయ్యెను • బ్రాహ్మణుండు
నిన్నటిదనుక మ • న్నించిన దొరలకు
ప్రాణగొడ్డం బయ్యె • బ్రాహ్మణుండు
ప్రేమతోఁ బూజ స • ల్పిన శూద్రజాతికి
పల్లేరు ముల్లయ్యె • బ్రాహ్మణుండు
మొదటినుండియు స్వాస్థ్య • ముగ నున్న యుద్యోగ
పదవికి పిడుగయ్యె • బ్రాహ్మణుండు

నేర్పె సకలకళలు • నేర్పె లోకుల కవి
బ్రహ్మదేవుఁ డనఁగఁ • బరఁగి నట్టి !
బ్రాహ్మణుండు నేఁడు • బాపనోఁ డయ్యెను !
కాలమహిమ కాక • కత మిఁ కేమి !

అయినను, దీని కన్యుల ననవలసిన పని లేదు-

సీ. మద్దినుసులు పండి • ముంగిళ్ళునిండించు
మళ్లు మాన్యము లు క • వుళ్లకిచ్చి
తోటలుం దోడ్లు మ • స్తగ తాకటులు పెట్టి
పెళ్లిన నిండ్లఁ బెం • డ్లిం ళ్లొనర్చి
కొంపలుం గోడులుఁ • దెంపుమై తెగనమ్మి
యెండ్లకొలంది వ్యా • జ్యములఁ జొచ్చి
పుస్తెలుం బూసలుఁ • బుణికి కర్చుల కిచ్చి
పుత్త్రిలం బెరచదు • వులకుఁ బుచ్చి
సౌఖ్యముల కాకరము లైన • స్వస్థలములు
వీడి, పొరుగూళ్ళ బానిస • వృత్తి నమరి
తమదు వ్రేల్పెట్టి తమకన్ను • తామె పొడుచు
కొనుచునున్నారు బ్రాహ్మణ • కులమువారు !

(కొంచెము నడచి) ఈ కాగితములపై సంతకములు చేయించుట కీపూఁట నైన సమయము చిక్కునో లేదో ! అదుగో సిపాయి చిన్నయ్య బయటనే యున్నాఁడు. (పరిక్రమించి) చిన్నయ్యా ! బాబుగా రేమి చేయుచున్నారు ?— ఏ మంటివి ? " బాబుగారును శర్మగారును గలిసి బయటి కెక్కడికో వెళ్ళినా " రనియా ? ఇదివర కెన్నఁడుఁ జీఁకటి పడినవెనుక నిల్లు కదలు నాచారము లేదే ! కొంపతీసి క్రొత్తనాటక మేదేని ప్రారంభము కాలేదు గద ! సరే, కానిమ్ము- సాహెబులవల్ల సంగతి తెలియక పోదు గదా ! (అని నిష్క్రమించును)

# రెండవరంగము

ప్రదేశము:—కస్తూరి గది.

ప్రవేశము:—రఘునాథరావుగారు, శర్మ, వెంకటేశము.

వెంక—అయ్యా! దయిచెయ్యండి- యియిగో కుర్చీలు. (ప్రక్కకుఁ జూచి) అక్కయ్యా! అయ్యగారు దయిచేశారు. ఆలశ్యం చేశా వంటే ఆగ్రఁ వొస్తుంది సుఁవా! బాబూ! మా అక్కయ్యకు మా సిగ్గండి. మాసంగతి మేం చెప్పకో కూడను కానీండి- మం చోరు కనక మనవి చేస్తున్నాను. ఆటకేం, పాటకేం; అందానికేం; చందానికేం ; సరసానికేం, సల్లాపానికేం- మా అక్కయ్యపాటి చెయ్యి మన జిల్లాలో లేదండి! కళాయిసేత్రం వంతా కంటోపాటఁ వండి! యెనబైనాలుగు రకాలూ యేకబిగిని నడుపుతుం దండి! కోనసీఁవకు మేళం వెళ్లాఁ వంటే కోతుల్లాగ చుట్టుకుంటారు! పేరూ ళ్లో, మాఅక్కయ్యయిల్లు పట్టి పెళ్ళిమూర్తాలు పెట్టించుకుంటారు సాదారణంగా వోపాటివారికి సరే అనేమనిషి కాదండి. తునిజమీం దారుగారు కబురంపిస్తే- త్తూ పొమ్మంది! విజేనగరం మహారాజు గారు పాట వినడానికొస్తే- వీల్లేదు వెళ్లమంది! అల్లాంటిది, తమ రొస్తున్నారంటే- అంటుమాఁవిడి పండులాగ తయారయింది! చిన్న వాణ్ణయినా నా మాట చిత్తగిస్తారని మనవి చేస్తున్నాను- సా న్నుం చితే విన్నావారు శాబాసనే సా న్నుంచాలి. కూటికి తగ్గా కూరా- సరసుడికి తగ్గా సానీ- సమకూడ్డం మాకష్టం! (మరల ప్రక్కకుఁజూచి) ఏఁ వక్కయ్యా!- రావేం? నువ్వు రాలేదని బావయ్యగారు నుంచునే వున్నారు.

కస్తూ—(ముస్తాబుతో, తళుక్కునఁ బ్రవేశించి) అయ్యా! దండములు!

రఘు—(తనలో) ఓహో! యేమి సౌందర్యము!

ఉ. ఆకురు లేమి! ముంగురుల • నంగగు నా నొస లేమి! వీనులకా
దేకువఁ దాకొనం గొనలు • తీరిన యా కనుదమ్ము లేమి! పూ

సోకినఁ గందుచందమున • శోభిలు నా తనువెక్కు లేమి ! యోహో
రా ! కనుదోయి నేఁడు గద • రా! చరితార్థము నొందె నెంతయున్!
దీని లావణ్యము వీక్షించుటకుఁగూడ శక్యము గాకున్నదే !

ఉ. కన్నులె చూతమన్నఁ దమకంబునఁ జెక్కుల వ్రాలుఁజూడ్కు! లం
దున్నను మేలె యనొ్కనిన • నుండక, ఫాలము మీఁద సోలు! నం
దున్నను జాలు ననొ్కనిన • నుండక, వాతెరవంకఁ దూలు ! నీ
యున్నులమిన్నఁ జూడ వశ • మా యిరుకన్నులవాని కొక్కటన్ !

శర్మ-(తనలో)నిజముగా,దీనిగుమ్మములోఁగుక్కయై పుట్టినను జాలును!

ఉ. ఎందఱు లేరు సాను లిది • యేమి తపంబొనరించి పుట్టెనో !
కుందన మూ శరీరమున • కుం దిగదుడ్చ్వన కేని మాఱునే!
చందురుఁ డామొగంబునకుఁ • జాకిరి సేయుట కైన నర్హుడే !
పొందిన నిట్టిదానిఁ గద • పొందవలెం దల యిచ్చి యేనియున్ !

వెంక —(కస్తూరి వెనుక నిలిచి మెల్లఁగా) కొంచెం ముందు కెళ్లనమ్మా దీపం మొహంమీద కానేటట్టు తిరిగి నుంచో ! పయిట కాస్త పక్కకు జారనీ ! కంగారు పడితే కార్యం లేదు ! చొరవ చెయ్యాలన్నాడు ! కూచున్నపాళాన్ని గుమ్మై పోవాలి ! అబ్బా !- నే నాడదాన్నయితేనా !-

కస్తూ—(మెల్లఁగా) సరే కాని- నీ విఁక వెళ్ళి సాహేబు సంగతి చూడు.

వెంక—అదెంతపని కానీ. బ్రాందిచుక్క నోటికి తగిలి పదిరోజు లయింది. నాలుగుబుడ్లూ వొం చెయ్యాక నావొంతు నాకుంచు ! (అని నిష్క్రమించును.)

శర్మ—వెంకటేశ మేమిటి వెనుకనుండి గొణుగుచున్నాఁడు?

కస్తూ—మ త్తేమియు లేదు- అయ్యగా రట్లు నిలుచుండియే యున్నారు- కూర్చుండుఁ డనవే మని నన్నుఁ గూకలు వేసినాఁడు. వారికిఁ దగిన కుర్చీ వేయలేకపోతిని గదా యని వాక్కు రాక నేను జూచుచున్నాను ! అయినను, గొండంత దేవరకుఁ గొండంత పత్రి తేఁగలవా రుండరు గదా ?- వారి చిత్తము- నా భాగ్యము !

శర్మ—మాబాబుగారి మత మెఱుఁగక నీవట్లు నీళ్లునములుచున్నావు- ఇంత నిగర్వచూడామణులు, ఇంత రసికాగ్రేసరులు- లే రను కో !

కస్తూ—ఆసంగతి యనుభవమునీఁద గాని- బోధపడునదికాదు.

రఘు—(తనలో)అచ్ఛా!- అందముగా వేసినది ముక్క ! (కూర్చుండును)

శర్మ—కాపిటల్ ! నీ డౌ టిప్పుడైన నివారణ మైనదా ?

కస్తూ—ఒకసాక్ష్యము సాక్ష్యమా ? ఇం కొకటియైనఁ జూడవలెను.

శర్మ—అట్లయిన, నదికూడ కానిమ్ము.

కస్తూ—చిత్తము - ఓటికలో వచ్చెదను. (అని నిష్క్రమించును)

శర్మ—(ప్రక్క-కుర్చీలోఁగూర్చుండి) ఏమి బాబూ- ఎట్లున్నది కస్తూరి?

రఘు— ఎట్లుండవలెనో య ట్లున్నది !

గీ. పసిఁడిబొమ్మ చైతన్యము • పడసినట్లు
మానికము ముద్దుగుమ్మగా • మాఱినట్లు
మించు స్త్రీరూపమును ధరి • యించినట్లు
నాదు కనులకుఁ దోఁచె నీ • నాతి సఖుఁడ !

శర్మ—ఈ యింట నింకొక విశేషము- విటుల నమాంతముగా విఱుచుకొనితిను వేయినోళ్ళ వేశ్యమాతాపిశాచ మొకటి లేదు!

గీ. అన్నమున వెంట్రుకయు; సున్న • మందు ఱాయి;
పానకములోనఁ బుల్లయు; • పాల చీమ ;
సానియింటను దల్లి; మంచమున నల్లి-
సర్వసామాన్యముగఁ దట • స్థంబు లగును !

రఘు—ఐననాలోటులేదు- వెంకటేశము వేయిమంది వేశ్యమాతలపెట్టు!

కస్తూ—(బ్రాంది, సోడా బుడ్లు తెచ్చి బల్లపైనుంచి, మరల వెళ్ళును)

రఘు—(వెఱగుపాటుతో) సరి కాని- యీ సన్నాహ మేమిటి! దీనికి దివ్యదృష్టి కూడఁ గలదా యేమిటి !

శర్మ—తక్కినసానులకును దీనికిని గల తారతమ్య మిదిగో యిదియే!

ఆ. ఎదుటివారి చిత్త • మెట్లో యిట్టె యెఱుంగు
నచ్చునేని ప్రాణ • మిచ్చివేయు

పరువె కోరినమ్మి • పసియుండు నొకఁడని
తోఁచె- దీనివంటి • సానికలదె !

రఘు—ఇంటియొద్దఁ బూర్తిగాఁ బుచ్చుకొనికూడ వచ్చితిమి కదా - ఇప్పుడు మనము చేయవలసిన దేమిటి ?

శర్మ—గాజులచేతులతో నది యందించు గ్లాసులు గబగబ కైకొని- గడగడ నోటఁ బోసికొనుటయే. అన్యథా యొనర్చిన నాముండ చిన్నబుచ్చుకొనదా ! అది గాక- ఆర్నాల్డే మన్నాఁడు ?-

* వెల్, ఐ డోన్టు కేర్ యిఫ్ ఐ పార్టేక్
జస్టు ఫర్ మానర్సు అండ్ పొలైట్‌నెస్ సేక్.

అన్నాఁడు. ఆపాలిసీ యే (Policy) మన కథార్టీ. (Authority).

కస్తూ—(పళ్ళెరముతో భక్ష్యములును, గ్లాసులును దెచ్చి బల్లపైనుంచి యొకసోడాబుడ్డి కొట్టి రెండుగ్లాసులలోఁ బోసి, బ్రాందితో నా రెండుగ్లాసులు నింపి, యొకగ్లాసుతో రఘునాథరావుగారిని సమీపించి) చేతి కీయనా ? నోట కీయనా ?

శర్మ—కాపిటల్! ఆ ముక్కకు ముం దాన్సర్ (Answer) చెప్పండి !

రఘు—మాకుఁ గావలసినది గానరసము కాని, మధురసము కాదు.

కస్తూ—చిత్రము. కాని, కామశాస్త్రవిధ మది కాదు. మొదట మధురసము. పిదప గాన రసము. పిమ్మట నధర రసము.

శర్మ—హియర్! హియర్ ! ఇప్పుడు చెప్పుడు సమాధానము.

రఘు—ఇఁక నిదిగో యిదే సమాధానము! (అనియందుకొని త్రాగును)

కస్తూ—(రెండవగ్లాసు నెత్తి) నాకుఁ గుడిచేతులు రెండు లేనందున, మీకు వెనుక నీయవలసి వచ్చినది. (అని శర్మ కిచ్చును.)

శర్మ—నాకు ముందు వెనుకలతోఁ బని లేదు. నాలుగు చుక్క లెక్కుడుగాఁ బడుట ప్రధానము. (అని త్రాగును.)

కస్తూ— (చిన్న పళ్ళెరముతోఁ గొన్ని భక్ష్యములం బట్టుకొని) తమ చేతులకు చము రంటు నేమో- నేను దినిపింతునా ?

---

* Well, I don' t care if I partake—just for manners and politeness sake.

రఘు—ఏమిటవి? సరి సరి తెలిసినది. మా చదు వంతవఱకు రాలేదు.

కస్తూ—అబ్బే! అదేమి న్యాయము? దక్షిణ లేని దానము. శ్రుతి లేని గానము. నంజుడులేని పానము నా ?

రఘు—అది కాదు. నా మాట విను. ఆ కంపు నేను భరింప లేను.

కస్తూ—గసగసా మసాలాతో కమ్మగా వేగిన క్రైమా లడ్డూలు కంపా! మంచిది, మీ మాట యటుండనిండు. (శర్మతో) మీరో ?

శర్మ—నామాట యడుగ వలెనా ! సర్వభక్షకుఁడును నేనును సవతి యన్నదమ్ములము. (అని మ్రొక్కుచు) హాయి ! హాయి ! ఫ్రెంచి ప్రెపరేషన్సు (French preparations) వీనిమీఁద బలాదూరు !

కస్తూ—(మరల గ్లాసునింపి) ఇదిగో - యీసారి నోటికిచ్చెద.

రఘు—ఇప్పుడేగా యైనది. మరల నింతలో నేనా !

కస్తూ—అయ్యో నాయిల్లు బంగారము కాను! అధరపానమునకును మద్యపానమునకును హా ద్దేమిటి ! (అని నోటికీయఁ బోవును.)

రఘు—ఇటిమ్ము. (అని యందుకొని, కొంచెము కొంచెము త్రాగును.)

కస్తూ—(రెండవగ్లాసు నింపి) ఇదిగో మీగ్లాసు. (అని శర్మకిచ్చి రహస్యముగా) మీరు వెళ్ళి యీ మిద్దె గదిలోఁ గూర్చుండుఁడు. మీకుఁ గావలసిన వన్నియు నచ్చట నుంచినాను. ఈయన నిచ్చట జోకొట్టి, మీయొద్దకు వచ్చెదను.

శర్మ—(బ్రాంది నోటఁ బోసికొని లేచి) ఇక్కడ నాకేమో యుక్కగా నున్నది. ఒకసారి పెరటిలోని కేగి యొడలార్చుకొని వచ్చెద. (అని నిష్క్రమించును.)

కస్తూ—(బ్రాందిసీసా యెత్తి) ఇదిగో యింక రవంత పోయనిండు.

రఘు—నో నో ! యింక వలదు. ఇక్కడికే యెక్కు వైనది.

కస్తూ—నాలుగు చుక్కలు. నన్ను చంపుకొని తిన్నట్టే. నామాటవిన్నక తప్పదు. (అని బలవంతముగా గ్లాసునిండ పోయును.)

రఘు—(గడ గడ త్రాగివేసి, గ్లాసు క్రిందఁ బాఱవేయును.)

కస్తూ—మీకుఁగూడ నుక్కగా నున్న దేమో విసరుదునా ?

రఘు— (మైకముతో) విషుర్ధునా అంటావా? విషి_శ్రే-వి-షి-_శ్రే- విష్కి— మంచిదా- పాంపేను మంచిదా- అని- విశ్వనాథం నేనూ తగువు పడ్డాం! తెల్సిందా? విష్కి— మంచి దంటాడు విశ్వనాథం- పాంపెయిను మంచి దంటాడు పెర్మి- నువ్వేమంటావు?

కస్తూ—(తనలో) అయ్యగారి కందుకొన్నది! ఈ యుండలు తినిపించుట కిదే సమయము. (ఉండలు చేతఁ గొని, చటాలున నొడిలోఁ గూర్చుండి) నామ ట విన్నచో- మీమాట కుత్తరము చెప్పెద.

రఘు—ఓ! వింటా! పెళ్లికొడుకు విన్నట్టు వింటా! చెయ్యి మీఁద వెయ్యమంటే వేస్తా! (అట్లు చేసి) చెక్కిలి ముద్దు పెట్టుకోమంటే పెట్టుకుంటా! ఇదిగో- పెట్టుకున్నా (అని యట్లు ముద్దు పెట్టుకొని) ఈసారి చెప్పు!

కస్తూ—నేను గన్నులు మూసినచో, మీరు నోరు తెఱవఁ గలరా? ఏది- చూతము- (అని యెడమచేత నతని కన్నులు మూయును)

రఘు—ఓ! ఒక్క దెబ్బని! తెఱవనా?- ఇదిగో! (అని నోరు తెఱచును.)

కస్తూ—(కై మాయుండ నోటకుక్కి, నోరు మూసి పట్టుకొనును.)

రఘు—తెలిపింది! తెలిపింది! హాబ్బా! కంపు! కంపు! వాాక్!

కస్తూ—వాతోడు- నన్ను చంపుకొని తిన్నట్టే! కసబిస నమలితిరా- కమ్మని వాసన బయలు దేరును. (అనుచు, నోటికి చేయి యడ్డు పెట్టును)

రఘు—(కొంచెము నమలి) ఔ నౌను- అనుకొన్నంత కంపు లేదు!

కస్తూ— ఈసారి చూడుఁడు! (అని యింకొకయుండ నోట వేయును.)

రఘు—(ఇష్టముతో నమలుచు) నిజమే నిజమే! ఈసారి గరిముక్క కంటె కమ్మగా వుంది! ఏది- యింకో టందుకో!

కస్తూ—(అదిగో, అదీ అందము! అని పళ్లెరము చేతిప్రక్క నుంచును.)

రఘు—(ఉండలు మెక్కుచు) అన్నట్టు, నీ వేమీ పుచ్చుకోలే దేమీ?

కస్తూ—నాకొక వ్రతమున్నది. ఎవరైన గ్లాసు నింపి, యందింపవలెను.

రఘు—అయితే నే నందిస్తా! (అని గ్లాసు నింపి, నోటి కిచ్చును.)

కస్తూ—ముందు మీరు కొంచెము పుచ్చుకొని, శేషము నాకీయవలెను.

రఘు—షెబాష్!- అదీ పోకు! (అని యట్లు చేయును.)

కస్తూ—ఈసారి వంతు నాది. (అని గ్లాసునింపి, కొంచెము త్రాగి, అతనినోటి కీయఁ బోయి) ఏమిటి యాలోచించుచున్నారు?- ఎంగిలి యనియా?-

గీ. బ్రాంది సారాలకును, పాన • పాత్రములకు
బిత్తరుల మోవులకును, కా • ఫీ హొటళ్ళ
చిప్పలకుఁ, బూఁటకూళ్ళిండ్ల • చెంబులకును-
నెంగిలియు, సిగ్గు నను న వెం • దేని గలవె!

రఘు—ఎవ డన్నాడు ఉన్న దని?-ఎవడైన ఉన్నా యంటే-ఏడ్పావు పొమ్మందాం! ఆ! (అని నోరు తెఱచి, నోటఁ బోయఁగా మ్రింగును)

కస్తూ—నా కిప్పుడు నచ్చినారు! ఇంతటినుండి యీశరీరం మీదఁది!

రఘు—నీ శరీరం నాదైతే- నా శరీరం నీది! నా ప్రాణం నీది! నా యెస్టేటు నీది! నా గుఱ్ఱా ల్నీవి- నా కుక్క-ల్నీవి- నా - వ- స్నీ-నీవి!

కస్తూ—మిగిలినవానిమాట కేమి కాని- మీ శరీరము నా దన్నారు గదా- మీ శరీరమునం దున్నవికూడ నావేనా?

రఘు—ఓ! సర్వం నీవే! నీవే సర్వం-సర్వానికీ నీకూ-సాం వేను ఫస్టు!

కస్తూ—అట్లయిన, మీ వ్రేలి యుంగర మొకటి నా వ్రేల నిడికొననా?

రఘు—అన్ డౌటెడ్లీ! (Undoubtedly) ఇదుగో యిడి రవ్వ- ఇది కెంపు- ఇది పచ్చ- ఇది నీలం- ఇందులో నీకిష్టమయింది తీసుకో!

కస్తూ—(చూచి) అన్నియు నాకన్నుల కందముగానే యున్నవి. ఇం దేది తీసికొనను!

రఘు—అయితే, అన్నీ తీసుకో! (అని యన్నియుఁ దీసి యిచ్చును.)

కస్తూ—(వ్రేళ్ళ నుంచుకొని) ఈసారి యీ యుంగరముల చేతితో నిచ్చునది పుచ్చుకొని చూడుఁడు! (అని గ్లాసు నింపి త్రాగించు చుండగా తెర పడును.)

ఇది చతుర్థాంకము.

# మధుసేవ

## పంచమాంకము

### మొదటిరంగము

(ప్రదేశము:—రాజవీధి.

రంగఁడు—(మధుపాన మత్తతచేఁ దూలుచు, పాడుచుఁ బ్రవేశించి)
సుక్కా ! నీ బొడ్డు పొక్క ! సురుకు సెయ్యవే !- రమ్మి సుక్కా-
కక్క ముక్కా, సీకుముక్కా- కాల్సి పెడతానే- రమ్మి-సుక్కా!
ఇరుగు పొరుగు నవ్వనీ- యీడువాళ్ళు తిట్టనీ
పరుగు పరుగూ వొచ్చి నీదు- పాల బడతానే- రమ్మి- సుక్కా!
పిల్లా జెల్లా మాడనీ- పెళ్లాం దెబ్బ లాడనీ
కల్లుకిందా నీకిందా - కర్చుపెడతానే, రమ్మి- సుక్కా !
ముక్కూ మూతీ పగల్నీ - ముంగలిపళ్ళూ రాల్నీ
తొక్క లూడీ పోయిందాకా-దొర్లుతానే-రమ్మి- సుక్కా !

(చరాలునఁ దిరిగి చూచి) ఎవ డా నవ్వేవాడు! నన్ను షూషి నవ్వినోడు నా మీదనుంచి బలాదూరు ! త్రాగినందుకు నవ్వారంటే దవడపళ్లు రాల్తాయి ! కులాసా కోసం గుక్కెడూ- షో కోకం షోలెడూ- దర్జా కోసం తవ్వెడూ- త్రాగితేచుట్టరం తప్పేఁవిటి ? ఎవడు త్రాగనోడు? నా తాతత్రాగాడు- నా తండ్రి త్రాగాడు ! నీ తాత త్రాక్కపోతే- నిలువునా కొరతెయ్యి ! తెల్షిందా! నీ తండ్రి త్రాక్కపోతే- నిడదోలుమడుగులో వూరెయ్యి! మళ్లీ మాట్లాడావంటే మరామేకు ! ఆగు! ఆపా ట్నాగు ! దగ్గిరి కొచ్చావంటే తన్తా ! పాగదీసి టున్నానంటే- పాకిరేవులో యెల్లి పడాలి ! అయితే, కాషుకో, మరి! అప్పా! యిదుగోటన్ను!

(అని యెదుట నెవరో యున్నట్లు తన్నఁబోయి, వెల్లకిలఁ బడి) కా లేదు- పిత్తు కా లేదు! కావలిస్తే యింపు షూషుకో! కూకుంటే కుక్కపిల్ల- లెగిస్తే లేడిపిల్ల- కాదన్నవోడు గాడ్దిపిల్ల! ఇదుగో- లేస్తున్నా- లేశా! (అని లేవఁబోయి మరలఁ గూలఁబడి) బలే! పల్టీ కొడ్తే యిల్లా కొట్టాలి! పైల్వానోళ్లంతా- నామీద నుంచి బలాదూరు! దీనిమీ దింకో డ్రాంపడితే- దివిటీలా గెలిగానన్న మాటే! (అని యెట్లో లేచి)

ట్రియ్యాని మాఁవీడి పండ్రూ- పండ్రూ-

ట్రినబోతే డొరకాదు- ట్రీపూలు మెండ్రూ. ట్రియ్యా.

ట్రీపులు మెండ్రు- ట్రీ-పు-లు-మెండ్రు! ఎండులో వుంది ట్రీపి? పెప్పాకుంటే- పేరు సారా పిజెంటు! మాఁవిడిపండ్రు ట్రీ పన్నావోడు-మాదిగాడి కొడుకు! ఇష్టఁవొచ్చినంత ట్రీపి యీంతి కల్లులో వుంది! టాటికల్లు-టల్లి; యీటకల్లు- పెళ్ళాం! ఇహీహీహీ! ఇహీహీహీహీ! ఇహీహిహీహీహీ! ఈటకల్లు ట్రాగే- యిందురుడు- పెందురు డయ్యాడు! ఈటకల్లు ట్రాగే- యిష్టామిత్తురుడు- యీరబద్దురు డయ్యాడు! ఇహీహీహీ ఇహీహీహీహీ!

ఇప్పు డెల్లి ట్రాగుటాను- యీట కల్లు,
తరవా తెల్లి ట్రాగుటాను- తాటి కల్లు;
పగ లెల్లి ట్రాగుటాను- పట్ట సారా.
రాతి రెల్లి ట్రాగుటాను- రమ్ము సారా.

(చరాలుసఁ బ్రక్కకుఁ జూచి) ఎవడా యెక్కిరించేవోడు! ఎక్కిరించినోడి గుండె మీద- యెగిరి తన్నా! కైదులో కెళ్ళొచ్చా ననా- కళ్లు మిడకరి స్తున్నావు? కన్నఁ వే శెళ్ళానా! కైదులోక? ట్రాగడానికి డబ్బు లివ్వకపోతే- ట్రలకాయ పగలే శెళ్ళాను! ఆర్నెల్లు కూకుంటి- హాయిగా తినొచ్చాను! మల్లీకొడ్తాను- మల్లీ యెల్తాను! షర్కారోడు జైల్లోనే సారాకూడా పొయ్యిస్తే- షచ్చిం దాకా జైల్లోనే వుంటాను!

అపనా - తన్నా - మన్నా - మారోరి బైరన్నా. అపనా.
మారోరి బైరన్నా - మంచోడు బైరన్నా. అపనా.
పింతపెట్టా పిగురుషూడు- పిన్నదాని పొగరు షూడు,
రాజమండ్రీ యెల్లి షూడు-రమ్ము సారా ట్రాగి షూడు. అపనా.

(ముందునకుఁ జూచి) ఎవ డా వచ్చేవోడు ?- పెర్మలా గున్నాడే ?- ఆడే- ఆడే- బాబుగారి షొమ్మంతా యీడు పడ దినేస్తున్నాడు ! ఈ పూట కర్చు- యీడిదగ్గర లాగాలి. కాష్టేవు పెద్దమనిషిలాగు కనపడతా ! (శరీరము బిగఁబట్టి నిలుచుండును.)

శర్మ—(ప్రవేశించి, చూచి, యులికిపాటుతో) ఇదుగో- యీ టెర్రిబిల్ ఫెల్లో (Terrible fellow) యెప్పుడో జైలులోనుండి దిగినాఁడే ! మరల నూరిలో మరిడీదేవత ప్రవేశించిన దన్న మాటయే ! ఈ రాస్కెల్ (Rascal) కంటఁ బడకుండ నీ ప్రక్కసందునఁ బడి పోదునా ? (ఆలోచించి) కాదు కాదు- ఇటువంటివాని కేమయిన చెప్పుచు, చేతిలో నుంచుకొనుటయే మంచిది, అవసర మైనచో విశ్వాసరావు నొకసారి వీనిచే నుతికింపను వచ్చును. (అని నడచును)

రంగ—దణ్ణాలండి బాబూ దండ్ణాలు! తమరికోసఁవే షూస్తున్నా !

శర్మ—ఇదిగో - వచ్చినావా ?- యీమధ్య నీవు లేక యూ రంతయుఁ జిన్నబోయినది !

రంగ—పిత్తం పిత్తం ! రంగడిషంగతి మీరు కనిపెట్టారు ! మీ పాదాలు పట్టుకుంటే- పాపాలు పోటాయి! (అని పాదములపైఁబడును).

శర్మ—పోయినవి నీ పాపము లన్నియు పోయినవి- లెమ్ము.

రంగ—నే లేవను!- ఈపూట కర్చు మీరివ్వాలి- నే లేవాలి !

శర్మ—ఇంతే గద ?- ఈ పూఁటనే కాదు- ఇది మొదలు నీకు లేస ప్పుడెల్ల యిచ్చెదను. ఇఁక లేచి, నాతో రమ్ము.

రంగ—(లేచి) వో-అల్లాగైతే- మీ ఆడ్డరు పెకారం నడుస్తా ! మీరు తిట్టమ న్నోణ్ణి తిడ్తా - మీరు కొట్టమ న్నోణ్ణి కొడ్తా ! (అని వెంబడింపఁగా - ఇరువురు నిష్క్రమింతురు.)

## రెండవ రంగము

(ప్రదేశము:—రఘునాథరావుగారి మేడమీఁది చావడి.

రఘు—(ఒంటరిగాఁ గూరుచుండి) ఎంత దుర్దినమో కాని - నే డెచ్చటను బదులే పుట్టినదికాదు ! నాయనగారి నవరత్నమాలిక యుండబట్టి - తాకట్టునకుఁ బంపి, ధైర్యముతోఁ గూర్చుండుట కవకాశము చిక్కినది. శర్మ వెళ్ళి చాలసే పయినది, ఇంత సేపేమి చేయుచున్నాఁడు చెప్పుమా ! ఒంటిపాటునకంటె నోపరానిదిం కొకటి లేదు గదా !

గీ. చందురుని చుట్టుఁ జుక్కల • సరణి- మిత్రు
లెవని చుట్టును నుం డ్రతఁ • డే కృతార్థుఁ;
డెవఁడు మరుభూమియందలి • యెండుమోడు
కరణి నొంటరి యగు- వాఁడె • కష్టజీవి !

కాలక్షేపమునకుఁ గస్తూరివంటిది మఱి లేదు. సంవత్సరము లు దానికడ క్షణములక్రిందఁ గడచిపోవును.

చ. పలికిన- పారిజాతములు • పమ్మిన యట్లగు; వాలుచూపులఁ
జిలికినఁ- గ్రొమ్మెఱుంగులను • జిమ్మినయట్లగు;నీటు పాటలఁ
గులికినఁ-బూవుటమ్ములను • గ్రుమ్మినయ ట్లగు; డాయ వచ్చినఁ
గలకలలాడుచుం దివము • కామినియై చనుదెంచున ట్లగుఁ.

(వినుట నభినయించి) అదుగో- శర్మ వచ్చుచున్నాఁడు ! (అని చూచి, యంతలోఁ దెల్లపోయి) అయ్యో దేవుఁడా ?- శర్మ కాఁడు- విశ్వాసరావుగారు ! ఈయన కొంటిగాఁ గంటఁ బడకుండ నిక్కడి కన్ని దినములుండియో కాలము గడపుకొని వచ్చినాను ! ఈపూఁట నిఁకఁ బట్టువడక తప్పదు ! ఔరా ! అంత చనువుగల విశ్వాసరావు గారి కెంత భయపడవలసి వచ్చినది!

సీ. బడి మాని తిరుగు తుం • డుడుకు విద్యార్థికి
తన యయ్యవారి ద • ర్శనము వోలె

కన్నంబు వైచి పో • నున్నట్టి దొంగకు
పోలీసువాని జా • పురము వోలె
కుడువక ముడువక • కూర్చెడు లోభికి
రాటించు గురువుల • రాక వోలె
మిండతి యై హద్దు • మీఱిన చెడిపెకు
నాథుని సన్నిధా • నంబు వోలె
తప్పుదారులు మరగి స్వ • తంత్రవృత్తి
మసలఁ గోరెడు వారికి • మాన్యజనుల
సంగతి సమస్తవిధముల • జంకుఁ, గొంకుఁ
గించయు, నసహ్యమును కలి • గించుఁ గాదె!

విశ్వా—(ప్రవేశించి, తనలో) ఓహో! బాబుగా రొంటరిగా నున్నారె! ఔరా! మద్యవిష మీయన నెంతగా మార్చివేసినది!

సీ. నిండు జాబిల్లిని • నిరసించు నెమ్మోము
కడుగని, తోమని • కంచ మయ్యె!
తమ్మిపూ రేకుల • తలఁ దన్ను కన్నులు
గరిసిపోయిన గాజు • గరిటె లయ్యె!
పసిఁడి యద్దంబుల • భంగించు చెక్కులు
కుట్టు లూడిన చెప్పు • టట్ట లయ్యె!
చిగురాకు డొప్పుఁ • జిన్నబుచ్చెడు మోవి
తడి యాఱిపోయిన • వడియ మయ్యె!
చూడ ముచ్చట గొలిపెడు • సొబగుమేను
వాడిపోయిన లే జొన్న • కాడ యయ్యె!
శివుని గళ మొకట్టియె నల్పు • చేసినట్టి
కాలకూటంబు సురకన్న • మేలు కాదె!

రఘు—రండు మామగారు! రండు- ఏమిటి విశేషములు?

విశ్వా—బాబు! ప్రత్యేకము చెప్పఁదగిన వేమియు లేవు. ముఖ్యవిషయములు కొన్ని ముచ్చటింపవలసివచ్చినాను. (కూర్చుండును.)

రఘు—అలాగునా? అయ్యో- నా కిపు డవకాశము లేదు గాదా! పది మంది మిత్రుల కీపూఁటఁ దోఁటలో టాలు. అతిశీఘ్రముగా నే నిపు డచ్చటికి కేగవలసి యున్నది. మనము రేపు మాటాడుకొనఁగూడదా?

విశ్వా—బాబు! తమ బాలుకంటె నిది తక్కువవిషయము కాదు. ఈ యేఁటి కిస్తీ యింతవఱకుఁ జెల్లింపనందున—ఇరువదినాలుగు గంటలలోఁ జెల్లించి తీఱవలె నని ఈ పూఁట నోటీసు వచ్చినది.

రఘు—ఇంతవఱ కేల చెల్లింపలేదు?

విశ్వా—సొమ్ము లేక.

రఘు—అదేమి?- హాలుసాలు సిస్తులు వసూలు కాలేదా?

విశ్వా—వసూలును నైనవి- వడ్డీలక్రిందను బిల్లులక్రిందను వ్యయమును నయినవి.

రఘు—వడ్డీలు నిలుపు సేయక పోతిరా?

విశ్వా—వడ్డీలు నిలుపు చేసినచో- వాయిదాలు గడచు పసి, దండన మరతుల ననుసరించి దండుగ లిచ్చుకొనవలసి రాదా?

రఘు—అట్లయిన, నే బాపిరెడ్డి యొద్దనో బదులు తీసుకొనుఁడు.

విశ్వా—ఆ తారులాటయు నైనది- ఎక్కడను ఎట్టిని యేగాని పుట్ట లేదు!

రఘు—ఇదివఱకుఁ బుట్టకున్న- నీ యిరువదినాలుగు గంటలలోఁ బుట్టఁ గూడదా?

విశ్వా—పుట్టకున్న, నిరుటివలెఁ బుక్కిటివఱకును రాదా?

రఘు— అన్నట్టు నిరు డెట్లు చెల్లించితిమి?

విశ్వా—అయినమట్టున కొక గ్రామ మమ్మి చెల్లించితిమి.

రఘు—అట్లయిన, నీయేఁ డింకొక గ్రామ మమ్ముదము.

విశ్వా—(తనలో) హరహరా! ఆకారమే కాదు- బుద్ధికూడ బుగ్గియై పోయినది!

గీ. మద్యరస మను కార్చిచ్చు • మానవుఁ డను
తరువునకు సోఁకి నంతనే • తత్తదవయ

వమ్మ లనియెడి కొమ్మలు • వమ్మ చేసి,
బుద్ధి యను చేవతోఁగూడ • బుగ్గి సేయు!

రఘు—— ఏమి మామగారు !- ఏ గ్రామము విక్రయింతము ?

విశ్వా——బాబు ! అందులకుఁ గూడ నిప్పు డవకాశము లేదు. ఏగ్రామమున కాగ్రామము తనఖాలలోఁ దల మునిఁగి యున్నది !

రఘు——అట్లయిన, మన మిపు డాచరింపవలసిన దేమిటి ?

విశ్వా——అదే నా కేమియు బాలుపోక- మీ కడకు వచ్చినాను.

రఘు——అట్లయిన, నే నీరాత్రి యాలోచించి రేపు సాధనము చెప్పెద. ఈపూఁట కింతటితో నన్ను విడిచిపెట్టుఁడు.

విశ్వా——మఱియొక ముఖ్యవిషయమును గూర్చి మనవి చేయవలసి యున్నది. వారముదినములలోఁ బయిక మీయనియెడల వ్యాజ్యము వేసెద నని వరదయ్య నోటీ సిచ్చినాఁడు.

రఘు——ఇంకను నాతని కీయవలెనా? తీసుకొన్న దెంత? తీర్చిన దెంత?

విశ్వా——తీసికొన్న దెంతయో కాని- పత్రములో నున్నది పదునాఱు వేలు-ఇప్పటికిచ్చిన దిరువదివేలు- ఈయవలసిన దిరువదిరెండు వేలు.

రఘు——ఇంతేగద! ఈరాత్రి నేను మాటాడెద లెండు. ఆకట్ట యేమిటి?

విశ్వా——ఇవి యీదినమున వచ్చిన బిల్లులు- ఇది కస్తూరి చీటి.

రఘు——కస్తూరి చీటి యే మని?

విశ్వా——వెంటనే వందరూపాయలు పంపు మని !

రఘు——పంపినారా ?

విశ్వా——వందకానులైన లేనప్పుడు- వందరూపాయ లెట్లు పంపఁగలను!

రఘు——ఏమీ !- దివాణ మంత దీనదశలో నున్నదా ?

విశ్వా——బాబు ! యేమి మనవి చేయను !

సీ. ఎంత వ్యయించిన • నెప్పటి కప్పుడె
పెరిఁగెడు దరి లేని • సిరులతోడ
ఏవేళ వచ్చి పో • యెడు కవి పండిత
బంధు మిత్ర ప్రజా • ప్రతతితోడ

స్వజనంబువలె సర్వ • సౌఖ్యంబులం బొలు
గాంచెడు విద్యార్థి • గణముతోడ
ప్రాణంబులేని య • ర్పణసేయ సమకట్టి
కొలిచెడు సేవక • కోటితోడ
దంబు మీఱిన తమ దివా • ణంబు నేడు
సర్వ విషయంబులందును • సన్నగిల్లె !
అకట ! మీ రిట్టి నైన సిం • హావలోక
నం బొనర్పనియెడల నా • శంబె యొదవు !

రఘు—అట్లయిన, నందులకు నేఁ జేయవలసిన దేమో చెప్పరాదా?
విశ్వా—కస్తూరియింటఁ గాలు పెట్టకుండుట ప్రథమ కర్తవ్యము.
రఘు—అయ్యయ్యో!- పాప- మదేమి చేసినది !
విశ్వా—అదేమి చేసిన దని కాదు-అ దేమి చేయలేదని సెలవిండు!-

ఉ. నిలువునఁ గల్లలుం, గరము • నీచపు టూహలు, మేటి యుచ్చకం
బులు, బహు మాయలు, న్వివిధ•మోసములుం దమసొమ్ముగా విటా
వళులును దోచు వేశ్య తల • వాకిటఁ గా లిడి, గుల్ల కానివాఁ
డిల నొకఁ డేని, మచ్చునకు • నేని నిజంబుగఁ గానిపించునే ?

రఘు—మామగారు! అందఱ నా మానికనే గొలుచుట న్యాయమా?
కస్తూరి యెల్ల వేశ్యలతోఁ గలిపి లెక్క పెట్టవలసినది కాదు.
గీ. తలఁప, విశ్వాస మన్నది • దాని సొమ్ము
దయయు, సత్యంబు లనునవి • దాని హక్కు
లట్టి సద్గుణఖని వెల • యాండ్రయందె
కాదు- కులకాంతలందును • గానఁ బడదు !

విశ్వా—బాబు ! మీ కే కాదు- ప్రతివిటునకు నిదే వెఱ్ఱి ! కాని-
కం. తెల్లని కాకియు, ముదుసుల
నొల్లని శునకంబుఁ, దీపు • లొసఁగెడు వేమ
జల్లని నిప్పుం గలిగిన-
సల్లలిత గుణాఢ్యయైన • సానియుఁ గలుగున్ !

రఘు—అవునా?- అట్లన్నారు గనుక నా ప్రతిజ్ఞ వినుఁడు-

ఆ. ఎవ్వ రేని, యెన్నఁ • డేనియుఁ గస్తూరి
తొడల నించుకంత • యెగ్గు నాకుఁ
జూపఁ గలిగి రేని • మాన్యతంబుగ నా తృ
ణంబ దాని వీడ • నాడు వాఁడ !

విశ్వా—(వినుట నభినయించి) బాబు ! ఎవరో వచ్చుచున్నారు. ప్రస్తుతము నాకు సెలవు ! దయచేసి, తమప్రతిజ్ఞను మాత్రము పరాకు పడకుఁడు ! (అని లేచి, యీవలకు వచ్చి, ప్రవేశించు చున్న శర్మనుజూచి తనలో) నాయనా - నీవేనా ! నీవు దాపరిం చిన తరువాతనే మా ప్రభువున కింత నీచదశ పట్టినది !

ఉ. బంగినపల్లి మామిడిని • బ్రొంగి మెయి న్విషముష్టిఁ జేయు రీ
తిం-గుణవంతు, మత్ప్రభు, ను • దీర్ణమనస్కుఁ, గ్రియావచస్కు-ని
భ్భంగి నితాంత హేయ మధు • పాన పరాయణుగా నొనర్చి, వా
రాంగన పంచకుం దిగిచి • తౌర ! క్రమంబుగఁ బాపచిత్తుఁడా !

కనుక నే ఖలమైత్రి కూడ దన్నారు. సందియ మేమి?-

ఉ. ఆడగవచ్చుఁ బన్నగచ • యంబులతో భయ ముజ్జగించి; ము
ద్దాడగవచ్చుఁ జిచ్చును న • యంబుగ దోసిట సంగ్రహించి; వె
న్నాడగవచ్చు వ్యాఘ్రము నివ • హంబులఁ దెంపువహించి; యెన్నఁడుం
గూడగరాదు దుర్జనులఁ • గూడిన ముప్పు ఘటిల్లి తీరెడుణ్!

(నిష్క్రమించును)

శర్మ—(ప్రవేశించి) అరరే ! బాబుగారితో మాటాడుట కీ బ్లడీ ఫూలున కవకాశము చిక్కిపోయినది గదా ! ఎప్పుడేమి చెప్పి నాపై నేవగింపు కలిగించునో యని యెల్లప్పు డాయన నంటఁ గాగియే యుందును. ఈ పూఁట నేనాపనిమీఁద వెళ్లుటచే - ఈ డాంకీ (Donkey) కవకాశము దొరికినది ! అయిన న దేమి చిత్రమో కాని - యీతనికడ నాయన యీశ్వరవేరు సోఁకిన బాముపలెె నగును, మగవానికి మగవాఁడు జడిసియుట్టకంటె

మతిమాలినతన మే మున్నది ! ఈవిషయము నాకు నేనే సాటి-

చ. జడియఁగలేదు చిన్నపుడు • స్వాంతమునం బడియొజ్జ కెన్నఁడుఁ
జడియఁగలేదు తండ్రికిని • సాఁకిన తల్లికిఁ గూడ లేశమున్
జడియఁగలేదు పెద్దలను • ఛాందసమూర్తుల కట్టి- యిప్పుడో
జడియదు బ్రహ్మ కేనియు ని • జంబుగ నాతని యబ్బ కేనియున్ !

ఈతనికుద్వాసనము చెప్పింపకున్నచో నా కిచ్చట సేమము లేదు. అందులకై యనేకాలోచనములు సేయుచున్నాను. కాని మున్ముం చూతము- (ముందునకు నడచును.)

రఘు—ఇదిగో- యిప్పటికా వచ్చితివి! నీవు లేక, విశ్వాసరావుగారి చేతిలో నిమ్మకాయవలెఁ జిక్కుపడ వలసి వచ్చినది!

శర్మ—అలాగుననా!- అట్లయిన నేదో విశేషమున్న దన్నమాట!

రఘు—కడమ విశేషముల కేమి గాని- కస్తూరినిగూర్చి మా యిరువురకును గావలసినంత గ్రంథము నడిచినది.

శర్మ—ఏ మని ?

రఘు—కస్తూరికూడ కడమ వేశ్యలవంటి దేయని యాయన వాదము.

శర్మ—అంత పూలా మీా ఆల్ రౌండు మానేజరుగారు ! అందులకు మీా రే మన్నారు ?

రఘు—కస్తూరియెడ కాసింత లోప మెవ్వరైనఁ జూపఁ గలిగినచో— తత్క్షణమె విడిచిపెట్టెద నని డంకా కొట్టినట్టు చెప్పినాను.

శర్మ—కాపిటల్! ఆమాటతో ఆయన మాడిపోయి యుండవలెను!

రఘు—అ దేమో నాకుఁ దెలియదు కాని, అంతలో నీవు వచ్చినందున ఆమాట పరాకుపడ వల దని నన్ను హెచ్చరించి, లేచి చక్కఁబోయినారు.

శర్మ—(తనలో) అట్లయిన, నతఁ డేదో వంక చూపుటకు యత్నింపక మానఁడు. కాబట్టి కస్తూరియు నేనును గాసింత కన్ను తెఱచికొని యుండుట మంచిది.

రఘు—అన్నట్టు- నీవు వెళ్ళిన పని యే మయినది ?

శర్మ—హారముమీఁద మీ సెలవు ప్రకార మైదువందలును దీసికొన్నాను. తోఁచిన సామగ్రి కొని తోఁటలోని కంపినాను. ఇదిగో యీనోటు మిగిలినది (అని యొక నోటు తీసి యిచ్చును.)

రఘు—(నోటు విప్పి చూచి) ఏమి- నూఱు రూపాయలవఱకును మిగిలినవిగా! ఈచిత్రము చూచితివా?- యీనోటు నెంబరు ముప్పదిమూఁడువేల మూఁడువందల ముప్పది మూఁడు! అన్నియు మూఁడంకెలే?

శర్మ—ఆలాగునవా! నే నాసంగతి గమనింపనే లేదు!

రఘు—(నోటు బల్లపైనుంచి)అన్నట్టు, కొన్నవే మేమిటో విన లేదు.

శర్మ—(జేబులోని జాబితా తీసి) ఇవిగో యివి: టెన్ విస్కీలు- ఫైవ్ షాంపెయినులు- సిక్సు షెర్రీలు- ఫోరు హాక్కులు- సెవెన్ క్లారెట్లు- ట్వెల్వ్ పోర్టులు- ఫోర్ డాగర్సు- త్రీ ఎక్షాలు- ఫార్టీ సోడాలు- ఫార్టీ లైమ్‌జ్యూసులు- ఫిఫ్టీన్ కోడిపెట్టలు- ఫైవ్ సేర్సు లేడిమాంసము- ఫైవ్ సేర్సు మేకమాంసము- ట్వెంటి పెయిర్సు మేకకాళ్ళు- త్రీ సేర్సు పొటేలు మాంసము- హండ్రెడ్డు కోడిగుడ్లు- రెండువీసెల రొయ్యపప్పు- ఆఱు చిన్న డబ్బాలు యావునేయి- బిందెడు పాలు- రెండు టీ డబ్బాలు- రెండు కాఫీ డబ్బాలు- రెండు కోకో డబ్బాలు- సిక్స్టీ సిజరు సిగరెట్ల పెట్టెలు- నాలుగు చీట్లపేకలు- పై సంబారములతో పదిసేర్ల పలావు బియ్యము.

రఘు—సరి కాని- వంజుడు లేమిటి?

శర్మ—కోడిమాంసము పలావు- లేడిమాంసము కురమా- మేకమాంసము పకోడీ- మేకకాళ్ళ సూప్- పొటేలుమాంసము కైమాలడ్డు- కోడిగుడ్ల యట్లు- రొయ్యపప్పు వేపుడు-

రఘు—ఆఁగు! ఆఁగు! ఆయన యెందులకో మరల వచ్చుచున్నారు.

విశ్వా—(చరచర ప్రవేశించి) బాబుగారి పంతమే నెగ్గినది! అమ్మాయిగా రీపూఁట నైదుగంటల రైలులో వచ్చుచున్నారు! ఇదిగో టెల్లిగ్రాం! (అని తంతివార్త యిచ్చును.)

రఘు—(ఏకదృష్టితో తంతివార్త నవలోకించును.)

విశ్వా—(రఘునాథరావు ముఖలక్షణములను జూచుచు నిలుచుండును.)

శర్మ—(తనలో) ఏస్! యీ సమయమున నానోటు సంగ్రహించి, యీతనిపై ననుమానము కలిగించి, యీపూటనె తిలోదకము లిప్పించితినా - యిఁక సీతనింగూర్చి భయపడవలసిన పని యుండదు. (మెల్లగా నోటు సంగ్రహించి, లోపలిచేబులో నిడికొనును.)

రఘు—సరే- యెవరు రానున్నను నాకు నా యెంగేజిమెంటు (Enga-gement) తప్పదు రైలుకడకు మీరు వెళ్ళి తీసికొనిరండు.

విశ్వా—చిత్తము. (అని నిష్క్రమించును.)

శర్మ—బాబు! యెవ రా వచ్చువారు?

రఘు—ఇంకెవరు- మా యింటియీబిడ గారు! కార్యమై మూడేండ్లయినది. కాఁపురమునకుఁ బంపుఁడని నే నడుగ లేదు; నే నడుగలే దని వారు పంపలేదు. చివర కాబిడకే శివ మెత్తినది కాఁబోలు- తనంతఁ దానె దయచేయుచున్నది!

శర్మ— అన్నా! యీమాట విన్న - కస్తూరి కడుపు పగిలి చచ్చునేమో గదా?

రఘు—అ దేమి?

శర్మ—ఆముండకు మీపైఁ గల యనురాగ మట్టిది. పదినిమిషములు మీ రగపడకున్న బ్రతుకఁ గలదా!

రఘు—వెఱ్ఱివాఁడా! కస్తూరిని విడిచి నేనుమాత్రము గడియ తడయఁగలనా! ఈపూఁట నిప్పటి కిరువదిసారులు జ్ఞప్తికి వచ్చినది. అన్నట్టు మఱచితిని- సొమ్ముకొఱకు విశ్వాసరావుగారికి కమ్ము వ్రాసినది. పైకము లేక యాయన పంప లేదు. ఇంతలో నీనోటు కొనిపోయి దానికిచ్చిరమ్ము. (అని బల్లమీఁద వెదకుచు) ఏది చెవుమా- యిందాఁకటి నోటు!

శర్మ—బల్లమీఁదనేగాఁ బడవేసినారు? (అని తానును వెదకును)

రఘు—(మీఁదను, క్రిందను జూచి) ఏదీ- యెక్కడను లేదే?

శర్మ—ఎక్కడను లే కేమి? అంటుకొన్నవారియొద్ద హాయిగా నుండును!

రఘు—విశ్వాసరావుగారుతప్ప వేరెవ్వరును రానే లేదే?

శర్మ—విశ్వాసరావుగారికి సొమ్మన్న విష మనియా మీ యూహ?

రఘు—శివశివా! యెంత చిన్నమాట యాడితివి?

గీ. ధర్మదేవత ధర్మము • తప్పవచ్చు
గ్రహము లాత్మీయ గతులను • గడపవచ్చు
నీస మంతయుఁగూడ వి • శ్వాసరావు
నీతిఁ దప్పఁడు, సలుపఁడు • నీచపుఁ బని.

శర్మ—కావచ్చునుగాని- పైస్థితినిబట్టి లోపలి స్థితి నెఱుఁగుట కష్టము.

గీ. కడలి బాడబమును, మంచు • గడ్డ వేఁడి,
తాతి బొఱియయు, నల చేవ • మ్రాని బోలు,
పంటి విసమును, మఱి మేడి • పంటి పురుగుఁ
దెలిసికొన శక్యమగునె పై • స్థితినిబట్టి?

రఘు— నీ వెన్ని చెప్పిన నీవిషయమునందు నీతో నే నేకీభవింపఁ జాలను. ఆనోటు నెంబరు మన కెన్నఁటికిని మఱపునకు వచ్చునది కాదుగదా? ఎప్పుడో, యెచ్చటనో, యెట్లో, దాని కదియే బయటఁబడి- నిశ్చయముగా నీయభిప్రాయము నదే మార్పఁగలదు.

శర్మ—(తనలో) ఇఁక లాభములేదు! ఈ స్కీము (Scheme) ఫేయి నట్టే! ఆల్ రైట్ (Alright) కానిమ్ము! (పయికి) బాబు! మీ రన్నమాట బహు సమంజసముగా నున్నది. కాని, యది మీ యభిప్రాయమునే మార్చునో! నా యభిప్రాయమునే మార్చునో మాత్రము చూడవలసియున్నది. అదిగో నాలుగు! అయిదు నిమిషములలో మీరు డ్రెస్సు వేసికొనవలెను. నేనువెళ్లి కారుగడపవద్దకు దప్పించెదను.

(ఇద్దఱు లేచుచుండగాఁ దెర పడును.)

ఇది పంచమాంకము.

# మధుసేవ

## షష్ఠాంకము

(ప్రదేశము:—రఘునాథరావుగారి మేడమీఁది పడక గది-

నిర్మల— (సర్వాలంకార శోభితయై, గది గుమ్మములో నిలుచుండి) ప్రాణేశ్వరుని మొగము చూచి పదిప్రొద్దులు తక్కువగా మూఁడేండ్లగునది. తల్లి లేకపోవుట చేతను, తండ్రిగారు తలతిక్కవారగుట చేతను, భర్త పంతగొండి యగుటచేతను గాఁకున్న నింతకాలము కన్నవారియింట నుండవలసిన దాననా! తమయాజ్ఞ నతిక్రమించి వచ్చినందుకై తండ్రిగారిక నా ముఖము చూడరు. కాని, నేనొనర్చినది నా కర్తవ్యమె కాని మఱియొకటి కాదు.

చ. కనకముతోడ నున్నపుడె • కాంతి లసన్మణికిన్; మహీజముం
బెనఁగొనినప్పుడే లతకుఁ • బెంపును, నింపును, సొంపు వీణియం
దవరినయప్పుడే యినుప • తంతులకున్ మధురస్వనంబు; స్త్రీ
జనమునకున్ నిజేశ్వరుని • సన్నిధి నున్నపుడే సుఖోన్నతుల్.

జీవితేశ్వరుఁడు నా రాకకుఁ జిరాకు పడునో - సంతోషమె పడునో తెలియకున్నది. ఇంతవఱకాయన యింటికి రాకుండుటంబట్టి నాహృదయము పలుసందియములపాలగుచున్నది. (ఉలికిపడి) అమ్మయ్యా అవిగో మేడమెట్లు చప్పుడగుచున్నవి, ఆయనయే యై యుందురు. (గదిలోని కేగును.)

రఘు—(తూలుచుఁ బ్రవేశించి) మేడకు మెట్లు పెట్టినవాణ్ణి మెత్తగా ట్రన్నినా పాపం లేదు! ఎందుకిన్ని మెట్లు ఏడవనా! మొట్రుకోనా! ఏకమెట్టయితే యెగిరి పక్కాబొయ్యేవాణ్ణి!

* దీ మోస్టు డర్టీ కింగ్ - వాకింగ్
దీ మోస్టు నాస్టీ కింగ్ - టాకింగ్
దీ మోస్టు లక్కీ కింగ్ - స్మోకింగ్
దీ మోస్టు ప్లక్కీ కింగ్ - డ్రింకింగ్.

వహ్వా ! వహ్వా ! కస్తూరి యీ పద్యం వింటే, కాగలించుకోక పోయిందా ! ఏదీ - మా వైఫ్ (Wife) గా రెక్కదున్నట్టు! అద్దుగో ఆగదిలో వుంట్రారు. అమ్మవారి దర్శనం చేసినట్టు- ఆవిడ దర్శనం చేస్తాం ! (గదిగుమ్మము చేరి) హల్లో - మై డియర్ ఎంప్రెస్ ! (Hallo my dear Empress) హౌ ఆర్ యూ ! (How are you) షుకం గావచ్చినట్టా ? (గదిలోఁ బ్రవేశించి- భయముచే గవాక్షముకడకుఁ బోయి బల్ల నానుకొని నిలుచున్న భార్యను ఎగాదిగజూచి) ఎక్సలెంటు ! (Excellent) యేం గ్రాండగా (Grand) తయారయ్యావు ! మూడేళ్లకూ మూడడుగులు పెరిగావే ! ఈ బ్యూటి (Beauty) అంటూ ష్టాంటుఁ వేనా - యెరువా ? సొంటుఁ వై తే-షోగ్గానే వుంటాన్ ! నీ మీఁద పద్యం చెప్పనా ?-

నీదు ఫేస్ రౌండు మూన్ - నీదు నోస్ గోల్డు స్పూన్
నీదు టీత్ పెరల్ లైన్ - నీదు లిప్ ఫ్రెంచి వైన్.

హ్వా ! హ్వా ! హ్వా ! హ్వా ! (అని యూ.కి కుర్చీలోఁ గూలఁబడును.)

నిర్మ—(తనలో) ఓయి దేవుఁడా ! ఏమిఘోర మిది - ఈ వాలకమేమి- యీ వాగ్ధోరణి యేమి ; ఈయనకు పిచ్చి పట్టినదా - పిశాచము పట్టినదా ! లేక, నేను, స్వప్నావస్థలో నున్నానా - సన్నిపాతావస్థలోనున్నానా !

సీ. తళుకు నిగ్గుల దళ • తళలాడు నెమ్మొగ
మెట్టు లీగతి మాడు • రొట్టె యయ్యె !
పరమ దయారస • భరితంబు లగు కన్ను
లెట్టు లీగతి నగ్గి • తుట్ట లయ్యె

---

* The most dirty King—Walking— The most nasty king—Talking
The most lucky king— Smoking-The most plucky king—Drinking.

భారతీసతి కాట • పట్టగు నాలుక
యెట్టు లీగతి తాటి • పట్టె యయ్యో !
దిరిసెనపూవు మా • దిరి నొప్పు సొబగుమే
నెట్టు లీగతి వంట • కట్టె యయ్యో !
కరము మితభాషి యని పేరు • గన్న సుకృతి
యెట్టు లిటు వస ద్రాగిన • పిట్టయయ్యో !
ఆయనే యీాయనా ?- లేక • యాయ నొకరు
నీయ నొకరున ! దైవమా ! • యెఱుఁగ జెపుమ !

రఘు—ఏఁవి టాలోచిస్తున్నావు ? పద్యానికి బహుమటీ యేఁ వివ్వ వనా ? ఒక్క ముద్దు ! ఆముద్దు- మూాడుకోట్లు పెయ్యాలి ! కస్తూరి! ముద్దుకన్న కమ్మగా వుండాలి (లేచి సమీాపింపఁబోవును)

నిర్మ—(అసహ్యము తోఁ దనలో) రామ రామా ? యీా దుర్వాసన యేమిటి ! ముక్కు మఃఊగి- తల పగిలిపోవుచున్నదే ! ఈ కిటుకే తెలిచినఁ గాని-యిచ్చట నిలుచుట కష్టము (అని యటు తిరుగును)

రఘు—చీ ! చీ! పిగ్గు పడుతున్నావా ? అవు నవును - పెగ్గు తగిత్తే గాని- పిగ్గు పోదు ! షెల్కోఁ వన్నాడు- స్పిరిట్టు తగిల్తేగాని- స్పిరిట్టు పుట్ట దన్నాఁడు. ద టీజ్ ట్రూా ! (That is true) పెగ్గు టగలాలి- నీ పిగ్గు పోఁవడాలి ! ఇదుగో- పెగ్గు నా దగ్గరే వుంది ! (అనుచు జేబులోని సీసా తీసి) వహ్వా ! వహ్వా ! యేఁవి స్వరూపం ! ఏఁవిప్వారస్యం ! ఏఁవి పామర్ద్యం ! అమృతమూ యిదీ- అక్క పెళ్ళెళ్లు ! ఆ యమృతం ద్రాగి- అదటి (అదితి) కొడుకులు- డేవతలయ్యారు: ఈ యమృతం ద్రాగి- భరతమాత కొడుకులు- వరంగిదొర్లవుతున్నారు ! ముందు నేను కొప్ప పుచ్చుకుంటా నట- టర్వాత నీకు ద్రాగినం తిప్తానట. (సీసా యెత్తి ద్రాగఁబోయి) డామిట్ !వడదేం ! హల్లో ! వాట్యే ఫూ లై యామ్ ! (Hallo! what a fool I am!) కార్కునాట్ రిమూవ్డు ! (Cork-not removed) ఏదీ- మా కార్కుస్క్రూ (Cork-screw) గా రెక్క

డున్నారు ? (అని జేబులోని తాళము చెవులగుత్తి తీసి, అందలి మర తీఁగతో కార్కును దొలఁగించి, (త్రాగును.)

నిర్మ—(రిచ్చపాటుతోఁ దనలో) అమ్మయ్యో ! యిదా సంగతి ! సరే యిఁక నేమి !- నా యింటియెదుటి మాలయువతికి పట్టినగతియే నాకును బట్టినది ! దానినోట దానిపెనిమిటి చర్యలు వినునప్పుడు, అంతఘోర మొందునా యనుకొనెడిదానను. సర్వేశ్వరుఁడు నా సందేహము తీర్చుటకుఁ గాఁబోలు నా దురవస్థ నాకే యనుగ్రహించినాఁడు ! ఔరా కాలమహిమ !

ఉ. పుట్టిన భూమియా- ఋషులు • పుట్టిన పావన భూమి; వంశమా-
పట్టు బుధాను మోద నిర • వద్య చరిత్రకుఁ- దల్లి తండ్రులా-
నెట్టన ధర్మదేవతకు • నెయ్యపుఁ జుట్టము; లక్క- టక్కటా !
యిట్టి నికృష్ట దుర్వ్యసన • మీయన కేగతి నబ్బెనో గదా !

రఘు— (మఱికొంచెము మత్తుతో) ఇదుగో- ఇదే నీవంటు ! ఇది పుత్తుకుని- అరుణాచలంలాగు- అ-డా-లి, పాపాచలంలాగు- పా-డా-లి; మంజువాణిలాగు- మా -ట్లా-డాలి, పొన్నాక్షిలాగు- పో-ట్లా-డాలి; నరహరిలాగు- నవ్వాలి, యెలనాగలాగు- యేడవాలి; కనికిలాగు- గ్లాసు లందించాలి, కస్తూరిలాగు- కైమావుండలు తినిపించాలి - తెలిసిందా ! హుఁ !

నిర్మ—అమ్మయ్యో ! అంతటితోఁ దీఱ లేదు!- పట్టవలసిన లక్షణము లన్నియుఁ బట్టినవి ! అయిన, నందుల కాశ్చర్యమే మున్నది!-

ఆ. జ్వరము వెంటఁ జలియుఁ • జలివెంటఁ దాపము
దానివెంట శోష • దాపరిల్లు;
కడగి యవ్విధంబు • గాను దుర్వ్యసనంబు
లొక్కదానివెంట • నొకటి యొదవు !

రఘు—పట్టు- పడిలంగా నేను నోట్లో పోస్తాను- పానకాలరాయుడు లాగు నువ్వు దిగమింగు ! (అని సీసా నోటి కందింపఁ బోయి, నిర్మల తప్పించుకొనఁగా) ఏఁవిటా పెంకితనం ! బుగ్గలు చిదిమి,

బూ క్లొంచిపెడతా ష్యూడు ! (అని గిల్లఁబోయి, గోడపైఁ బడును.

నిర్మ—(గద్గదస్వరముతో) మహాభాగా ! నేనిపుడు మతిలేని స్థితిలో నున్నాను ! దయయుంచి నన్నిపుడు తాఁకబోకుఁడు !

రఘు—ఎందుకు పోయింది మటి ?- ఎందు కంటా !

నిర్మ—ఎందులకేమిటి !- పాలకడలికంటెఁ బరిశుద్ధమగు వంశమునందుఁ బ్రభవించిన మీరిట్లు మధుసేవా పరాయణు లగునప్పుడు- మతి యున్న మాట యేమి- ప్రాణమే పోఁగలదు !

రఘు—నాన్సెన్సు! (Nonsence) మధుసేవ తప్పన్నవాడు మనిషే కాడు! ఎవడు త్రాగనివాడు? ఎవడంటా! చెప్పవేం ! ఎవ డంటా!

* సం డ్రింక్ హ్వాన్ ఫ్రెండ్సు స్టెప్ ఇన్
సం డ్రింక్ హ్వాన్ ఫ్రెండ్సు స్టెప్ ఔట్
సం డ్రింక్ బికాజ్ దే'ర్ థిన్
సం డ్రింక్ బికాజ్ దే'ర్ స్టౌట్
సం డ్రింక్ బికాజ్'టీజ్ వెట్
సం డ్రింక్ బికాజ్'టిజ్ డ్రై.

ఇది దొర్లసంగతి-ఇక మన సంగతి చెప్పనా ?

\+ గీ కొంద రాయాసము శమింపఁ • గొంద రెల్ల
బాధలు భరింపఁ, గొందఱు • బలముఁ బెంపఁ,
గొంద ఱుల్లాస ముదయింపఁ • గొంద ఱెక్కు
వారిఁ దనియింప- మద్యసే • వన మొనర్తు !

తెలిసిందా ?- కనుకా - కాబట్టి-నీ హెల్తు (Health) కోసం నేను త్రాగుటాను- నా హెల్తుకోసం నువ్వు త్రాగు! ఎల్లాగ త్రాగడఁ వంటూ వా?- యిల్లాగా ! (అని సీసాలోనిది పూర్తిగా త్రాగి సుడి తిరుగుచు) పా - రీ - గా-మూ-పా-డా-నీ-పా-నీ-పా-పా-పా-ప్టా-ప్టా-ట్రా-డ్రా-డ్రీ డ్రూ-డ్రో! డ్రా! (అని నేలగూలును)

* Some drink when friends step in—Some drink when friends step out,
Some drink because they're thin—Some drink because they're stout.
Some drink because 'tis wet—some drink because 'tis dry.

\+ ఈపద్యము ప్రదర్శనసమయమున సమయోచితముగాఁ జదువవలెను.

నిర్మ—(తత్తరపాటుతో) అయ్యో ! అయ్యో ? అదేమి-అట్లు పడి పోయినారు ! ఎవరిప్పుడు దిక్కు ! ఈ నిశీధిసమయమున నెవ్వరిని బిలువను! నేను పట్టి లేవనెత్తి పర్యంకముపైఁ బరుండఁబెట్టఁగలనా? కానిమ్ము-ప్రయత్నించి చూచెదను. (అని సమీపించి అంతలో వెనుకకు తగ్గి) ఇస్సీ !- యీ చెడుకంపు నన్నుఁ జెంతకుఁ జేరనీయ కున్నదే ! ఇందుల కేమిటి సాధనము ! ...సాహసమే సాధనము ! (ముక్కు మూసికొని సమీపించి, యెత్తఁబోయి, యెత్తలేక విడిచి పెట్టి) అయ్యో దేవుఁడా ! యెత్తలేక పోయితిని గదా ! అంతటి యాగర్భశ్రీమంతు లిట్లు-పడగొట్టిన బొటసారివలె, వాన మొత్తిన వెలిబొమ్మవలె; దరి బట్టిన నావవలె, దారము తెగిన గాలిపటము వలె; వెలికిలఁ బడ్డ తాఁబేటివలె, వేళ్లు తెగిన వృక్షమువలె తెలివి తప్పి, తెకువ చెడి ; పటువ మెడలి, ప్రభవము సడలి, బిగువు తరిగి, బింకము తొలఁగి;-కళ మాసిన మొగముతో, కంప యైన తలకట్టుతో; గుంటలు పడిన కన్నులతో, ముంగిన చెక్కు లతో; కమలిన పెదవులతో, గారకట్టిన పలువరుసతో; వాడిన మేనితో, వసియాడిన యవయవములతో; ముఱిగిన యూపిరితో, ముత్తెన్నులైన యుసుపులతో - ప్రజ్ఞతప్పి పడియుండుటకంటె ప్రారబ్ధదోషావత్తి యింకే మున్నది ! ఇటువంటి సమయములలో మలయవతి యేమి చేసెదో ! అట్టి మలయవతులు, ఇట్టి నిర్మలలు- లోకమున నెందఱున్నారో ! తప్పత్రాగి- తారుమారై; వికృత రూపముతో, వింత వాలకముతో, దుర్వాసనతో, దుర్భాషలతో; తూలుచు, తుళ్ళుచు, వదరుచు, వాపోవుచు- నిండ్లకువచ్చు భర్తలవల్ల నెందఱెందఱెంతెంతలేసి బాధలు పడుచున్నవారో ! అన్నియు నెఱిఁగిన అగ్రజాతులవారిస్థితియె యిట్లున్నదిగదా - అవ్యక్తులై, అజ్ఞానపు ముద్దలై కూలి యాడినఁగాని కుండాడక, రేపు కుడిచిన మాపు లేక, గంపెడు బలగముతో, గుంపెడు పిల్ల లతో- దరిద్రదేవతకు దాయాదులుగా నొప్పు మాలుజాతులవారి

నీ మద్యపిశాచ మెంత మాడ్చి మారణము సేయుచున్నదో గదా!

రఘు—(కదలి) కష్టూరీ! కష్టూరీ! గ్లాస్ ! గ్లాస్ ! (అని, అప్రయత్నముగా జేబునుండి మఱియొక సీసా తీయును)

నిర్మ—అమ్మయ్యో! అదొక సీసా! ఆ జేబులనిండ సీసాలే కావలయును! ఔరా చిత్రము!-ప్రబోధము లేకపోయినను, పరిచయవశమున బుద్ధి దానిమీఁదికే పోయినది! కరము దానినే గ్రహించినది! ఆ కర మలవాటుచొప్పున నదిగో దానిని నోటి కందించుచున్నది! అయ్యో నాతెలివి తెల్లవాఱె!- ఆ సీసా యూడఁబెరికి యావలఁ బాఱవేయక- తెరమీఁది బొమ్మనువలె తెల్లపోయి చూచుచు నిలుచుంటి నేమి! (అని చటాలున సీసా లాగికొని) ఛీ! ఛీ!- యీ పాడుసీసాను జేతఁ బట్టవలసి వచ్చినదే! (అని సీసా యెత్తి చూచి) ఏమీ- నీ పేరు ఎడ్వర్డు విస్కీ- యా?- ఎంతటిదానవు!

సీ. పలుసముద్రములు దీ • వులు దాఁటి యఱువది
వందల మైళ్ళెట్టె • వచ్చినావు!
పరమ పవిత్రమై • పరఁగు నార్యావర్త
పుణ్యభూమిని గాలు • మోపినావు
క్రమముగా స్థిరపడి • కడుశిష్టు లగు విశు
ద్ధుల యిండ్లలోఁ గూడ • దూరినావు!
అయినవారిం బట్టి • యవలీల నీదు దా
సులక్రిందఁ జేసికో • కలిగినావు!
పెక్కు కొంపలకుం జిచ్చు • పెట్టినావు!
మంచి సంసారముల రూపు • మాపినావు!
సంఖ్యలకు మీఱు హత్యలు • సలిపినావు!
మాయ విసమ! విదేశంపు • మద్యరసమ!

(అని గవాక్షముగుండ సీసా పాఱనేయుచుండఁగా తెర పడును.)

ఇది షష్ఠాంకము.

# మధుసేవ

## సప్తమాంకము

### మొదటిరంగము

ప్రదేశము:—కస్తూరి మేడవీధి

విశ్వాసరావు—(విచారముతో నడచుచు) సందేహ మేమిా!

గీ. చెట్టునకుఁ జీడ, నీటికిఁ • జెనఁటి నాచు
కాయలకుఁ బుచ్చు, బూ జూరు • గాయలకును
లలనలకు స్వేచ్ఛ, గృహమేధు • లకు ఋణంబుఁ
గత్తులకుఁ ద్రుప్పు- హానికిఁ • గారణములు !

ఇంత యేల- ఋణ మనః రూఢిగా నొక భూతమే !

గీ. తగని వెచ్చంబు మేను, జూ • దంబు నోరు,
త్రాగుడును, వ్యభిచారము • దంష్ట్రయుగము,
వడ్డి ప్రాణంబు, కోర్టునిక్క • పట్టు, తిండి
భూము, లిండ్లుఁ, దోటలు ఋణ• భూతమునకు!

అట్టి ఘోరఋణభూతము యొక్క కోరలనడుమ నొక్కసారి చిక్కువడినవాఁడు మరల దక్కుట దుర్లభము ! బాబుగారె యిందులకుఁ బ్రమాణము ! చినికి చినికి చివరకు గాలివాన యైనది ! మొన్న వచ్చిన వారంటున కామె తల్లి కడుపు చల్లఁగా- ఆ నిర్మలాంబ తన సర్వాభరణములను సమర్పించుటచే మర్యాద దక్కినది ! ఓహో నిర్మలాంబ నిజముగ నిర్మలాంబయే గదా ! ఆ సాధ్వి కాఁపురమునకు వచ్చి సంవత్సరమైనది. ఈ సంవత్సరములో బాబుగారింటఁ బండుకొన్న దినము లేనేలేదు సరిగదా-

తిండికి వచ్చిన దినములుకూడఁ దక్కువ! భర్తమీఁది బెంగచేతనే యామె పాలిపోయి సగ మయినది! ఈ వారంటుమాట విన్నచో నిఁక నేమేని తరువాయి యుండునా! ఒకటి కాదు- రెండు కాదు- ముప్పదివేలు రొక్కవలెను! అందుచేతనే యీసంగతి యామెచెవిని బడనీయక- బాబుగారిని రెండుదినములు బయటికి రావల దని చెప్పి- పైకము కొఱకుఁ బట్టణ మంతయు గాలింపఁ దలఁచుకొనుచున్నాను. (పరిక్రమించి) ఇదిగో యిదియే కస్తూరిమేడ. పంకజముకొఱకు బావిలోదిగి నట్లు- బాబుగారికొఱకు దీనియింటికి రావలసి వచ్చినది! (పైకిఁ జూచి) ఆ పైచవికలోఁ బచారు చేయుచున్నది కస్తూరియె. అదిగో-నన్నుఁజూచి, ఆయనతోఁ జెప్పుటకుఁ గాఁబోలును వెళ్ళుచున్నది. (అటు నిటుఁ జూచి) వారంటువాఁ డింతవఱ కీవంకకు వచ్చినట్లు లేదు. (ముందునకుఁ జూచి) ఆ వచ్చువా రెవరో!- (నిదానించి) ఆఁహాఁ! కస్తూరి రహస్యవిటుఁ డని తెలియవచ్చిన కాసింసాహెబు. ఆ వీధిలాంతరువఱకుఁ జని- అతఁడు దాఁటిపోయినవెనుక మరల వచ్చెదను. (అని కొంచెము నడచి, వెనుకకుఁ దిరిగి చూచి) ఆఁకలిగొన్న కుక్కవలె నతఁ డాయింటనె చొరఁబడు చున్నాఁడే! సరే- దీనివల్ల రెండు సంగతులు తేలినవి. మొదటిది: సాహెబు సంబంధ మిప్పటికిని సాగుచునే యున్నదని. రెండవది: ప్రస్తుతము బాబుగారింట లే రని. ఏమి చక్కని సమయము! బాబుగారి కిప్పుడు దీనినడత పట్టియిచ్చితినా- ఆయనభ్రమ తీర్చినవాఁడ నగుదును! అయితే- బాబుగారి నిపు డెచ్చటఁ బట్టుకొనఁ గలుగుదును?- (ఆలోచించి) ఆఁ! చీట్లాటకై శివరావుగారి యింటికి వెళ్ళి యుందురు. అతిశీఘ్రముగా నే నిపు డచ్చట కేఁగితినా- అన్నిపనులు నెరవేఱఁ గలవు. (అని అతిత్వరితముగా నిష్క్రమించును)

ఇది మొదటి రంగము.

# రెండవ రంగము

ప్రదేశము:—కస్తూరి పడకగది.

ప్రవేశము: పర్చీలోఁ గూర్చుండి కాసింసాహేబు-నిలుచుండి కస్తూరి.

కస్తూ—సరే కాని, వీధిలోనుండి నీవు లోపలికి వచ్చునప్పుడు విశ్వాసరావుగారు నిన్నుఁ జూచినారా?

కాసిం—ఇస్కా మాకీ యిశ్వాస్‌రావ్! ఆడ్కీ మాదీ సూడందీ ఆడూ మాకీ కైసా సూస్తాడు వోయ్?

కస్తూ—ఏడిచిన ట్లేయున్నది కాని- ఇప్పు డెందుఁకు వచ్చినావు?

కాసిం—ఆపాక రంగేళీ రగ్నాత్ రావ్‌కు- వల్బాసెందరా వారంటూ సేపిచ్చీంది మాటా- సెప్పేదానీకి వచ్చాం. దానీకి తంటావోయ్?

కస్తూ—ఏమీ? రఘునాథరావుగారికి వల్లభచందు వారంటు చేయించినాఁడా? అబద్ధము- అతఁ డట్లు తొందరపడువాఁడు కాఁడు.

కాసిం—అరే హైమార్! ఆడ్కీ సిపాయ్‌లాగా సీదా వొచ్చేదానీకి-నేసీ- మాకీ సాటూసెప్పిందానీకి- మన్సులో మంటా పుట్టీ-మార్వాడీకి పుల్లా యేశాం. పుల్లా యేస్తే- ఆడ్కీ పూరా గాబరా లెగిసీ-వారంటూ లగా దియే!

కస్తూ—ఓరి దుర్మార్గుడా ! యెంత పాపమునకొడిఁ గట్టుకొంటివి!

కాసిం—అరే- ఆడ్మీనా- యెందుకూ వోయి యింతా మోజూ?

కస్తూ— ఇదిగో - వాఁడు వాఁ డంటివా- చెంపలు వాయించెదను. ఎక్కువతక్కువలు లేకుండ వాగెదవు. ఏమా పొగరు!

కాసిం— (చివాలున లేచి) అరే - తురకా బిడ్డా మీాదా- ధుక్కూ బొమ్మర్ - యెఖ్వా సెప్పిందీ - యెవదూవోయ్? పందికీ మొక్కతాడ్ - బాపకా వాడ్; పందికీనూస్తె - భంచో సెప్తాడ్ - తురకా బిడ్డా! - ఆడ్డీ యెఖ్వా - మాదీ యెఖ్వా? ఆవుకీ మొక్కుతాడ్ - అడవాబొమ్మర్; ఆవుకీ జఫా సేస్తాడ్ - అవల్ ముసల్మాన్ ! ఆడ్డీ యెఖ్వా - మాదీ యెఖ్వా?

కస్తూ—కట్టు - కట్టు! కనుకనే యింతగతి పట్టినది!

కాసిం— అరే- హనూరా బాత్ సునో! ఈ సాటూ బేరం మాకీ సరి వడింది లేదూ- జమీాందార్ వాడ్కి- సలాం సెప్పి- మాకిందాఖాయం వుంటావ్ - నైతో - మాకీసలాం సెప్పీ - అడ్కీ- అవుతావ్ - ఏకీబాత్ బోలో?

కస్తూ—తాళు! తాళు! ఎవరో తలుపు తట్టుచున్నారు. (వినుట నభినయించి) అమ్మయొయ్యో! ఆయనయే! వారంటుమాట విని కావలయును- వచ్చివేసినారు.

కాసిం— (కంగారుతో) అరే అల్లా! సచ్చాంరా బాబూ సచ్చాం! (వడఁకుచు) సానివారూ మీాకీ సలాం సేస్తాం- యెనకా మాలే పెట్లో యేసీ పేనం తియ్యకా - బైటికీ పంపండీ!

కస్తూ—అట్లయిన- నీదారిని పెరటిలోనికిఁ బోయి, పెరటితలుపు తెఱచుకొని, పెడసందునఁబడి చక్కఁబొమ్ము. ఊఁ! త్వరగా!

కాసిం—బతికాంరా బాబూ! - బతికాం! (అని వెళ్ళఁబోవును.)

కస్తూ—జోడు! జోడు!

కాసిం—ఇసాకి మాకీ- యిదీ వొచ్చిందీ తంటా! (అని జోడు తొడగఁబోయి, కంగారుచే తొడుగ లేక, చేతఁ గొని వెళ్లును.)

తెరలో—(పెద్ద చప్పుడు)

కస్తూ— (చీరసవరించుకొనుచు) ఏమి చెప్పుమా- యెన్నఁడు లేనిది తలుపంత గట్టిగాఁ దట్టుచున్నారు. ఈరాక - వారంటు మాటను బట్టి వచ్చిన రాకగా లేదు. సందియమేమిా? - సాహెబు లోపలికి వచ్చుట చలపాది విశ్వాసరావు చూచియుండును. తనమాట నగ్గించుకొనుట కిదె తగినసమయమని పోయి యీాయనతోఁ జెప్పియుండును. సరే కానిమ్ము. నాఁడు శర్మ సంగ్రహించుకొని వచ్చిన నోటుతో నేడీతని త్రాడు తెంపకున్న - నాపేరు కస్తూరి కాదు! (అని పెట్టె తెఱచి, నోటుతీసి- రైకలో నిడికొని- బిగ్గరగా) ఎవరు వారు? ఆఁ! వచ్చె - వచ్చె! - (అనిపోయి తలుపు తెఱచును.)

రఘు—(చరచర లోపలఁ బ్రవేశించి - వెఱ్ఱిగా నల్లెడల వెదకును.)

కస్తూ — ఏమిటి వెదకుచున్నారు ?
రఘు — (ఆగ్రహముతో) ఏమి టని కాదు- ఎవరి నని యడుగుము !
కస్తూ — అట్లే కానిండు- ఎవరిని వెదకుచున్నారు ?
రఘు — కాసింసాహేబును !
కస్తూ — ఏ కాసింసాహేబు ?
రఘు — ఏ కాసింసాహేబా ?- నీ వలపుల కాసింసాహేబు !
శర్మ — (అంతలోఁ బ్రవేశించి) వారంటువాఁడు తుదకు వందరూపాయలతో వదలినాఁడు. అయితే మీరంతలోనే వచ్చివేసినారేమి ?
కస్తూ — జాగ్రనదో సాహేబు దాటిపోవునని !
రఘు — అవును !- అట్లే!- ఎక్కడ దాచితివో చెప్పెదువా- లేదా ?
కస్తూ — చెప్పనా!- కొప్పులో !
రఘు — ఏమీ- నాతో నెకచక్కెములా ! నాకడ నిట్టివేషములు పని కిరావు ! కాశింసాహేబు నీయింటఁ గాలు పెట్టినాఁడా లేదా?
కస్తూ — అని మీతో నన్నవా రెవరు ?- విశ్వాసరావుగారేనా ?
రఘు — అవును- ఆయనయే. అయిన నేమీ ?
కస్తూ — ఏమియు లేదు- తా నొక తప్పు చేసినప్పుడు దానిం దప్పించుకొనుటకై యేగడ్డియుఁ గఱవక యేమి చేయును ! అయిన, నాయన వెట్టియే కాని- యుడుకుసీళ్ల కూరు కాలునా !

గీ. దిగిన ముంచును మున్నీరు • తినినఁ జంపు
విసము ; త్రొక్కినఁ గఱచును • వెస భుజంగ;
మంటినం జుఱ్ఱు మని కాలు • నగ్ని- వాని
కెడముగా నుండువారల • కేమి భయము !

రఘు — ఏమి టీ యుపన్యాసము!- నాకేమియు నర్థము కాలేదు.
కస్తూ — (బుసిబుసి యేడుపుతో) అవు నవును- చెప్పుడుమాటలతోఁ జెవులు దిబ్బళ్ళుపడినవారికి-ఎదుటివారి మాట లేమి యర్థమగును !
చ. మానుగ, నగ్ని చేఁగొని ప్ర • మాణము సల్పఁగనిండు-గంగలో
స్నానము చేసి, యీశ్వరుని • సన్నిధి బాసలొనర్పనిండు-మా

సానులమాట, యూరి కపు • సాలులమాటయు నమ్మువార లెం
దేనియు నుందురే ! నలువ • యీగతి మమ్ము సృజించె నేమనన్!

రఘు—ఎందుల కా యేడుపు?-సంగతి యేమో సరిగాఁ జెప్పరాదా?

కస్తూ—ఏమి లాభము ! విశ్వాసరావుగారు వికవికలాడుచు నా యిం
టికి వచ్చుటయు- నన్నుఁగోరుటయు- నాచేతఁ జీవాట్లు తిని,
యీసంగతి మీతోఁ జెప్పవల దని బ్రతిమాలి- (రైకలోని నోటు
తీసి యెదుట వేయుచు) ఈనోటు నాపైఁ బాఱవైచి చక్కఁ
బోవుటయు- నా చెప్పినంతమాత్రమున నమ్మువా రెవరు !

శర్మ—(చటాలున నోటు తీసి చూచి) వా టీజ్ దిస్ ! (What is
this) నూదికోఁటకు జోద కేగ-బ్రాఁతవి బయటబడె నన్నట్లయిన దే!

రఘు—అ దేమిటి?

శర్మ—ఏమని చెప్పను ! గ్రేట్ వండర్ అండ్ గ్రాండు డిస్కవరీ !
(Great wonder and grand discovery) నాలదినములనాటి
మిస్టరీ (Mystery) యొకటి చక్కఁగా సాల్వ్ (Solve) అయినది!
నాఁడు పోయిన నోటు నెంబ రెంత ?

రఘు—అదా?-ఆఁ!-ముప్పదిమూఁడు వేల మూఁడువందల ముప్పదిమూఁడు.

శర్మ—దీనిం జిత్తగింపుఁడు ! (అని యానోటిచ్చును.)

రఘు—(చూచి, గుండె కొట్టుకొనుచు) ఏమీ!- యెంత దుర్నయము

చ. అలఘుమనస్కుఁడంచు సుగు • ణాఢ్యుఁ డటంచును స్వామిభక్తి సం
కలితుఁ డటంచు నెంచితిని • గాని యితం డిటు- మేఁకవన్నె బె
బ్బులి యని; తేనెపాకమును • పూసిన చాకని; పాలుపై వయిం
గల విషపుం గటాహ మని • కట్టా! యెఱుంగఁగనైతి నెన్నఁడున్.

శర్మ—బాబు! పైస్థితినిబట్టి లోపలిస్థితి నెఱుఁగుట కష్టమని నేను నాఁడే
మనవి చేసితినిగా ?

రఘు—నిజమే- నీవు చెప్పినావు. కాని-

ఉ. పెంచిన కుక్కయే మడమ • పీఁకు నటంచును- రక్ష సేయఁగ
ల్పించిన కంచె చేనుఁ గబ • ళించు నటంచును-నింటివైద్యుఁ డె

గ్గించక చేతులాఱ విష • మిచ్చు నటంచును- నెవ్వఁడేని యూ
హించునె యిట్టిఘోర మెపుఁ • డేని ప్రవర్తిలెనే ధరాస్థలిన్!

కస్తూ—ఇంతకాలమునుండి చూచుచు- ఈ కస్తూరి నడత కనిపెట్టలేక పోయినవారు- అంతటి నాలిముచ్చు నడత కనిపెట్టఁ గలరా?

రఘు— నిజమే నిజమే- నీపట్ల నే నన్యాయముగా నే ప్రవర్తించినాను!

కస్తూ—నాపట్ల మీరట్లు ప్రవర్తించినందులకు నా కేమియుఁ జింత లేదు. ఆ దుష్టుఁడు, మీయడ్డు లేకుండుటకై వల్లభచందుచేత వారంటు చేయించి మఱి వచ్చినందులకు క్రుళ్ళిపోవుచున్నాను!

రఘు—ఏమీ!- అదికూడ నాతనిపని యేనా! ఓరి విశ్వాసహీనుఁడా!

గీ. పుణ్యజనుఁ డన్న తెరఁగున • బుడమి, నేతి
బీరకా యన్న విధమునఁ • బెరుఁగుతోఁట
కూర యన్నట్లు- జక్కఁగాఁ గూర్పఁబడిన
దొర, విశ్వాసరా వను • పేరు నీకు!

కస్తూ—ఈ యుపాలంభనముల కేమి కాని- యిప్పు డాలోచింపవలసినవి రెండుసంగతులు-

రఘు—అట్లయిన- నా రెంటికిని ముందు పడవలసినవి రెండుగ్లాసులు! (అని కుర్చీలోఁ గూలఁబడును.)

కస్తూ—(గ్లాసులతో బ్రాంది తెచ్చియిచ్చును.)

రఘు—(నోఁట బోసికొని) ఇదిగో- యిప్పుడు మనసునకు మరల మహాతాబువెలుగు వచ్చినది! ఆసంగతు లిప్పుడు చెప్పు!

కస్తూ—మొదటిది- ఇంతవఱకు జరిగినప్పు డాయన నింకను నుద్యోగములో నుంచుటా- లేక, వెంటనే తొలగించుటా యను నది.

రఘు—నో! నో! (No! No!) ఒక్కక్షణ ముండనీయను!

కస్తూ—అట్లయిన, నాయుద్యోగ మెవరి కొసఁగెదరు?

రఘు—ఎవరో యేల?- మాశర్మ చాలఁడా? ఏమోయి శర్మా!-

శర్మ—తిమసెలు వైనచో- థండర్ బోల్టువలెఁ బనిచేయఁగలను.

రఘు—ఆల్ రైట్! ఇక్కడి కీసంగతి సెటిల్! రెండవ దేమిటి?

కస్తూ—వల్లభచందు వారంటుసంగతి-

రఘు—డామిట్! దాని కాలోచన మేమిటి! ఇప్పటికీవారంటు పోయి నది గదా- ఈసారి వారంటు వచ్చునరికి ఎచ్చటనో బదులు తెప్పించి- యెడమచేతితో గిరగిర త్రిప్పి పారవేసెదను.

కస్తూ—నా కది నచ్చ లేదు. సంస్థాన మిప్పటికే చాలవఱకు ఋణ ములపా లయినది. మూలమూలకంటె వడ్డీలు మించివేయుచున్నవి. దావాలమీఁద దావాలు- వారంట్లమీఁద వారంట్లు! ఇట్టిస్థితిలో నింకను ఋణము చేయుట యేమి యాలోచనము?

రఘు—మ రేమి చేయు మనెదవు?

కస్తూ—అయిన మట్టునకు సంస్థాన మమ్మివేసి, అప్పులు తీఱఁగా మిగి లిన ధన మింట నిడుకొని, హాయిగా ననుభవించుట మంచిది.

రఘు—ఈ సలహా నిన్నిదివఱకే చెప్పవ ద్దన్నవా రెవరు? తే!- కలమును కాగితమును తే! విశ్వాసరావునకు డిస్మిస్ ఆర్డరు (Dismiss order) శర్మకు అప్పాయింటుమెంటు ఆర్డరు (Appointment order) సంస్థానము విక్రయించుటకు పవర్ ఆఫ్ అట్టర్నీ (Power of Attorney) వ్రాసి సంతకములు చేసి యిచ్చెదను.

కస్తూ—వసారాగదిలోని మీ వ్రాతబల్లకడకుఁ బోవుదము రండు.

రఘు—ఐ యామ్ రెడీ! (I am ready) (అని చివాలున లేచి)

* మై డియర్ లేడీ!- బ్రింగ్ దేర్ గుడ్ టాడీ
విత్ మటన్ పకోడి- టూ నరిష్ మైబాడీ.

తెర పడును.

ఇది సప్తమాంకము.

---

* My dear Lady!—Bring there good Toddy
With mutton Pakodi—To nourish my body.

# మధు సేవ

## అష్టమాంకము

### మొదటిరంగము

ప్రదేశము:—రఘునాథరావుగారి మేడ.

నిర్మల—(విచారముతోఁ గూరుచుండి)

సీ. పాపకృత్యం బను • పరితాపమూ లేదు
జముఁ డల్కఁ గొను నను • జంకు లేదు
సిరి తొలంగిన దను • చింత సుంతయు లేదు
కీర్తిమాసిన దను • కించ లేదు
పరులు నవ్వెదరను • భయ మేమియును లేదు
సతి దుఃఖపడు నను • జాలి లేదు
ఆరోగ్య మడుగంటె • నను విచారము లేదు
మతి సన్నగిలె నను • మాట లేదు
గడన కత్తియ యిల్లె లో • కంబు ! మద్య
సారమే సర్వదా ప్రాణ • ధారకంబు !
దైవమా ! యిట్టి నా ప్రాణ • ధవుఁడు మరల
దారిఁ బడు టెట్లు!- నా కోర్కె • దక్కు టెట్లు !

దివాణము దీపములేని దేవళమైనది; కచేరిచావడి కరిమ్రింగిన వెలగపం డైనది ! బండ్లకొట్లు పందులపర మైనవి; గుఱ్ఱపులాయములు కుక్కల కిర వైనవి! ఉద్యోగు లుద్వాసన చెప్పుకొనిరి ! పరిచారకులు పస్తులు మాడలేక యెత్తిగిలిరి ! ఇంత యేల- మొన్నటి నుండి వంటలక్క-కూడ మొగము చాటు వేసినది ! మసీదునందలి

యెలుకవలె నిల్లు ద్రుగ్గవలసిన యోగము నా కేల పట్టినదో !

ఉ. అంతటి యింటఁ బుట్టి, యటు • లందఱకు న్మురిపెంపుబిడ్డ నై
యింతటి యిల్లు చొచ్చి, తుద • కీగతిఁ దోడును నీడ లేక, కొం
డంత వ్యథం భరించుచు, న•హర్నిశ లొంటిగఁ బుచ్చ నయ్యె! హా!
యెం తని యోర్వ నేర్తు మది•నెం తని ధైర్యము గాంచ నేరుతున్!

(తుణ మూరకుండి) సందియ మేమిరా !-

సీ. మామ దురాగ్రహ • మానసుం డగుఁ గాక
యత్త మహామారి • యగును గాక
బావలున్ మఱఁదు ల • ప్రాజ్ఞ లౌదురు గాక
యాఁడుబిడ్డ పిశాచ • మగును గాక
కన్నబిడ్డలు దైన్య • గతిఁ జరింతురు గాక
గర్భశోకాపత్తి • కలుగుఁ గాక
అన్నవస్త్రంబుల • కతిలోప మగుఁ గాక
అడవిలోఁ గాఁపుర • మబ్బుఁగాక
భర్తయోగ్యుఁడు, ననుకూల • పరుఁడు నేని
పడతులకు స్వర్గ మఱచేతఁ • బరిఢవిల్లు;
మగఁడు జడుఁ డగు నేని, కో • మలుల కిహము
నందె నరకంబు ప్రత్యక్ష • మగు నిజంబు !

ఇంతకన్న నే నిఁకఁ జేయవలసిన దే మున్నది!-

సీ. మనవాంట్ల కియ్యది • మర్యాద కాదని
నోరు నొచ్చినదాక • పోరినాను
మద్యపానముచేత • మాసిపోయినయట్టి
కాఁపురా లెన్నియో • చూపినాను
పరదేశములు మద్య • పాన విముక్తి కై
పడు బాములను బోధ • పఱిచినాను
ఇంతటితో నైన • నీ దురభ్యాసంబు
మఱచిపొమ్మని ప్రతి • మాలినాను

ఏమిలాభ - మిద్ది • యెల్లను బూదిలో
వ్రేల్చు ఘృతమువలెను • విఫలమయ్యె !
వారివారి నొసటి • వ్రాఁతఫలమె కాని-
చెప్పువారు లేక • చెడిన దెవరు !

(వినుట నభినయించి) ఎవరుచెప్పుమా వచ్చుచున్నారు ! కక్క-గారు కారుగద ?- అవును- ఆ యడుగులసడి యాయనదే. ఆయనగారావిధముగా నుద్యోగమునుండి తొలఁగించినను, కంటిని ఱెప్పవలె నన్నాయన కాపాడుచునే యున్నాఁడు గదా !

గీ. ఎగ్గుచేసిన వారల • కేని మేలు
సలుపుటే మంచివారల • సహజ గుణము
పాఱతోఁ లోఁతుగా గాయ • పఱచినట్టి
వారలకు భూమి యొసఁగదే • నీరములను ! (లేచును.)

విశ్వా—(విషాదముతోఁ బ్రవేశించి తనలో) అర్థులకు నాస్తి వచనమును- ఆప్తుల కప్రియ వచనమును దెలుపుట యతి కష్టము !

గీ. అన్నమును, బున్నము నెఱుంగ • నట్టిగోల
సుగుణముల ప్రోవనం దగు • సుభగశీల
అట్టి యిల్లాలి కిటువంటి • యప్రియంబు
తెలుపుట యనంగఁ బ్రాణముల్ • తివియుటె కద !

నిర్మ—రండు కక్కగారు !- రండు ఇదిగో కుర్చీ. (పరికించి) అదేమట్లున్నారు- క్రొత్త లేమియు లేవు గద ?

విశ్వా—అమ్మా ! ఆపద లొంటిగా రా వన్నవాఁ డజ్ఞుఁడా !

ఉ. నమ్మిన గుండెకాయ యన • నాదు పితామహుఁ డాది నీ దివా
ణమ్మును గొల్చె; నా వెనుక • నాజనకుండుఁ దదర్థ మట్లె ప్రా
ణమ్ములు ధారవోసె; నిఁక • నాకథ యేమిటి- కట్టెదాని నే
డమ్మరొ ! మా ప్రభుండు తెగ • నమ్మఁగఁ జూచు నవస్థ వాటిలెఁ !

నిర్మ—(ఒక్క నిట్టూర్పు పుచ్చి) సరే- అనుకొన్నట్లే యైనది ! జరుగఁగల సంగతి యిది యని-నాకుఁ జాలదినములక్రిందటనే తోఁచినది !

విశ్వా—కష్టములలోఁ గష్టము - కడ కీ మేడయైన మిగిల్చినారు కారు. వారము దినములలో దీనిని వప్పగించి తీఱవలెను !

నిర్మ—శ్రీ రామ రామా ! చివర కెంతటి దురవస్థ పట్టినది ఓసీ మద్య పిశాచమా !

చ. ప్రవిమలమైన కాఁపురము • బగ్గముపా డొనరించినావు ! ప్రా
భవ మఖలంబు, జొప్పడిన • పాటున నే దిగమ్రింగినావు ! రే
వన లిటు భర్తకై మొగము • వాచి దపింపఁగఁ జేసినావు ! చీ !
చివరకుఁ జెట్టుక్రింద నివ • సింప విధించినదాన వే మసా !

(క్షణ మూరకుండి) కరణంగారు ! ఇప్పుడు కర్తవ్య మేమిటి ?

విశ్వా—అదియే పాలుపోక యాలోచించుచున్నాను. సవిస్తరముగా నాయనగారి కీ సంగతులు దెలియఁజేయు మని సెలవా ?

నిర్మ—వలదు వలదు- అది నా కావంతయు నిష్టము లేదు.

విశ్వా—అట్లయిన నిఁక నన్యాలోచన మేల ?- యీ భృత్యునియిల్లు పవిత్ర పఱుపుఁడు.

నిర్మ—అదికూడ నా యభిప్రాయము కాదు. ఈభారముకూడ మీ తల కెత్తుట నాకిష్టము లేదు. పోయినవి పోఁగా- చిన్న చిన్న వస్తువులు కొన్ని మిగిలియున్నవి. మడతవిప్పని పట్టుచీరలు కొన్ని మందసములలో మ్రగ్గుచున్నవి. ప్రస్తుతము పనిలేని పాత్రసా మగ్రి యెంతయో యున్నది. వీని నన్నిటిని విక్రయించి వచ్చి సొమ్ములోఁ గొంత వడ్డికి వేసి, కొంతతోఁ జిన్న కొంప యొకటి కొనిపెట్టితిరా - ఆవడ్డితోఁ గాలక్షేపము చేయుచు, నాకొంపలో బడియుండెదను.

విశ్వా—అట్లాయిన, మావీధి నొకయిల్లు అమ్మకమునకు సిద్ధముగ నున్నది. నేను వెళ్ళి దానిని నిశ్చయపఱుచుకొని రానా ?

నిర్మ—సందియ మేమీ-చప్పున వెళ్ళి స్థిరపఱుచుకొని రండు.

తెరపడును.

# రెండవరంగము

ప్రదేశము:—రాజవీధి.

రఘు—(బికారివేషముతో నడచుచు) సర్వభక్షకునైనను సంతుష్టి పఱుపఁగలము కాని- సానిముండను దృప్తిపఱుప లేము!

సీ. ధనదుండు నిధు లిచ్చి • తన్నుంచుకొనఁ గాక
పోక కింకొకనితోఁ • బోయి తీఱు
పంచబాణుఁడు తన • బానిసీఁ డగు గాక
కులము వాని నె ట్లో • కూసి తీఱు
నిలువెల్ల నగలతో • నింపింపుదుముగాక
బొత్తాము నకు మూతి • ముడిచి తీఱు
అమృతంబు గొనితెచ్చి • యర్పింపుదుముగాక
తేగకై రేయెల్ల • దెప్పి తీఱు
ఆశ పదివేల సంతృప్తి • యఱువదాఱు
వేలు విశ్వాస మిన్నూఱు • పాళ్లు, కల్ల
వేయిపాళ్ళు, మోసము పది • వేల పాళ్లుఁ
జేరిచి- విధాత వేశ్యను • జేసియుండు!

ఎస్టేటు విక్రయములో మిగిలిన యేఁబదివేలు నేగంగలోఁ బోసినదో- యెట్టుని యేగాని లేదు! ఆ కట్టెముండ - పాప!- మది యిది యమ్మి, మైయొసువేలు చేసి- రెండువేలు కొక కొంప కొని, కడమది యెచ్చటనో వడ్డీకి వేసికొన్నదఁట. దాని తల గొట్టి యాద్రవ్య మెట్లయినఁ గొనితెమ్మని యీ పాడుముండ పట్టు! దీనిపట్టు చెల్లింపకున్న - తిక్కముండ, తలుపు తీయ దేమో యని భయపడవలసిన ప్రారబ్ధము నాకుఁ బట్టినది! (ప్రక్కకుఁ జూచి) ఇదిగో యిదియే మా దేవిగారిప్పు డున్న మందిరము! తలుపు తట్టనా?...అట్టి యాగర్భ శ్రీమంతురాలి నిట్టి స్థితికిఁ దెచ్చి - యే మొగము పెట్టుకొని దాని యెదుటికి బోవుదును!...ఏమీ! యీపాటి

లజ్జ యింకను నాలో మిగిలి యున్నదా !...సరే కానిమ్ము—
"సాహసేలక్ష్మి" యని శాస్త్రముకదా? (అనిపోయి తలుపు తట్టును)

తెరలో—ఎవరు వారు ?

రఘు — ఇం కెవరు ?- నేను !

నిర్మ — (చటాలునఁ దలుపు తెఱచి, సంతోషముతో) ఏమీ - మీరేనా ! యేమి యదృష్టము ! రండు రండు- లోపలికి రండు ! (అని తోడుకొనిపోయి) అయ్యో ! కుర్చీ లేకపోయినది కదా !- ఇదిగో - యీపీట పైఁ గూర్చుండుఁడు ! (అని పీటవేయును.)

రఘు — (చిన్నదనముతోఁ గూర్చుండును.)

నిర్మ — (చెంతఁ గూర్చుండి) మహాభాగా ! యీ దీనురాలిపై నింత దయ వచ్చినది- ఈప్రొద్దు నేను లేచిన వేళావిశేషమూ యేమి ?

రఘు — సరి కాని- అంత సన్నగిలి పోయితి వేమి ?

నిర్మ — నా సన్నగిలుట కేమి !- మీ రెంత సన్నగిలినారో - యెంత తారుమా అయినారో యెఱుఁగుదురా ! శివశివా ! యీ వాలకము నకుఁ దోడుగా నీ గుడ్డ లెక్కడ దాపరించినవి !

రఘు — అవస్థ మాఱినప్పుడు - హంగులు కూడ మాఱవా ?

నిర్మ — ఇట్టి యవస్థకుఁ గారణ మేమో మీ కిప్పటి కైన తట్టినదా ?

రఘు — తట్ట కేమీ ప్రారబ్ధము !

నిర్మ — ప్రారబ్ధము కాదు- ప్రాంది బుద్ధి !

చ. మడిసిరి మద్యపానమున • మత్తిలి యొత్తుగఁ బోరి యాదవుల్;
జడమతియై నశించెఁ బృథు • సారుఁడు మద్యరసంబుఁ గ్రోలి; శు
క్రుఁడు తన దృక్కులం దొకటి•కోల్పడి మోర్ సురఁ ద్రావి; యక్కటా
చెడని జనుం డెవండు- మధు • సేవ యొనర్చి ధరాతలంబునన్ !

రఘు — పురాణము లన్నియుఁ బూర్తిగా స్టడీ (Study) చేసినావే !

నిర్మ — ప్రాణేశ్వరా ! యీ పరిహాసముల కేమి కాని-

సీ. పదుగురులో సహిం • పఁగరాని తలవంపు
దగ్గఱ కేతేర • తగని కంపు

శ్రుతి మించినకొలంది • మితి లేసి ధనహాని
పదును దప్పినయెడ • ప్రాణహాని
బ్రతికినన్నాళ్లు దు • ర్భరమైన యపకీర్తి
ఆలు బిడ్డల కుగ్ర • మైన యార్తి
కాలు సేతులకును • కడలేని తడబాటు
పూర్తిగ నిహపరం • బులకుఁ జేటు

పాపములకూఁత, నోరు వి • ప్పగనె రోఁత
లేచిన శివంబు, మేను వ్రా • ల్చిన శవంబు;
కోరి కొనితెచ్చుకొను గొంతు • కోఁత గాక
మద్యపానంబువలన సే • మంబు గలదె?

రఘు—(పకపక నవ్వి) హాయి! హాయి! ఏమి లెక్చరు! ఏమి లెక్చరు! ఫుస్సీఫుట్ జాన్సనుగా రిఁక పూర్తిగా రిటైర్ (Retire) కావచ్చును!

నిర్మ—మహాభాగా! మాఱులెక్చర్లతోఁ బని యేమిటి?- త్రాగుడు యొక్క ఫలితమునకు- త్రాగినవాని దర్శనమే లక్షలెక్చర్ల పెట్టు! ఆ వీడ మొగము, ఆ పీచుతల- ఆ కొఱవికన్నులు, ఆ కొంకిమెడ- ఆ కోరచూపు, ఆ కోఁతిరూపు- ఆ వదలుకాళ్లు, ఆ వడకుచేతులు- ఆ వెకిలినవ్వు, ఆ వెఱ్ఱివాగుడు- ఆ తూలునడక, ఆ ధూళిములక- ఆ మఱపు తెఱపులు- ఆ మాటవిఱుపులు- ఆ తడబాటు, ఆ తబ్బిబ్బు- ఆ వాలకము, ఆ వాచాలత- ఆ యాగ్రహము, ఆ యనుగ్రహము- ఆ యీవి, ఆ ఠీవి- ఆ దుడుకు, ఆదురుసు- ఆ తిక్క-, ఆ తిమ్మిరి- ఆ కంపు, ఆగత్తర- ప్రత్యక్షముగాఁ జూచి కూడ పానచింత మాననివాఁడు పశువు కాక- మనుజుఁడా!

రఘు-(నవ్వుచు) రామరామ! రానురాను తిట్లలోనికిగూడ దిగితి వేమి!

నిర్మ—(చెంపలు వైచుకొనుచు) మహాభాగా! మన్నింపుఁడు! ఆవేశ వశమున నట్లు నోరు జారినది! నా మన సెంత మరగిపోవుచున్నదో- నారాయణుఁ డెఱుఁగును! నేను గాఁపురమునకు వచ్చి మూడేండ్లయినది. ఈ మూడేండ్లలో మూడురాత్రు లైన నిశ్చింతగ నిద్ర

పోయి యెఱుఁగను! కాసింత కన్ను మూసినను గలలోఁగూడ మీ చింతయే. ప్రతి పురాణమును వరికించినాను- ప్రతి దేశచరిత్రమును బరిశీలించినాను- మద్యపానము మరగి నెగ్గినవాఁడు మచ్చునకైనఁ గానఁబడ లేదు. త్రాగు డన: రంభవలెఁ గానిపించు రక్కసి- అమృతమువలె లోనఁ జొచ్చు హాలాహలము- పరమానందముగఁ దోఁచు పాతకము ! మొదటిగ్లాసు- కుక్కను, జేసి మొఱిగించును; రెండవగ్లాసు- క్రోఁతిం జేసి యాడించును; మూడవగ్లాసు- దున్నం జేసి దుమికించును; నాలుగవగ్లాసు- గాడిదనుజేసి నడిపించును; అయిదవగ్లాసు- పందిం జేసి బందలో పొరలించును ! మనుజుఁడు మద్యమునకు దాసుఁడు కాఁగానే- పరిజ్ఞానమునకు సెలవు, పట్టు దల కాటవిడుపు; సంపదలకు స్వస్తి, సత్సాంగత్యమునకు సమాప్తి; ప్రేమ కుద్వాసన, పెత్తనమునకు తిలోదకము; ఎగ్గునకు మంగళము, సిగ్గునకు మారకము ! మనకథయే యిందులకు మంచి నిదర్శనము. మన వివాహము నాఁటికి మహాలక్ష్మియింటఁ దాండవ మాడుచుండె డిది. సార్వకాలమును దివాణమునందు సంక్రాంతిపండుగవలె నుండె డిది. ప్రజలు మీ సద్గుణములను బట్టులవలెఁ బొగడెడివారు. అట్టి స్థితిలో నెట్లో యీయంటు జాడ్యము సోఁకినది! అది మొదలు క్రమముగా నైశ్వర్య మంతరించినది- పరువు పదటఁ గలిసినది- పర పతి పటాపంచ లైనది- సౌఖ్యము సన్నగిల్లినది- పరివారము భగ్న మైనది- యెస్టేటు ఎగిరిపోయినది- చెరువులంతలేసి మేడలలో మెలఁ గిన నాకుఁ జెట్టుక్రింది కాఁపురము దాపుర మైనది; అఖండాగర్భ శ్రీమంతుల రైన మీకు- అన్నమో రామచంద్రా యను నవస్థ చేరు వైనది ! అదేమట్లున్నారు ?. నే నన్నమాటల కాగ్రహము వచ్చి కాదు కదా !

రఘు—ఆగ్రహము వచ్చి కాదు- అనివార మైన దుఃఖము వచ్చి ! నిశ్చయముగా నీపలుకులవల్ల నాహృదయము నీరై పోయినది ! కాని యిల్లు కాలినవెనుకఁ బోసిన నీటిపోతవలె నీప్రబోధమంతయు

నిరర్థకము ! ఏ మందువా ? - త్రాగుడు అలవాటుపడిన వాని బాములు త్రాగుబోతునకే గాని తెలియవు. గడియ తడవైనచో మేను గానుగను బెట్టి యాడుచున్న ట్లుండును. నరములు జాతిరోట నిడి నలుగఁగొట్టుచున్న ట్లుండును. కీళ్లు సడలును, కాళ్లు తడబడును. పెదవులు బెరడు కట్టును; నాలుక పిడుచ కట్టును, కన్నులు కన నేరవు; వీనులు విన నేరవు; తట్టెఁడు పరాకు, పుట్టెడు చిరాకు ! కాఁబట్టి-

ఆ. మానవచ్చు తిండి ♦ మానవచ్చును నిద్ర
మానవచ్చు సలిల ♦ పానమట్లె
ముదిత ! యొక్కసారి ♦ మూతి ముంచిన యెడ
మద్యపాన మింక ♦ మానుటరిది!

ఇంతయేల ? -

గీ. విత్తముకుపుటలో వెల ♦ వెలఁదుకకును
మద్యమునకును దారత ♦ మ్యంబు లేదు;
కాని విత్తము పోఁగానె ♦ గణిక విడుచు
చచ్చునంటాఁక మద్యర ♦ సంబు విడదు!

నిర్మ—నిజమే కాని, మనసుండినచో మార్గ ముండకపోదు.
రఘు—మనసు లే కేమీ? మార్గమే కనఁబడ కున్నది.
నిర్మ—నేను జెప్పినట్లు విన్నచో - నెలదినములలో మాన్పఁగలను.
రఘు—అట్లయిన - నీమాట కడుగుదాఁటిన నొట్టు!
నిర్మ—(సంతోషముతో) నిజముగా నేనా! అమ్మయ్యా - యెన్నాళ్ళ కెట్టి మాట వింటిని! కస్తూరి యింట నిఁకఁ గాలు పెట్టరు గద?
రఘు—సర్వస్వమును దాని స్వాధీనములో నున్నదిగదా - కాలు పెట్టకున్న మనకొక గవ్వయైనా దక్కునా?
నిర్మ—ఏమి వెఱ్ఱి! దాని చేఁజిక్కినది మరల దక్కుట కూడనా!

గీ. గోడకు వేసిన సున్నము
ప్లీడరు చేఁబెట్టినట్టి ♦ ఫీజు - వలచిరో

చేడె కొసంగిన విత్తము-
బూడిదఁ బసు సెంటు మరలఁ • బొందఁగ వశమే!

రఘు—నా యభిప్రాయ మది కాదు. ఏదో విధముగా నేపాటిదైన సంగ్రహించుకొని వచ్చినచో - ఏముద్రాక్షరశాలయో పెట్టుకొని జీవింప వచ్చునని.

నిర్మ—అమ్మయ్యో! ఆయింటఁ గాలుపెట్టిన మీమనసు మరల మాటి పోక మానదు. ఆపాటిసొమ్మునకై మీ రచటి కరుగవలసిన పనియు లేదు. ముత్తా కామరాజునొద్ద మూడువేలు వడ్డికి వేసినాను. మీ రాసొమ్ము తీసికొని, మీ కిష్టమయిన వ్యాపారము నుప్రారంభింపుఁడు.

రఘు—నాయెడ నీ కాపాటి నమ్మకము కలదా?

నిర్మ—మీ కాసందేహ మెందులకు? (అని లేచి- పెట్టె తెరచి- యందలి కాగితమును దీసి) ఇదిగో యిది యతఁడు నాకు వ్రాసియిచ్చిన నోటు. దీని నిప్పుడే మీకు మార్చెదను. అన్నట్లింకొకటి- ఈ వేసఁగి బెంగుళూరులోఁ గడుపుటకై, యతఁ డీసాయంకాలము రైలులో బయలుదేర నిశ్చయించుకొని- యిందాఁకనె మందరి నెల వడ్డికూడఁ బంపివేసినాఁడు. కాఁబట్టి- మీరిప్పుడే వెళ్ళకున్న మన కా సొమ్మింతలోఁ జేతికిరాదు. (అని నోటుపై వ్రాయవలసిన మాటలు వ్రాసియిచ్చి) చాలునా?

రఘు—(చదివి చూచి) చాలును. వెళ్ళిరానా?

నిర్మ—సందియమేమి? వెళ్ళి వెంటనేమాత్రమింటికి రండు. మీరువచ్చుసరికి వంటచేసి సిద్ధముగా నుంచెదను.

రఘు—ఇదిగో - యిప్పుడు రానా! (అనిలేచి వీధినిబడి పోవుచు) ఇఁతటి యిల్లాలి నెంతదుఃఖపెట్టితిని!

గీ. ఎచటనో పుట్టి తమయిండ్ల • కేగుదెంచి
తమ్మె దైవసములుగఁ జి • త్తమున నమ్మి
తమనిమిత్తము బ్రతుకులు • ధారపోయు
సతుల నేడ్పించు పతులకు • గతులు గలవె!

శర్మ—(ప్రక్క నుండి చటాలునఁ బ్రవేశించి) ఇదేమి యింత సేపున్నారు? వెళ్ళినపని యైనదా ?

రఘు—అయినది కాని- మఱియొకవిధముగా నైనది.

శర్మ—అనఁగా ?

రఘు—నా వైఫ్ (Wife) నాకుఁ బరిపూర్ణ ప్రబోధము కలిగించి నా వెనుకటిచర్యకుఁ బశ్చాత్తాపపడునట్లు చేసినది. ఈ దుర్వ్యసనములనింతటితో విడిచిపెట్టి, యిఁకమీఁద దాని యిష్టానుసారముగ మెలంగుచు- ఇదివఱకుఁ జేసిన యన్యాయమును మఱపునకుఁ దెచ్చుటకు నిశ్చయించుకొన్నాను. ఈ సంగతులు నీవు కస్తూరి కెఱిఁగించి, యింకొకదాని చూచుకొమ్మని చెప్పుము.

శర్మ—(తెల్లపోయి) అట్లయిన, మీ రిపు డరుగుచున్న దెచ్చటికి ?

రఘు—నా వైఫ్, మ త్తా కామరాజుకడ వడ్డీకివేసిన మూఁడువేలును నన్నుఁ దీసికొమ్మన్నందున- ఆసొమ్ముతో నేదేని వ్యాపార మారంభింపుద మనుతలంపుతో, దానిం దెచ్చుకొనుటకై వెళ్లుచున్నాను.

శర్మ—(తనలో) ఇప్పు డీకనిమాట కడ్డు చెప్పఁగూడదు. ఈసొమ్ము చేతఁ బడినవెనుక, నిట్టి కుక్కను జేసి యీడ్చుకొని పోఁగలను. (పయికి) బాబు ! మీపంథ ఫస్టుక్లాసు (First class) గా నున్నది. ఎల్లకాల మొక్కటేరీతిగా నుండుట యేరికిని మంచిది కాదు. మీరు వెళ్లినప్పుడు కస్తూరియింట నాకుమాత్ర మేమిపని యున్నది? మీరు ప్రారంభించు వ్యాపారమునందుఁ దోడుపడుచు, నేనును మీతోనె యుండెదను.

రఘు—అందుల కభ్యంతర మేమున్నది ? అయితే కామరాజును నీ వెఱుఁగుదువా ?

శర్మ—ఎఱుఁగ కేమి ?- రండు వెళ్లుదము.

(ఇద్దఱుఁ గలిసి నిష్క్రమింతురు)

ఇది యష్టమాంకము.

# మధుసేవ

## నవమాంకము

### మొదటి రంగము

ప్రదేశము :— కస్తూరి మేడ.

ప్రవేశము:—కస్తూరి, శర్మ

కస్తూ—అట్టే చంపక-అదేమో సరిగాఁ జెప్పితివా సంతోషించెదను.

శర్మ—అట్లయిన విను: మన సన్యాసి మామగారు మరణించినాఁడఁట- మరణకాలమునఁ, దనయాస్తి యంతయుఁ దనకొమార్తెకుఁ జెందునట్లు విల్లు వ్రాసినాఁడఁట- విశ్వాసరావు వెళ్ళి విల్లునందలి యాస్తి యంతయు పప్పగించుకొని- వచ్చినాఁడఁట.

కస్తూ—(ఆశ్చర్యముతో) ఏమిటి !- ఆస్తివిలువ యేపాటి యుండునో ?

శర్మ—ప్రత్యేకపు స్థిరాస్థివల్ల, పన్నులుపోఁగా పదివేలు వచ్చునఁట.

కస్తూ—అమ్మయ్యో! అంతాస్తియే! కర్మల భూమిమీఁద నిలుచునా!

శర్మ—దానిమొగము దాని కొక్కదమ్మిడి దక్కసత్తుమా ! మన దామోదరుఁడు మన చేతులోనే యున్నాఁడు గదా !

కస్తూ—ఈ చవట వెళ్ళి, సగమైన వ్రాయించుకొని రాఁగలఁడా !

శర్మ—అది నీలోనున్నది. నీవు తలఁచుకొన్నచో నిమిషము పని ! అదుగో- అతఁడును వచ్చుచున్నాఁడు- ఒక పట్టు పట్టిచూడుము.

రఘు—(హాస్యవేషముతో, ఆయాసముతోఁ ప్రవేశించును.)

కస్తూ—ఎండలో నెక్కడికి వెళ్ళినారు ? అయ్యో ?- అదే మంతచెమట పట్టినది ! ఇటుఁ గూర్చుండుఁడు ! (కూర్చుండఁబెట్టి విసరును.)

రఘు—ఇరువురుఁ గూర్చుండి యేమిటి యాలోచించుచున్నారు ?

కస్తూ—మ ఠేమియు లేదు. మీా కొక శుభవార్త చెప్పవలె నని.
రఘు— ఏమి టది?
కస్తూ—మీా మామగారు మరణించినా రఁట!
రఘు—ఇదా శుభవార్త?- అవును, మరణించినా రఁట.
కస్తూ—ఆయనయాస్తి యంతయు మీా యావిడకు వచ్చినదఁట.
రఘు—అవును వచ్చిన దఁట. నాఁడది నాయెడఁ జూపిన యౌదార్యమునకు భగవంతుఁడు దాని కీవిధముగాఁ బ్రత్యక్షమైనాఁడు.
కస్తూ—అది మీా సామర్థ్యమా- యామె యౌదార్యమా?
రఘు—సరే, యేదియో యొకటి?- యెందులకాసంగతి యిప్పుడు?
కస్తూ—ఎందులకా?- బంగారమువంటి జమీా పదటఁ గలుపుకొని మీారు పడుచున్న బాములకు నా మనసు మ్రగ్గిపోవుచున్నది! మరల నొకసారి వెళ్ళి, మంచిమాటలు రెండు చెప్పి సగమైన వ్రాయించుకొని వచ్చితిరా- నాసంతాపము తీర్చినవారగుదురు.
రఘు—ఏమొగము పెట్టుకొని మరల దాని యెదుటి కేగుమనెదవు! సిగ్గు విడిచి నేను సిద్ధపడినను- నన్నది మరల నమ్మునా?
కస్తూ—నమ్మునట్లు రవంత నటింపకూడదా?
రఘు—నావల్లఁ గాదు. వెనుకటిదానికే నామనసు వేఁగిపోవుచున్నది!
కస్తూ—ఆఁ ఆఁ!- అట్లయిన నాయాస్తి యంతయు నేమగునో తెలియునా?- విశ్వాసరావు పర మగును! గతికిపోఁచకుఁ గట్టువడి యుండుటకు మీా యావిడ కస్తూరి యనుకొంటిరి కాఁబోలును!
రఘు—ఏమిటీ యొంతపని కాఁడితివి! ఇదిగో! - యీసంగతి యిఁక నెన్నఁడు నాయెదుటఁ దలపెట్ట కేమి! (అని లేచి చక్కఁబోవును)
కస్తూ—ఈ పీడఁగు వినునట్లు లేదు!- ఇఁక నేమిటి సాధనము.
శర్మ—సాధనములసంగతి నీ కేల?- సగము కదా నీవు కోరినది- సర్వము నీ స్వాధీనము చేయకున్న- నా పేరు శర్మ కా దనుకో!
కస్తూ—హాయి! హాయి! అదీ మగతనము! ఏదీ యొకముద్దీదీ!

(అనిముద్దాడుచుండఁగాఁ దెరపడును.)

# రెండవ రంగము

ప్రదేశము:—నిర్మల గది.

నిర్మల—(మంచముపైఁ గూరుచుండి) కటకటా !

గీ. భర్త యే వేశ్య వజ్జనో • పండుకొనఁగ
నింట నొంటిగ శయనించి • కంటఁ గూర్కు
వెంటఁ దోడును లేక, త • పించునట్టి
రమణీకంటెను నిర్భాగ్య • రాలు కలదె !

ఇంతయాస్తి నాయనగారిచ్చి పోయినందులకు- యిప్పటికైన నీయన మతి మరలినచో, నిరువుర మెంతేని సుఖపడుదుము గదా! ప్రాణేశ్వరుఁడిట్లు పరాధీనుఁడై చరించునప్పుడు- ఈ సంపత్తు నాకేమిసంతోష మిడగలదు. (విఘటనభినయించి) రెండు- మూడు- నాలుగు- అయిదు- ఆఱు- ఏడు- ఎనిమిది- తొమ్మిది- పది- పదునొకండు- పండ్రెండు- అమ్మయ్యో!- అప్పుడే పండ్రెండయినదే! కనుకనే కాసింత కూర్కు వచ్చుచున్నది. రంగి యేఁదుచేతనో యీపూఁట రానే లేదు. రంగఁడు మరలఁదప్పత్రాగి వెళ్లి తల పగులఁగొట్టినాఁడేమో ! పాప మామండకు ప్రతిదిన గండము కదా! అదృష్టవశమున నా కాయవస్థ మాత్రము లేకపోయినది! చీ !

ఆ. కానలోన మొలకదు • గాఁ బుట్ట వచ్చును
సీటికుక్కగా జ • నింప వచ్చు;
పరఁగ ద్రాగుబోతు • భార్య కాఁగూడదు
కలనునైన నాట • కమునకైన!

ఒకవేళ రంగివచ్చి పిలిచినచో వినిపించుటకై గదితలుపు తెఱచి యుంచెద. (లేచి-దీపము తగ్గించి పండుకొని నిద్రించును.)

రంగ—(పెరటితలుపు తెఱచుకొని తూరుచుఁ లోపలఁ బ్రవేశించి) ఓయి దేవుడా! పెరటిగోడ దాఁటేసరికి పేగు త్రెగాయి! దీని తల్లి కడుపు సల్లగా- యీతలుపుమాత్తరం దబ్బునే వచ్చింది ! ఆ మొదవకుక్క నాయెంట బడకపోతే యెప్పుడో రావలసినోణ్ణి !

(ముందునకుఁ జూచి) అదురుట్టం కావోఁను-అదుగో- ఆయమ్మ గది తలుపు తెరిచే వుంది; వొచ్చినపని కాగానే, వొక్క మినిట్లో దాటి పోవడానికి, యీ గదితలుపు గడతప్పించి వుంచుకొంటాను. (అట్లుచేసి, మెల్లఁగా గదిగుమ్మము చేరి) యేఁవి సెప్మ యేనాడులేంది కాళ్ళొణుకుతున్నాయి! యీ రోగాని కిదే మందు. (జేబులోని బ్రాంది సీసా తీసి, కొంచెము త్రాగి సీసామరల జేబులో నిడుకొని) అదీ! ఆ సుక్కతో ఆరోగం వదిలింది! అగ్గిలో కురకమంటే యీపాలి అమాంతంగా వురుకుతాను! (వినుట నభినయించి) అదిగో గురక! మంచి నిద్దర్లో వుంది! మాదొడ్డసఁవయం! (మెల్లఁగా గదిలోఁ బ్రవేశించి) ఎల్తురు సాల్దు- (దీపము పొడిగించి, చేబునుండి యొక చిన్న సీసాయు, నొక కాగితపు మడతయుఁ దీసి) ఈ వుత్తరం తలకింద పెట్టి యీసీసాలోది కొంత మూతిమీఁ దెయ్యాలి. (తారుచు మంచము కడ కేగి) కాదు కాదు- ముందు సీసాలోది మూతిమీఁ దేసి, తరవాతే వుత్తరం తలకింద పెట్టమన్నాడు. అంచేత, అందాకా యీవుత్తరఁ విక్కడుంచుతా (కాగితపుమడత మంచముపై నిడి, వెనుకఁ తట్టునకుఁ బోయి, సీసా కార్క తీసి, వంగి, నిర్మల ముఖమువంకఁ జూచి, యులికిపడి, వడఁకుచు) వోయి బాబో !- నా వొల్లకాదు ! యిల్లాంటితల్లిని నా సేత్తో నేను సంప లేను ! ఆమొహం కంట బడేసరికి - అరి కాత్తేము నత్తి కెక్కింది ! ఆ యెదవడబ్బు నా కక్కర్లేదు ! (సీసాకు మరల కార్క వేసి, కొంచెమీవలకు వచ్చి) మళ్ళీ కాళ్ళు మడత పడుతున్నాయి . మనుసు కూడా - మా కంగారుగా వుంది ! కాస్త సుక్క తగిత్తే గాని- యీ గాబరా వొదిలి, బయిట పళ్ళేను ! గొంతుక కూర్చుండి, (తలకుఁ జుట్టుకొన్న బట్ట తీసి క్రింద నుంచి, జేబులోని బ్రాందిసీసా తీసి, పూర్తిగా నోట బోసికొని, సీసా క్రింద నుంచి, క్షణ మూరకుండి, మైకముతోడి యుత్సాహముతో) యేనాడూ లేంది - యీపూ టింత యెదవన్నా

పొయ్యా నేం! ఛీ! ఛీ! షిగ్గు! షిగ్గు! ఆమూరాజు - అడిగినప్పు డల్లా - వొకటీ రొండూ యిష్టూ - యీ కాష్టపనీ షేషు కొష్టే గొం డొందలు రొక్కం చేతి కిచ్చి - రంగానికి కేవు కట్టి, బంగా రంలాగు పంపేష్టా నన్నాడు. యెన్ని కబుర్లో షెప్పొచ్చి, యెడవ లాగ షక్కా యిత్తే, యేఁ వంట్రాడు - మొగా న్నూష్టాడు- కఱ్ఱతో కొట్టడఁవా - కత్తితో నరకడఁవా ?- మూడు షుక్కలు మూతిమీ దెయ్యఁడవేగా! వో! - యీపా లేషేష్టా! యెయ్యక పోతే - యిడి మోషం కాదు! (చిన్నసీసాతో చివాలున లేచి తప్పటడుగుఁతో మరలఁ దలవెనుకకు వెళ్ళి, వడకుఁజేతులతో సీసామూర్కు తీసి, వంగి, మెల్లఁగా సీసావంచును)

నిర్మ—(మూతిపైఁ బడిన ద్రావకపుఁ జుక్కలవల్ల నిద్ర చెడి, మూలుగుచు చేయి విసరగా, సీసా పోయి దూరమునఁ బడినంతట నులికిపడి కన్నులు తెఱచి) నాచేతి కిప్పు డేమిటి చెపుమా తగిలినది ! (పెదవులు చప్పరించి) నానోటి కేదియో క్రొత్తరుచి వచ్చినదే !

రంగ— (భయ కంపములతో) వోయి దేవుడా- యేం బుద్ది! వొక్క షుక్కతో మష్టుం దంటే- వొప్పుకు షక్కా వచ్చాను! షావా లేదు మన్నూ లేదు! నావంక షూడకముందే నాగుబాఁవులాగ షక్కా పోయి- బయట పడితినా బతుకుతాను! (నిష్క్రమించును.)

నిర్మ—(ఉలికిపడి) ఎవరు వారు!- ఎవరు వారు! (చివాలున లేచి కూర్చుండి) అమ్మయ్యో! దొంగ! (అని మంచముదిగి నిలుచుండి) అదిగో- వీధితలుపు చప్పు డగుచున్నది! అన్నన్నా! దాఁటిపోయినాఁడు గదా!... కన్నులు తిరుగుచున్నవి కారణ మేమి చెపుమా! కడుపులో వికారముగఁ గూడ నున్నది!...... నాలుక చిమచిమ లాడుచున్నది- నరములు బిగు వగుచున్నవి! భయముచేతనా?- నా మనసు నలుసంత కూడఁ జెదర లేదే!... ఆఁ! తెలిసినది! ఆ వచ్చిన దొంగ తన యిచ్చవచ్చి నట్లిల్లంతయుఁ జిక్కఁబెట్టుటకై నా కేదో మత్తుమందును బ్రయోగించు

చుండఁగా- నా కెట్లో ప్రబోధము కలిగినది! ఈ నోటిరుచియు, నీ వికారము దానివే! అగుఁగాక- కాసింత మగత తప్ప- నది మఱేమి చేయఁ గలదు! వీధితలుపునకు గడియవేసి వచ్చి, విశ్రాంతిగాఁ బరుండి నిద్రపోయెదను. (నడువఁబోయి తూలి) కాళ్ళు తడబడు చున్నవే!...కన్నులుకూడ మిరుమిట్లు గొలుపుచున్నవి!...అంతకంతకు వికారమును నధిక మగుచున్నది!- ఆదీపము వేయిదీపములుగా నగపడుచున్న దే! ఈ వికారముతో వీధిగుమ్మమువఱకును వెళ్ళి రాఁగలనా!......నాలుక పిడుచకట్టినది!...పాడుమందు ప్రాణములు తీయదు గదా! కక్కుగారు గ్రామమున లేరు- రంగి రాలేదు- ఇప్పు డేమిటి చేయఁదగినది? ఇట్టి నిశీధి సమయమున నెవరు పలుకుదురు! కట కటా! భర్తృయోగము లేని భార్య బ్రతు కింతటిదే గదా! (ఆవేశముతో) ఓసి- మాయమద్యరసమా! మా పాలిటి శనిగ్రహామవై- మా కెట్టి యెడబాటును గలిగించితివే! పుట్టిన వంశమా- పూజ్యమైనది; చదివిన చదువా- సమగ్రమైనది; నడచిన నడతా- నాదర్శమైనది;- అట్టి నా యనుంగు భర్తనే యిట్టు లధోగతి పాలు చేయఁ గలిగిన నీ వికనెవ్వరి నేమి చేయఁ జాలవు! ఏ నేరము నీవు లేకుండజరిగినది! ఏ హత్య నీవు లేకుండ నాగినది! ఏ సంస్థానము నీవు కాలు పెట్టకుండ నెగిరి పోయినది! కడగండ్లు నీకొఱకు; కన్నములు నీకొఱకు; అప్రమాణములు నీకొఱకు, హత్యలు నీకొఱకు; మోసములు నీకొఱకు; వేసములు నీకొఱకు! ప్రభువు నీ దాసుఁడు, పరిచారకుఁడు నీదాసుఁడు; పండితుడు నీదాసుఁడు; పామరుడు నీదాసుఁడు నీయధికార మెంత నిరంకుశమైపోయిన దే! ఓ ప్రభువులారా! ఓ ప్రజా ప్రతినిధులారా! ఓ సంఘ సంస్కర్తలారా! ఓ స్వారాజ్యవాదులారా! ఈ మద్యరసమువల్ల- ఈ మహా మారివల్ల- ఈ దుర్విషమువల్ల- ఈ దుష్ట జాడ్యము వల్ల- ఈ యగ్ని ద్రావకమువల్ల, ఈ హాలాహాలమువల్ల- ఈ పీడవల్ల, ఈ పిశాచము

వల్ల- ఎన్నిసంసారము లేటఁ గలిసిపోవుచున్నవో యెన్నఁ డేని గమనించితిరా? కాళ్ళు తోడుకొనిపోయి, కన్నులు దించుకొనిపోయి వడఁకెడి యవయవములతో, వంకరపోయిన పార్శ్వములతో; క్రుంగిన మూపులతో, క్రుళ్ళిన శ్వాసకోశములతో; మనసు చెడి, మతిపోయి అన్నమో రామచంద్రా యని యెంద అల్లాడుచున్నారో యెప్పుడైన పరికించితిరా? ఎన్నికొంపలలో దరిద్రదేవత తాండవ మాడుచున్నదో- ఎందఱిభార్య లెంగిలేసి బాములువడుచున్నారో, ఎందఱి బిడ్డ లన్నమునకు మొగమువాచి యెంగిలియాకులు నాకుచున్నారో- ఏపాటియైన పరిశీలించితిరా? ఎందఱి మూలుగులలో, తండ్రులు త్రాగిన మద్యవిషము మజ్జతో మిళితమై, యెంతలేసి రోగములకుఁ గారణ మగుచున్నదో- ఎంద ఱీ పాపిష్ఠి త్రాగుడువల్ల వడుచు తనమునందె- పంశీ, యెండీ; మాడి, మగ్గి- యకాలమృత్యువున కాహార మగుచున్నారో యరసితిరా? ఏఁటేఁట నెన్నేసికోట్లు త్రాగుడుక్రింద దగ్ధమగుచున్నవో- ఎన్నేసి నేరములు, ఎన్నేసి హత్యలు త్రాగుడువల్లఁ దటస్థము లగుచున్నవో పరిగణించితిరా? ఏమి యన్యాయ మిది?- ఎంత విరుద్ధమిది!...తల్లి భరతమాతా! తపోనిధులం గన్న నీ వీ త్రాగుబోతుల నెట్లు కనుచుంటి వమ్మా! మానవనిధులం గన్న నీ వీ మధుదాసుల నెట్లు కనుచుంటి వమ్మా! టర్కీ- యీజిప్టులలో త్రాగుడే లే దఁట!- అమెరికాలో మద్యసార మమ్మినవానికిని, కొన్నవానికిని గూడ నాఱేసి నెలలు శిక్ష యట!- బల్గేరియాలో త్రాగినవానిని బసువుతో జత చేసి, పట్టణమంతయు నూరేగింతు రఁట! త్రాగుడు ధారకముగా నొప్పువారె తన్నివారణమున కై యిట్లు పాటుపడుచుండ- మద్యపానము మహాపాతకముగ నెంచు నీబిడ్డ లింత మందభాగ్యులై రేమమ్మా! పరమేశ్వరా- తండ్రీ! ప్రభువులు పరార్థ కాములు- ప్రజాప్రతినిధులు ప్రసాదరాములు- సంఘసంస్కర్తలు సభా వాక్శూరులు-

స్వరాజ్యవాదులు సహాయదూరులు- అట్టివారివల్ల నీ యంటురోగము వారించుట యసంభవము. మద్యప్రశ్రయమున: మనుజులకు విషము పోయుట యని యెఱుఁగని మా వర్తకులు- బ్రాందిలో క్లోకేయిను; సారాయిలో నుమ్మెత్త చూర్ణము; కల్లులో కుంకుడు నురుగుఁ గలిపి- ప్రజల ప్రాణములు తీయు మా వర్తకులు - ఈ పాడువ్యాపారమును బరిత్యజింతు రనుట కల్ల ! తమ దారిద్ర్యమునకు త్రాగుడే కారణమని యెఱుఁగని మా ప్రజలు- తమ యాయువు త్రాగుడువల్లనే తరిగిపోవుచున్న దని యెఱుఁగని మా ప్రజలు - దినమునకు కోటిరూప్యములు దీనిక్రింద దగ్ధమగుచున్నవని యెఱుఁగని మా ప్రజలు- తమదేశమున కిది గొప్ప తలవంపని యెఱుఁగని మా ప్రజలు - ఈ పాపిష్టివ్యసనమును బహిష్కరింపఁ గలుగుట యసంగతము ! నీ కటాక్షము తప్ప యీ పీడ నిర్మూలమగుటకు దారి లేదు. స్వారాజ్యముకొఱకు నిన్నర్థింపను- సాయుజ్యముకొఱకు నిన్ను బ్రార్థింపను- మాదేశమున మద్యపానము లేకుండఁ జేసితివా- మాకు కోటిస్వరాజ్యములుఁ గోటిసాయుజ్యములుఁ బ్రసాదించునట్లు భావించెదను ! (ఆయాసముతో) అమ్మయ్యా! హామ్మయ్యా ! హాఁ ! హాఁ ! (మైకముతో) ఏమిటి నే నివు డన్నమాట ! ఎక్కడికి చెపుమా నే నివుడు వెళ్ళుచున్నది !...నా ఒంటినిండ నల్లులో- చీమలో ప్రాకుచున్నవి !... నా తలవెంట్రుక లెవరో పీకుచున్నారు ! నా యొడ లెవరో రక్కుచున్నారు. ...అదుగో నా ప్రాణేశ్వరుఁడు ! అమ్మయ్యా !- వచ్చినారా ! ఆఁ ! ఆఁ ! ఆఁ ! అంటకుఁడు ! (అని రెం డడుగులు వెనుకకు వేసి- అంతలో మంచము తగిలి- యట్టె దానిపైఁ గూలఁబడి) అయ్యో ! నో రెండిపోవుచున్నది! ..అబ్బా ! దాహము ! దాహము ! హా ! పరమేశ్వరా ! (అని వెనుకకుఁ బడి) పరమేశ్వరా ! పా ! పా !

తెర పడును.

ఇది నవమాంకము.

# మధుసేవ

## దశమాంకము

### మొదటి రంగము

ప్రదేశము:—పోలీసుస్టేషను.

ఇనస్పెక్టరు—(ఆయాసముతోఁ బ్రవేశించి) అబ్బా ! యేమి యవస్థ !- యేమి బ్రతుకు ! పోలీసు నవుకరీకంటె- పొగచుట్టల దుకాణము మంచిది ! నిర్మలాంబను రఘునాథరావుగారే చంపి యుందు రను నిశ్చయాభిప్రాయముతో, దొరగా రాయనను తోడనే యరెస్టు చేయించి- సాక్ష్యము సమకూర్పు మని నన్ను నలిపివేయుచున్నాఁడు ! సాక్ష్య మంత చౌకగా దొరకునా ? విశ్వాసరావుగారు వచ్చినఁ గొంత చిక్కు విడవచ్చునని యున్నది ?- యింతవఱ కాయన రానే లేదు ! ఇప్పు డేమిటి చేయఁ దగినది ?- (అని బల్లకడ కూర్చుండి- యేవో కాగితములు తీసి చూచును.)

విశ్వా—(ప్రవేశించి) విధివిధాన మెంత విపరీత మయినది ?

సీ. పరిపూత చరితుఁడై • బరఁగు వాఁ డిటు మద్య
పానంబునకుఁ బాలు • పడుట యేమి !
సతతంబు విబుధసం • గతి నొప్పువాఁ డిటు
తులువలతోఁ జెల్మి • సలుపు టేమి
పరకాంత లెదురైనఁ • బెడ కేగువాఁ డిటు
వారకాంత గృహంబు • పట్టు టేమి !
తోరంపు సిరులతోఁ • దులఁదూఁగువాఁ డిటు
తలమించు ఋణములఁ • దగులు టేమి !

అట్టి సంస్థానమును దెగ • నమ్మ నేమి!
నిజసతినిఁ జంపె ననుఘోర • నింద యేమి!
కాలి సంకెళ్ళతోఁ జెఱ • సాల యేమి!
కట్ట! యిది యెల్ల విధిచేష్ట • కాక యేమి! (పరిక్రమించును)

ఇన—(తలయెత్తి చూచి) ఇదిగో! యెప్పుడు వచ్చినారు! ఇప్పుడే మీ మాట యనుకొన్నాను. కూర్చుండుఁడు. ఇన్నాళ్ళుచేసినారేమి?

విశ్వా— (కూర్చుండి) నిలుకడగా నే నొకచోట నిలువక పోవుటచే, నిన్నటి యుదయమువఱకు మావారి యుత్తరములు నాకందినవికావు. సంగతి తెలియఁగానే, సాపాటుకూడ చేయకుండ బయలుదేరి- రాత్రి పదిగంటల కింటికి వచ్చినాను.

ఇన—రాత్రియే వచ్చినారా? రాఁగానే న న్నేలఁ గలిసికొన లేదు?

విశ్వా—ముందు రఘునాధరావుగారితో ముచ్చటించువఱకు నీ వ్యవహారమునందుఁ బ్రవేశించుట కిష్టము లేక- అరుణోదయము కాఁగానే చెఱసాలకు వెళ్ళి, ఆయనతో మాటాడి- యిటు వచ్చినాను.

ఇన—ఆలాగునా? అట్లయిన నేదో విశేష ముండవలెను.

విశ్వా—ఆయన నిర్దోషి- అదియే విశేషము.

ఇన—అని మీ రెట్లు చెప్పఁ గలరు?

విశ్వా—అట్టి దృఢవిశ్వాస మాయన నాకుఁ గలుగఁ జేసినారు.

ఇన—మాటలచేతనా - నిదర్శనములచేతనా?

విశ్వా—మీ రేమి నిదర్శనములనుబట్టి యాయన నరెస్టు చేసినారు?

ఇన—ఆమె మరణమువలన లబ్ధిని బొందువాఁ డాయన. ఆయన యిప్పు డర్థకాముఁ డై యున్నాఁడు. అందువలన, నిది, యాయన పనియె యని యభిప్రాయపడవలసి వచ్చినది.

విశ్వా—ఆత్మహత్య చేసికొనఁ దలఁచిన ట్లామె స్వయముగా వ్రాసిన యుత్తర మొకటి యామె శయ్యపై దొరికిన దఁటగా?

ఇన—దొరికినది. తనపై ననుమానము కలుగకుండుటకై దానిని రఘునాధరావుగారే కల్పించినారని మాదొరగారి యభిప్రాయము.

విశ్వా—మీ యభిప్రాయము?

ఇన—ఆమె యాత్మహత్య చేసికొనియుండు ననియే నాయభిప్రాయము.

విశ్వా—అట్లయిన మీయభిప్రాయము కూడ సరియైనది కా దనియే నా యభిప్రాయము. అయిన నాయుత్తరమేదీ చూతము.

ఇన—ఇదిగో- ఇచ్చటనే యున్నది. (అని యుత్తరము తీసియిచ్చెను.)

విశ్వా—(విప్పి చూచి, యుల్కిపాటుతో) ఇదిగో! యీశ్వరవిలాసమనగా నిది. ఈ యుత్తరము నిర్మలాంబ వ్రాసినది కాదనియే కాక-యెవరు వ్రాసినదో కూడఁ దెలిసిపోయినది.

ఇన—(ఆత్రముతో) ఏమిటీ! ఎవరు- ఎవ రా వ్రాసినవారు?

విశ్వా—ఇం కెవరు- కస్తూరి! దాని యుత్తరములు నాకడ తట్టెఁడున్నవి. సంగతులు గూడఁ జదివి చూతము- "నాభర్త వేశ్యాలోలుడై నన్ను విడిచి పెట్టుటచేత, నాజీవితముపై నసంహ్యాము పుట్టి, ఆత్మహత్య చేసుకొనుటకు సంకలిపించితిని. నా చావునకు నేనే భాద్యురాలను- "నిర్మల" (అని పఠించి) చిత్తగించి నారా? "అసహ్యాము" అనుటకు- "అసంహ్యాము" అనియు- "సంకల్పించితి" ననుటకు- "సంకలిపించితి" ననియు "బాధ్యురాల" ననుటకు- "భాద్యురాల" ననియు- నిర్మలాంబ నిద్దురలోఁగూడ వ్రాయదు. కాఁబట్టి, యిది కస్తూరి వ్రాసినదే యని నేను గట్టిగాఁ జెప్పఁగలను.

ఇన—ఉద్దేశము?

విశ్వా—ఉద్దేశమునకు మన యూహా లవసరము లేదు. నిర్మలాంబ కలచేత నిమ్మపండుఁ జూపి, సగ మాస్తియైన వ్రాయించుకొని రమ్మని శర్మయుఁ, గస్తూరియు శతవిధముల పోరినట్లును - తాము నిరాకరించినట్లును - రఘునాధరావుగారు చెప్పుచున్నారు.

ఇన—సరే, సరే - సంగతి యిప్పుడు బోధపడినది. ఆమెను గడతేర్చి నచో- ఆస్త్రియంతయు రఘునాధరావుగారి పర మగు ననియు, అప్పుడు దామిట్టె యుంకించుకొనవచ్చు ననియు నుద్దేశించుకొని

పోలీసు వారిని పొరపెట్టుటకై యీ యుత్తరమును గల్పించి- యీ పని చేసి యుందురు. ఆస్థలమునందుఁ గానవచ్చిన యడుగుల గుర్తులనుబట్టి, యీయింటఁ బురుషుఁ డెవ్వఁడో ప్రవేశించి నట్లు కూడ స్పష్టపడుచున్నది. అందువల్ల నా ప్రవేశించినవాఁడు శర్మ కావలెను. అయితే, అతఁ డంత సాహసము చేయఁగలడా !

విశ్వా—ఆసంగతి యాలోచింతము. ఆయింటదొరకిన వేమేమిటి?

ఇన—ఒక కాళీ విషపుసీసా, యొక బ్రాందిసీసా, యొక యుత్తరీయము.

విశ్వా—ఆ యుత్తరీయ మేదీ ?

ఇన—గుర్తు పట్టించుని ... త్తము చాకలి గూడెమునకుఁ బంపినాను. అదుగో; ఆతఁడును వచ్చినాడు. ఏమి జగ్గప్పా! యేమైన తేలినదా ?

జగ్గ—(ప్రవేశించి విశ్వాసరావును జూచి వెనుకకు తగ్గును.)

ఇన—సందేహ మక్కఱ లేదు-చెప్పవచ్చును-ఎవరైన గుర్తించినారా ?

జగ్గ—వీరిచాకలి చూచి- మా పంతులుగారి దని చెప్పె డంకి.

విశ్వా—మా చాకలి నా దని చెప్పినాఁడా!- ఏదాయుత్తరీయము ?

జగ్గ—(చంకలోని మడత తీసి బల్లపై నుంచును.)

విశ్వా—(విప్పిచూచి) హాయి ! హాయి ! దొరికిపోయినాఁడు దొంగ !

ఇన—(జగ్గప్పతో) సరే వెళ్లుము (అతడు పోఁగానే) ఎవఁ డెవఁడు?

విశ్వా- ఇం కెవఁడు!- మీ యింటిచుట్టమే ! రంగఁడు ! వీనిభార్య మొన్నటివఱకును మాయింటఁ బరిచారికగా నుండెడిది. దాని యెడ నాకుఁగల నమ్మకమునుబట్టి యీమధ్య దానిని నిర్మలాంబ కడ నుంచినాను. ఆరాత్రి యది వండుకొనుటకు వెళ్ళలే దని తెలిసి- కారణ మే మని యడుగ- తమ్మావరములో నున్న తన తల్లికిఁ బ్రాణముమీఁదికి వచ్చినట్లు చెప్పగా- తా నా రాత్రి యచటికి వెళ్ళినట్లును- తల్లి సుఖముగా నే యున్నందున మఱునాఁ డే వచ్చివేసినట్లును- జెప్పినది. దాని కా కల్లవార్త చెప్పినవా డెవఁడో తట్టినదా?- రంగడు !

ఇన—అలాగుననా! అయితే- యుత్తరీయముసంగతి యేమిటీ ?

విశ్వా—అన్నట్లా సంగతి చెప్ప లేదు. ఈ యుత్తరీయము నాదే. ఈ పాపిష్ఠు డొకనాడు వచ్చి ప్రాకులాడ- నేనే యిచ్చినాను.

ఇన—అట్లయిన నిఁక సందేహ మక్కరలేదు. అతఁడే హంతకుఁడు. వాఁడు శర్మవెంటఁ దిరుగుచుండఁగా వందసారులు చూచినాను. అదిగాక- యాయింటఁ బ్రవేశించినవాని యడుగులగుర్తులు నోటు చేసినాము. రంగని గుర్తులు మాయొద్ద నిదివరకే యున్నవి. రెంటిని బోల్చి చూచిన సంగతి క్షణములోఁ దేలఁ గలదు. శర్మ వానిని సంధించి యుండును. శర్మపై నిందులకు సాక్ష్యము సంపా దింపవలెను. అన్నట్లొక సంగతి చెప్ప లేదు - విషపు సీసామీద "స్మిత్ అం॰ కో- మెడ్రాస్" అని యుండుటచేఁ- బ్రత్యేక మొకనిని వారికడకుఁ బంపినాము. అతఁ డీపూఁటతప్పక రావలెను.

విశ్వా—చాల చక్కనిపని చేసినారు. ఎప్పుడు మీ వాయిదా ?

ఇన—ఎప్పుడోనా? రేపే! ఈ పూఁట మీరు రాకపోయినచో - రంగని పిడుగు రఘునాథరావుగారిని గొట్టుకొని పోవలసినదే !

విశ్వా—సాక్ష్య మేదీ ?

ఇన—పోలీసువారికి సాక్ష్యలోపమును- పోలేరమ్మకు నైవేద్యలోపము నా ! అన్నట్లు, పాప!- మాయన యెట్లున్నారో చెప్పలేదు.

విశ్వా—చెప్పుట కేమున్నది- ఈ పదునైదు దినములలోఁ బదునై దేండ్ల మార్పు కలిగినది. వెనుకటి వ్యసనము లన్నియు వేళ్ళతో గూడ హరించినవి ! భార్యకొఱ కాయన పడుచున్న పరితాపము చూచిన పాషాణములుకూడ నీరగును ! ముందుసంగతి యేమిటి ?

ఇన—చెప్పనా ? ఈపూఁట శర్మను, కస్తూరిని, రంగని అరెస్టు చేసెదము- ఈ రాత్రి మూఁడుపులు మేము వచుకుకొనెదము. క్రొత్త చార్జీషీటుతో రేపు కోర్టులో నిలిపెదము.

విశ్వా—అట్లయిన, నే నింటి కేగి భోజనము చేసి అఱగంటలో వచ్చెద.

(అని లేచుచుండఁగా దెర పడును.)

# రెండవరంగము

ప్రదేశము:—మేజస్ట్రీటు కచేరి.

ప్రవేశము:—ధర్మపీఠమున మేజిస్ట్రీటు—ఎదుట నొకప్రక్క కుర్చీలో ప్రాసిక్యూటరు—రెండవప్రక్క పంతులు, (రఘునాథరావుగారివకీలు) నాయఁడు. (కస్తూరి శర్మల బారిష్టరు) విశ్వాసరావు, వెంకటేశము-దూరమున బోనులో- రఘునాథరావుగారు, శర్మ, కస్తూరి, రంగఁడు.

మేజి—ఆల్ రైట్ ! ఇఁక మీ యార్గ్యుమెంట్సు కానీయవచ్చును.

ప్రాసి—(లేచి) సిత్తం. సిత్తం. ఈకేసులో నేను నిండా శప్పేదేవిర్తా ముద్దాయీలమేల యెవిడెన్సు పూరాగా ప్రూవై వుండే సమాచారం కోర్టువారికిదా తట్టే వుండవలా. ఫ్స్ట్. క్రైమ్ నడిచిన సోట్లో చిక్కిన సీసా మేల "ప్రస్సిక్ ఆసిడ్, పాయిజన్, స్మిత్ అండ్ కో, మెడ్రాస్" అని వుండింది. ఆయమ్మ చచ్చుకునింది ప్రస్సిక్ ఆసిడ్ మూలంగాదానాని, యెగ్జామిన్ చేసిన డాక్టర్ సర్టిఫై చేసివుండె. స్మిత్ అండ్ కో యేజెంటు- కరండు ముద్దాయి శర్మ- ప్రస్సిక్ ఆసిడ్ పంపేదిగా తమరికి లెటర్ రాశిందీ- తమురు పోస్టుగుండా దాన్ని డిశ్పాచ్చి చేసిందీ- చెప్పిందే కాక- శర్మ లెటరూ, వారి డిశ్పాచ్ బుక్కూ- కోర్టులో దాఖల్ చేసిదా వుండె శర్మ రైటింగుతో కంపేర్ పెశితే- ఆ లెటర్ శర్మ రాశిందిగాదానా నిచ్చితం వశింది. ఆ యాసిడ్ పార్శిల్ శర్మవాడుగా యెత్తుకొనింది- పోస్టుప్యూన్ సాచ్చెంవోళ్లప్రూవు కాపడింది. ఇందుల్నిపట్టి, ఆయమ్మ చచ్చుకునింది ప్రస్సిక్ ఆసిడ్ వొల్లానీ- దాన్ని రప్పించింది శర్మవాడనీ ప్లెయిన్‌గా తెలిశయింది. క్రైమ్ నడిచినసోట్లో కానవొచ్చిన క్లాత్- రంగడు వాడి దని విస్వాసరావువారి యెవిడెన్సువొల్ల ప్రూవయింది. ఆదినం రాత్రి, టూవోక్లాక్ యాళ, రంగడువాడు, దీ సేమ్ స్ట్రీట్‌గుండా, పైమేల బట్ట లేందీ, జల్దీగా వూడుస్తూన్నసమాచారం

విశ్వా—అన్నట్టా సంగతి చెప్ప లేదు. ఈ యుత్తరీయము నాదే. ఈ పాపిష్ఠు డొకనాడు వచ్చి ప్రాకులాడ- నేనే యిచ్చినాను.

ఇన—అట్లయిన నిఁక సందేహ మక్కరలేదు. అతఁడే హంతకుఁడు. వాఁడు శర్మవెంటఁ దిరుగుచుండఁగా పందసారులు చూచినాను. అదిగాక- యాయింటఁ ప్రవేశించినవాని యడుగులగుర్తులు నోటు చేసినాము. రంగని గుర్తులు మాయొద్ద నిదివరకే యున్నవి. రెంటిని బోల్చి చూచిన సంగతి క్షణములోఁ దేలఁ గలదు. శర్మ వానిని సంధించి యుండును. శర్మపై నిందులకు సాక్ష్యము సంపాదింపవలెను. అన్న ట్లొక సంగతి చెప్ప లేదు - విషపు సీసామీద "స్మిత్ అం॰ కో- మెడ్రాస" అని యుండుటచేఁ- బ్రత్యేక మొకనిని వారికడకుఁ బంపినాము. అతఁ డీపూఁటతప్పక రావలెను.

విశ్వా—చాల చక్కనిపని చేసినారు. ఎవ్వుడు మీ వాయిదా ?

ఇన—ఎప్పుడో నా? రేపే! ఈ పూఁట మీరు రాకపోయినచో - రంగని పిడుగు రఘునాధరావుగారిని గొట్టుకొని పోవలసిన దే !

విశ్వా—సాక్ష్య మేదీ ?

ఇన—పోలీసువారికి సాక్ష్యలోపమును- పోలేరమ్మకు నైవేద్యలోపము నా ! అన్నట్లు, పాప!- మాయన యెట్లున్నారో చెప్పలేదు.

విశ్వా—చెప్పుట కేమున్నది- ఈ పదునైదు దినములలోఁ బదునైదేండ్ల మార్పు కలిగినది. వెనుకటి వ్యసనము లన్నియు వేళ్ళతో గూడ హరించినవి ! భార్యకొఱ కాయన పడుచున్న పరితాపము చూచిన పాషాణములుకూడ నీరగును ! ముందుసంగతి యేమిటి ?

ఇన—చెప్పనా ? ఈపూఁట శర్మను, కస్తూరిని, రంగని అరెస్టు చేసెదము- ఈ రాత్రి మాముద్దుపులు మేము వడుకుకొనెదము. క్రొత్త చార్జిషీటుతో రేపు కోర్టులో నిలిపెదము.

విశ్వా—అట్లయిన, నే నింటి కేగి భోజనము చేసి అఱగంటలో వచ్చెద. (అని లేచుచుండఁగాఁ దెర పడును.)

# రెండవరంగము

ప్రదేశము:—మేజిస్ట్రేటు కచేరి.

ప్రవేశము:—ధర్మపీఠమున మేజిస్ట్రేటు—ఎదుట నొకప్రక్క కుర్చీలో ప్రాసిక్యూటరు—రెండవప్రక్క పంతులు, (రఘునాథరావుగారివకీలు) నాయఁడు. (కస్తూరి శర్మల బారిష్టరు) విశ్వాసరావు, వెంకటేశము- దూరమున బోనులో- రఘునాథరావుగారు, శర్మ, కస్తూరి, రంగఁడు.

మేజి—ఆల్ రైట్! ఇఁక మీ యార్గ్యుమెంట్సు కానీయవచ్చును.

ప్రాసి—(లేచి) సిత్తం. సిత్తం. ఈకేసులో నేను నిండా శప్పేదేవిర్తా ముద్దాయీలమేల యెవిడెన్సు పూరాగా ప్రూవై వుండే సమాచారం కోర్టువారికిదా తక్టే వుండవలా. వుష్టే. క్రైమ్ నడిచిన సోట్లో చిక్కిన సీసా మేల "ప్రస్సిక్ ఆసిడ్, పాయిజన్, స్మిత్ అండ్ కో, మెడ్రాస్" అని వుండింది. ఆయమ్మ చచ్చుకునింది ప్రస్సిక్ ఆసిడ్ మూలంగాదానాని, యెగ్జామిన్ చేసిన డాక్టర్ సర్టిఫై చేసివుండె. స్మిత్ అండ్ కో యేజెంటు- కకండు ముద్దాయి శర్మ- ప్రస్సిక్ ఆసిడ్ పంపేదిగా తమరికి లెటర్ రాశిందీ- తమురు పోస్టుగుండా దాన్ని డిశ్పాచ్చి చేసిందీ- చెప్పిందే కాక- శర్మ లెటరూ, వారి డిశ్పాచ్ బుక్కూ- కోర్టులో దాఖల్ చేసిదా వుండె శర్మ రైటింగుతో కంపేర్ పెశితే- ఆ లెటర్ శర్మే రాశిందిగాదానా నిఛ్చితం వశింది. ఆ యాసిడ్ పార్శిల్ శర్మవాడుగా యెత్తుకొనింది- పోస్టుప్యూన్ సాచ్చెంవోల్ల ప్రూవు కాపడింది. ఇందుల్నిపట్టి, ఆయమ్మ చచ్చుకునింది ప్రస్సిక్ ఆసిడ్ వొల్లానీ- దాన్ని రప్పించింది శర్మవాడనీ ప్లెయిన్‌గా తెలిశయింది. క్రైమ్ నడిచినసోట్లో కానవొచ్చిన క్లాత్- రంగడు వాడిదని విస్వాసరావువారి యెవిడెన్సువొల్ల ప్రూవయింది. ఆదినం రాత్రి, టూవోక్లాక్ యాళ, రంగడువాడు, దీ సేమ్ స్ట్రీట్‌గుండా, పైమేల బట్ట లేందీ, జల్దీగా పూడుస్తూన్నసమాచారం

తాను సవాల్ సేసిన సమాచారం- బీట్ కానిస్టేబుల్ ఫోర్ హండ్రెడ్ ఫార్టీ సెవెన్ సాచ్చెం సొల్లే. క్రైమ్ నడిచిన సోట్లో కానవొచ్చిన వోణీ, రంగడువాడిదిగా, విస్వాసరావువారివోల్ల రుజువ్ పడింది. ఆసోట్లో కానపడ్డ ఫూట్ మారుక్సులు రంగడు వాడివిగాదానా రుజువ్ పెట్టాం. రంగడువాడు సెవెన్ క్రైమ్సు ఫయినూన్- ఫయివ్ క్రైమ్సు రిగరస్ యింప్రిజన్మెంటూ అనుభ గించిన వోల్డు అఫెండర్ దా అయి వుండాడు. శర్మవాడికీ రంగడు వాడికీ నేనా దోస్తీ వుండేదిగా- త్రీహండ్రెడ్ ట్వెంటీటూ సెప్పి అయింది. ఇందుల్ని పట్టి ఆయమ్మకు పాయిజన్ అప్లైచేసిన వాడు రంగడుదా అయి వుండింది- వాణ్ణి అప్పాయింటు చేసింది శర్మవాడుదా అయివుండింది- కోర్టువా రవశ్యం నమ్మితీరవలా. అదీ వుణ్ణి. ఆయమ్మ మంచంమేల చిక్కిన లెటర్ కస్తూరి రాశిం దిగా, విశ్వాసరావువారు దాఖల్ పెట్టిన లెటర్సువోల్ల ప్రూవు కాపడింది. కస్తూరి రగునాతరావుగారు పెట్టుకున్న లంజై వుం డింది. రగునాతరావువారు సొత్తంతా సెలవుసేసుకుని, దుడ్డు కోసం నిండా సంకటం అనబగిస్తుండారు. ఆయమ్మ చచ్చుకునిందే ఆయనకు వాశి. ఆయనకు వాశయిందే వీరికి వాశి. అందుల్ని పట్టి, రగునాతరావువారిమేల డైరెక్టు యెవిడెన్సు లేకుండా పోయి నానాటికీ- యీ కానస్పిరస్సిలో ఆయనకూడా చేరివుండేదిగాదానా తలచి తీరవలా. కాబట్టి, ముద్దాయీల్ని కనిట్ సేసేదానిగ్గా- కోర్టువార్ని నిండా కోరి పారిదించుకుంటుండాం (కూర్చుండును).

మేజి—(ఏమో వ్రాసికొని) పంతులుగారు! మీరు?

పంతు—(లేచి) అయ్యా! మా ముద్దాయి రఘునాధరావుగారి మీఁద సాక్ష్య మేమియు లేన ట్లొప్పుకొని ప్రాసిక్యూటరుగారు నా కేమియుఁ బని లేకుండఁ జేసినారు. అయిన నొకటి రెండు విషయములలో నాయన కొంచెము పొరపడినారు. ఈ కుట్రలో మా ముద్దాయిగారు చేరియున్నా రనుట కించుకయు నవకాశము

లేదు. కాలకర్మవశమునఁ గస్తూరి సంబంధము కలిగినను- భార్య యెడ నాయన ప్రతికూలబుద్ధి కలవారు కారు. ఆయనకు ధన మవసర మైనచో నామె నడిగియే తీసికొనఁగలరు. ఆయన యడిగినచో నామె యద్దు చెప్పునదియుఁ గాదు. లోఁగడ నొకసారి యామె తనయొద్దనున్న మూడు వేల రూపాయల నాయన యడుగకుండనే యిచ్చినట్లు విశ్వాసరావుగారు చెప్పియున్నారు. ఇట్టి స్థితిలో, నట్టియిల్లాలి నాయన చంపించినా రనుటకంటె నసంగత మింకొకటి యుండదు! ఆమెతండ్రిగారివల్ల నామెకు వచ్చిన యాస్తి నెట్లయిన వ్రాయించుకొని రావలసిన దని శర్మయుఁ- గస్తూరియు రఘునాథరావుగారిని సర్వవిధముల వేధించినట్లును ఆయన నిరాకరించినట్లును విశ్వాసరావుగారి సాక్ష్యమువల్ల విస్పష్టముగాఁ దెలియుచున్నది. ఆయనద్వారా తమయాట సాగ కపోవుటచే- నామెను గడతేర్చినచో నయ్యాస్తి కాయన హక్కు దారు లగుదు రనియు, నప్పుడు దా మాపోశనము పట్టవచ్చు ననియు నూహించి, శర్మయుఁ గస్తూరియుఁ గలిసి, సాహసికుఁడైన రంగనిచే నీహత్య జరిపించినట్లు స్పష్టపడు చున్నది. కాఁబట్టి ఘనతవహించిన కోర్టువారు, దోషరహితు లైన మా ముద్దాయి గారిని తోడనె విడుదల చేయఁగోరుచున్నాను. (కూర్చుండును.)

మేజి—(ఏమో వ్రాసికొనును)

వెంక—(మెల్లగాఁ) శారిష్టరు బావయ్యగారూ! వీజుకోసం ఆలోచించక బింకంగా పని చెయ్యాలి సుఁవండి! పాతస్నేహం పరాకుప డొద్దని మాయక్కయ్య మీతో మరీమరీ చెప్పమంది.

నాయు—(మెల్లగా) సాక్షుల నెల్లా సాగదీశానో చూచావా? ఆర్గ్యుమెంటులో మేజస్ట్రీటు గారి నెల్లా హడల గొట్టేస్తానో చూడు! ఒకవేళ కమిట్ చేస్తా డనుకో- సెషన్సుకోర్టులో క్షణాలమీద విడిపిస్తాను! అక్కడా కాకపోతే- అపీల్లో అరనిమిషం పని!

మే—ఏమి నాయుఁడుగారు! మీరా లేమి చెప్పెదరు?

నా—(లేచి) అయ్యా! ప్రాసిక్యూటరుగారూ, పంతులుగారూ చెప్పినదానిలో పాయింటు నిల్లండి. సాక్షులు చెప్పినమాటల్లో సంబంధం సైఫరండి. పోలీసువారు మొదట, మొదటిముద్దాయినిమాత్రమే అరెస్టు చేశారు. మిగతవారిని అక్రమంగా నిన్న సాయంకాలం చేశారు. ఇది క్రిమినల్ ప్రొసీజరుకు కేవలం విరుద్ధం. (బల్లగుద్దుచు) ఈ వొక్క పాయింటుమీదనే యీ కేసు త్రోసివెయ్యబడవలసి వుంది. స్మిత్ అండ్ కో వారి యేజంటు దాఖలుచేసిన వుత్తరం శర్మగారు వ్రాసింది కాదని నేను స్పష్టంగా చెప్పగలను. శర్మగారి దస్తూరికిన్నీ దానికిన్నీ సంబంధమే లేదు. శర్మగారు దాన్ని వ్రాస్తుండగా చూచిన సాక్ష్యం అసలే లేదు. అందువల్ల, ఆవుత్తరం ఆయనపేరుబెట్టి యితర్లు వ్రాసిందిగా అవశ్యం నమ్మవలసివుంది. అదిగాక శర్మగారు ఎల్. ఎమ్. పీ. ప్యాసయినవారు. అటువంటివారిటువంటిపనికి అంగీకరిస్తారనడం అన్యాయం. నిర్మలాంబ మంచంమీద దొరికిన లెటరు కస్తూరి వ్రాసిందనడానికి కారణా లేమీ లేవు. దాన్ని కస్తూరి వ్రాస్తుండగా చూచినసాక్ష్యం లేదు. కస్తూరి యుత్తరాలని విశ్వాసరావుగారు దాఖలుచేసిన కాగితాలన్నీ కల్పితాలు. పోలీసువారూ విశ్వాసరావుగారూ కలిసి యీఫోర్జరీ చేసివుంటారు—

ప్రాసి—(లేచి) ఐ రిక్వెస్టు దీ కోర్టు టూ నోట్ దట్ వర్డింగ్!

నా—ఓ-నేను ముద్దాయీల ప్లీడర్ని—నాయిష్టంవచ్చినట్టు మాట్లాడడానికి నాకు కావలసినంత అధికారం వుంది. కావలిస్తే కలకట్రా ట్వంటి సెవెన్ చూచుకోండి!

మేజి—గో ఆన్! గోఅసె డోన్టు వేస్టు మై టయిమ్!

నాయ—చిత్తం-చిత్తం. కస్తూరి చక్కదనంలోనూ సంగీతంలోనూ కూడా చాలా పేరుపడ్డ మనిషి. అది గజ్జెకట్టిందంటే అన్నహారాలు మానేసి కూర్చుంటారు. కొమ్ములు తిరిగినవారంతా దాని కొంపచుట్టూ తిరగడం నేను స్వయంగా యెరుగుదును. దానికి

ధనమే కావలిస్తే కొంపలూ గోళ్ళూ తెగనమ్మి తెచ్చి యిచ్చేవారు కోటి మంది వున్నారు. ఈ యూస్త్రీకోసం దాని కింకపని చెయ్యవలసిన యవసరం యేమీలేదు. ఇక సాక్షులసంగతి చూతాం. ఈ కేసులో అట్టెండైన సాక్షులు ఆరుగురు. స్మిత్ అండ్ కో వారి యేజంటు సాక్ష్యం చిల్లిగవ్వకు కొరగాదు. పోష్టు జవాను శర్మగారి కాపార్సిలు ఏడేటున డిలీవరు చేసిందీ చెప్పలేక పోయాడు. పార్సిలుమీద స్మిత్ అండు కో వారి పే రున్న దంటాడు. ఆ పేరు తా నెందుకు చదివాడో- డేటు మరిచిపోయినవాడు పే రెందుకు మరిచిపోలేదో కోర్టువారు ఆలోచించవలసి వుంటుంది. ఆ పార్సిలులో వున్నది ప్రస్సిక్ ఆసిడ్డని అసలే చెప్పలేక పోయాడు- కాబట్టి, యీసాక్ష్యానికి గడ్డిపరక పాటి విలువ లేదు. రంగి, తన మొగుడు తనకు ఫాల్సు యిన్ఫర్ మేషన్ చెప్పి తన్ను నిర్మలాంబగారి యింట పండుకోవడానికి వెళ్ళకుండా చేసినట్టు చెప్పింది. ఇది కేవలం విరుద్ధం. నిజంగా మొగు డల్లా చెప్పినా- నిశ్చయంగా కోర్టువారియెదుట యేపెళ్ళామూ ఆ సంగతి వప్పుకోదు. కాబట్టి, యిది కల్పనసాక్ష్య మన్నమాట స్పష్టం. ఇక్కడికి ముగ్గు రైనారు. కడమ ముగ్గుర్లో ఇద్దరు పోలీసు జవానులు. పోలీసువారి సాక్ష్యాని కెంత విలువ యివ్వాలో కోర్టువారికి విశదమయ్యే వుండును. రాత్రి రెండుగంటలవేళ రంగణ్ణి చూచా నంటాడు! రాత్రి రెండు గంటలవరకూ బీటులో మేలుకున్న కానిస్టేబిలును నే నిదివరకు చూడ లేదు! ఆ రాత్రి రంగడు కట్టుకున్నది తెల్లపంచని రంగి చెప్పింది- యెఱ్ఱపం చంటాడు కానిస్టేబిలు. కాబట్టి, వీళ్ల సాక్ష్యం కంగాళీసాక్ష్యం అని చెప్పక తప్పదు. ఇక విశ్వాసరావుగా రున్నారు. ఈ నాటకాని కీయనే నాయకుడు. ఇదే కోర్టువారు ముఖ్యంగా వినవలసిన సంగతి. ఈయన కస్తూరిని కామించినందుకే రఘునాధరావుగా రీయన్ని డిస్మిస్ చేసి, ఆవుద్యోగం శర్మగారి కిచ్చారు. ఈ కారణంచేత కస్తూరిమీదా, శర్మమీదా, కార్పణ్యం

వహించి, కసి తీర్చుకొనే నిమిత్తం- శర్మగారిపేరుతో స్మిత్ అండ్ కో వారికు త్తరం వ్రాసి, ప్రస్సిక్ ఆసిడ్ తెప్పించి, పోస్టుజవాన్ని కట్టి శర్మగారికి తెలియకుండా తనకు డిలీవరీ చేయించుకుని, దాన్ని ప్రయోగించడానికి రంగణ్ణి యేర్పాటు చేసి, తనమీద అనుమానం తగలకుండా పోయేనిమిత్తం పొరుగూరు చక్కాబోయి, పనిజరిగి నట్టు తెలిసినతరువాత పరస్పరంగా మొన్నరాత్రి చక్కావచ్చి, నిన్న పోలీసువార్ని కట్టి నిష్కారణంగా కస్తూర్నీ, శర్మగార్నీ అరెస్టు చేయించారు. రంగడికి తాము కండువా యిచ్చినట్టూ, రంగి తమయింట్లో చాలాకాలం పని చేసినట్టూ ఆయనే వప్పుకు న్నారు. అందువల్లనే, ఆ యిద్దర్నీ, యీ వ్యవహారంలో యిట్టే పని ముట్లుగా చేసికోగలిగారు. ఆయింట్లో దొరికిన వుత్తరమున్నూ, దాన్ని ప్రూవు చేయడంకోసం దాఖలుచేసిన యితర వుత్తరా లున్నూ, ఆయన సృష్టించినవే. కాబట్టి, కోర్టువారీ సంగతు లన్నీ గమనించి, మా ముద్దాయీ లిద్దర్నీ విడుదల చేయించుటకున్నూ, విశ్వాసరావుగారిపై తగుచర్య జరిపించుటకున్ను కోరుతున్నాను.

మేజి—రఘునాధరావుగారు! మీరు నేరము చేసినారా?...పలుక రేమి? మిమ్ములనే!-మీరు నేరము చేసినారా?

రఘు—(పిచ్చివానివలె) నేనా?-నేరమా!-యేమినేరము చెప్పుచూ!- ఆఁ! అర్థమైనది! అయ్యో! నే నేపాపము నెఱుఁగను!

మేజి—(వ్రాసికొని) శర్మగారు! మీరో?

రఘు—అయ్యా! నేను చెప్పఁదలఁచినది సెషన్సులోఁ జెప్పుకొనెదను.

మేజి—ఆల్ రైట్! (కస్తూరివంకఁ జూచి) నీవో?

కస్తూ—అయ్యా! సత్యము చెప్పినచో మహాప్రభువులు మన్నించి సాక్షిక్రిందఁ దీసికొందు రని పోలీసువారు చాలదూరము చెప్పినందున యథార్థము మనవిచేసికొనుచున్నాను. ఆ యుత్తరము నేను వ్రాసినదే. ఆఁడుది వ్రాసినఁ గాని, యాఁడుది వ్రాసిన ట్లుండదని శర్మగారు నన్ను చాల బలవంతపెట్టి వ్రాయించినారు.

మేజి—(వ్రాసి, రంగనివంకఁ జూచి) ఏమిరా- నీ వేమి చెప్పెదవు?

రంగ—బాబయ్యా! నాకొంప తీసినోడూ యీ సెర్మబా బేనండి! ఆవుత్తరం తలకింద పెడితే, అనుమానం యెవరిమీందా తగ ల్దని సెప్పే సరికి, ఆమాట నమ్మి-రొండొండలకోసం ఆసపడి-ఆ తాగిన తిమ్మిర్లో, ఆయమ్మను ప్రన్నెంకట్టుకున్నానండి! బాబుగార్ని పట్టుకున్నా కొణ్ణుం చీ, నాలంతట నేనే ఆజరై నడిచిందంతా చెప్పెయ్యాలను కుంటూంటే- పాపం దానంత టదే బద్దలయింది!

మేజి—(ఏమో (వ్రాసి) మొదటిముద్దాయి నిర్దోషిగాఁ దోఁచినందున విడుదల చేయుచు- కడమ ముద్దాయిలను కమిట్ చేయుడ మైనది.

[విశ్వాసరావు చటాలున రఘునాథరావుగారిని కౌఁగిలించుకొని యీవలికిఁ దీసికొనిరాఁగా- వారివెనుకఁ దెర పడును.]

రఘు—మామగారు! నా యపచారము లన్నియు మన్నించి, నన్ను విపత్తు నుండి రక్షించినందులకు మీ కనేక వందనములు కాని, యీగండము గడచినందులకు నా కావంతయు సంతోషము లేదు! ఏ మందురా?

సీ. కులగోత్రములు మాపు • కొని రేపవలు మద్య
పాన మొనర్చిన • పాపఫలము
ఎగ్గు సిగ్గులు వీడి • యేవేళ వెలయాలి
పంచను బడియున్న • పాపఫలము
అగ్ని సాక్షిగఁ బెండ్లి • యాడిన నిజధర్మ
పత్ని నేడ్పించిన • పాపఫలము
దూరదృష్టి యుడిగి • దుష్టులతో సహ
వాస మొనర్చిన • పాపఫలము
అన్నముం బున్నము నెఱుంగ • నట్టి మిమ్ముఁ
బరుషవచనంబు లాడిన • పాపఫలము
నేఁడు గాకున్న, మఱియొక • నాఁడయినను
వడ్డితోఁగూడ ననుభవిం • పంగ వలదె!

విశ్వా—బాబు! కడచినదానిని మఱచి కర్తవ్య మాలోచింపుఁడు.

రఘు—ఆలోచన కేమున్నది. ఆమె యా స్త్రీయు, నా జీవితమునుగూడ మద్యపాన నివారణమునకై వినియోగించి- పరలోకమునందైన నామె యాత్మకు పరిపూర్ణ శాంతి కలుగఁజేసెద.

విశ్వా—అట్లయిన, నా జీవితము కూడ నా యుద్యమమునందే కడపెద. ఈపూఁటకు మంగళాశాసనము కావించి, యింటి కేగుదము.

సీ. దేశంబు నానాఁట • నాశంబుఁ గావించు
మద్యపానము రూపు • మాయుఁగాక!
పేదసాదల నెల్లఁ • బీల్చి పిప్పి యొనర్చు
కల్లంగడులు నేలఁ • గలియుఁ గాక!
సంసారులను ముష్టి • సన్న్యాసులం జేయు
రమ్ముకొట్లను దుమ్ము • రాలుఁ గాక!
సంస్థానములను శ్మ • శానంబుగం జేయు
బ్రాందిషాపులు మూలఁ • బడెడుఁ గాక!
విధిగ నేఁటేఁట నీ పాడు • విషపునీళ్ల
కొఱకు వ్యయ మగు కోటాను • కోట్లు, దేశ
మునకు దక్కి దరిద్రులు • ముదుకకూడు
ముదుకగుడ్డల నేవి పొం • దుదురు గాక!

శ్రీమజ్జగద్గురు శంకరభగవత్పాద ప్రసాదాసాదిత మహాకవిబిరుదాంక
భారద్వాజ గోత్రార్ణవ శశాంక, కవిఘంటా కలాప హస్త
కాళ్ళకూర్యన్వయ ప్రశస్త, బంగారురాజ కవిరాజ
తనూజ, నారాయణ రాయామాత్య బిడౌజ
ప్రణీతంబగు మధుసేవా ప్రకరణము
సంపూర్ణము.

# సుప్రసిద్ధ నాటక రాజములు

| | |
|---|---|
| తులసిదేవి నాటకము (ముత్తినేని వెంకట చెన్న కేశవులుగారు) రు | 1-0-0 |
| భక్త రామదాసు (కేతవరపు శివరామశాస్త్రిగారు) | 1-0-0 |
| పాంచాలి మానసంరక్షణము (కేతవరపు రామకృష్ణశాస్త్రిగారు) | 1-0-0 |
| సంగీత మార్కండేయ ,, | 0-12-0 |
| చింతామణి (రామనారాయణ కవులు) | 1-0-0 |
| జయంతజయపాలము (బద్దిరెడ్డి కోటేశ్వరరావు) | 0-12-0 |
| సంగీత సావిత్రి (సోమరాజు రామానుజరావు) | 1-0-0 |
| లక్ష్మణమూర్ఛ ,, | 0-12-0 |
| శకుంతల ,, | 0-12-0 |
| సుగ్రీవ పట్టాభిషేకము ,, | 1-0-0 |
| సంగీత ప్రహ్లాద ,, | 1-0-0 |
| పద్మవ్యూహము ,, | 1-0-0 |
| రామరావణయుద్ధము ,, | 0-12-0 |

వలయువారు :

జనరల్ బుక్ డిపో,
బెజవాడ (కృష్ణాజిల్లా)

# మహాకవి కాళ్లకూరి నారాయణరావుగారివి

## మాయొద్ద సిద్ధముగా నున్న నాటకములు

### చింతామణి - రు 1

ఆసేతు హిమాచలము వఱకును వ్యాపించి, అఖండ యశస్సు నార్జించి - అనేక చింతామణులం బుట్టించిన అసలు చింతామణి.

### పద్మవ్యూహము - రు 1

బహు రసవంతమైన భారత నాటకము. అభిమన్యుని యుద్ధఘట్ట మిందు అత్యద్భుతముగా వర్ణింపఁబడినది. చదివినకొలఁది చవులూరి - శరీరము పులకించి- మనసు పరవశ మగును! అక్షర నిక్షేపము!

### వరవిక్రయము - రు 1

వరవిక్రయ మనఁగా :— వర్తమానకాలమునందలి వరశుల్క పిశాచముపైఁ బ్రయోగింపఁబడిన వజ్రాయుధము! పాఠకులపాలిటి భగవత్ప్రసాదము! వరశుల్కముల వైఖరులు— మగపెండ్లివారి మారాముళ్లు— ఆఁడుపెండ్లివారి యవస్థలు -చదివిన చక్కఁగా బోధ పడగలదు.

### మధుసేవ - రు 1

మధుసేవ యన: మన దేశమున కిప్పుడు మహాశత్రువై యున్న మద్యపానముపైఁ బ్రయోగింపఁబడిన మారణాస్త్రము! కడుపు చెక్కలగు హాస్య రసమును, కన్నీరు మున్నీరగు కరుణ రసమును సర్వత్ర పొంగి పొరలుచుండును! ఇట్టి నాటక మిదివఱకు పుట్టలేదు.

### చిత్రాభ్యుదయము - రు 1

సరసమై, సభ్యమై, శ్లాఘ్యమై, సత్యమైన సారంగధర నాటకము. ప్రతిపద్యమును బంగారు తునక. బహు చిత్రము! బహు చోద్యము!

వలయువారు:—

జనరల్ బుక్కు డిపో,

బెజవాడ.